Postel No. MBN/08/2016-2018




పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల రోగాలకు సమూలంగా వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895


# వార్తాతరంగాలు


జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :23 | సంచిక :96 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | బుధవారం 23 జులై 2025 | పేజీలు :12 | వేల రూ5 /-


## కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలి

### అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు

**హైదరాబాద్, జుల్కై 22:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పలు అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో జిల్లా కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని, ఆయా సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు చేరే విధంగా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి,పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం ఉదయం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ రామకృష్ణారావు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూభారతి, వివిధ రెసిడెన్షియల్ స్కూళ్లలో భోజన, మౌలిక వసతుల ఏర్పాటు, వనమహోత్సవంలో మొక్కలు నాటడం, మహాలక్ష్మి పథకం తదితర అంశాలపై సమీక్ష చేశారు. రాష్ట్ర మంత్రులు వివిధ అంశాల వారీగా జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు కలెక్టర్లు, అధికారులు నిర్విరామంగా కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలనలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఈ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందని, క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్లు, అధికారులు ముఖ్య పాత్ర పోషించాలని, పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ఎన్నో పథకాల ఫలితాలను వారికి అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, దానికగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని మంత్రులు స్పష్టం చేశారు.

**సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం సరఫరా...**

గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాలకనుగుణం సాంఘిక, బిసి, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, హాస్టళ్లలో నిర్వాహణపై ఎప్పుటికప్పుడు తనిఖీలు నిర్వహించి వారంలో ఒక్కరోజు అధికారులందరూ ఆ హాస్టళ్లలో బస చేయాలని కలెక్టర్లను మంత్రులు ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ



ప్రధాన కార్యదర్శి శ్రీ రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లకు వీటి నిర్వాహణపై పలు సూచనలు చేశారు. పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా నాణ్యమైన భోజన వసతి కల్పించాలని ఆదేశించారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పించాలని, వారి నుంచి ఎలాంటి ఫిర్యాదులు రావొద్దని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమారులు జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. హాస్టళ్ల ప్రాంగణాల్లో పచ్చదనం పరిశుభ్రతల్లో భాగంగా శానిటేషన్‌ను చేపట్టాలని, అన్ని జిల్లాల్లో ఎగ్ టెండర్స్ ప్రక్రియను త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నెలకోసారి పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు.మహాలక్ష్మి పథకంలో భాగంగా రేపటికి 200 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, ఈ సందర్భంగా 97 బస్సు డిపోలు, 321 బస్‌స్టేషన్లలో వేడుకలను నిర్వహించాలని సూచించారు.

**ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రగతి సాధించాలి...**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ లక్ష్యాల మేరకు అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో ఇసుక కొరత లేకుండా కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని, ఇసుక రవాణాలో లబ్ధిదారుడినికి ఉచితంగా అందజేయాలని, ఇసుక రవాణా విషయంలో లబ్ధిదారునికి ఎలాంటి భారం కలుగకుండా చూడాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ప్రతి వారం దీనిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రగతిని సమీక్షిస్తానని మంత్రి తెలిపారు. భూభారతిలో నమోద్కెన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో విరివిగా మొక్కలు నాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్యకార్యదర్శులు నదీమ్, ఎన్. శ్రీధర్, దానకిషోర్, నవీన్‌మిట్టల్, యోగితారాణా, క్రిస్టినా చొంగ్తూ, కార్యదర్శులు లోకేశ్‌కుమార్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్, విపి గౌతమ్, పిసిసిఎఫ్ సువర్ణ, ఇ.శ్రీధర్, సృజన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సంసి ద్ధం చేయాలి

### బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు పార్టీ ఆదేశం



**హైదరాబాద్ జూలై 22:**స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశా లు నిర్వహించాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు నిర్ణయించారు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రభుత్వ నిర్వహించే అవకాశం ఉందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ సమావేశాలతో స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సంసి ద్ధం చేయాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు పార్టీ నేతలను ఆదేశించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు తమ జిల్లాల్లోని ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఈ సమావేశాలు నిర్వహించేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశాల్లో పార్టీ ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, ఎంపిలు, జెడ్‌పి చైర్మన్లు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సీనియర్ నేతలు పాల్గొనాలని అన్నారు.తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీను అమలుచేయకుండా కాంగ్రెస్ చేస్తున్న మోసాలతో పాటు రేవంత్ ప్రభుత్వ అవినీతి, అప్రజాస్వామిక విధానాలు, వైఫల్యాలను గ్రామగ్రామాన విస్తృతంగా ప్రచారం చేయాలని కెటిఆర్ దిశానిర్దేశం చేశారు. రైతుబంధు ఇవ్వకుండా అన్నదాతలకు రేవంత్ సర్కార్ చేసిన ద్రోహాన్ని ప్రజలకు వివరించాలని తెలిపారు. రాష్ట్రంలో యూరియా, విత్తనాల కొరత తీవ్రంగా వేధిస్తున్నా కూడా ఈ ప్రభుత్వం ఆ సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైనాన్ని తెలియచేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన 20 నెలల నుంచి సాగునీటి నుంచి విద్యుత్ సరాఫరా దాకా అన్నదాతలకు కాంగ్రెస్ చేస్తున్న మోసాన్ని చెప్పాలని పేర్కొన్నారు.

**గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం**

ప్రభుత్వ చేతకానితనంతో పాలన అస్తవ్యస్తంగా మారి గ్రా మాల్లో పారిశుద్ధ్యం పడకేసిందన్న సంగతిని ప్రజలకు చెపా ్పలని కెటిఆర్ పార్టీ నేతలకు చెప్పారు. బిసిలకు ఇస్తానన్న 42 శాతం రిజర్వేషన్ల విషయంలో చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ సర్కార్ ఆర్డినెన్స్ పేరుతో ఆడుతున్న డ్రామాలను ప్రజలకు విడమిరిచి చెప్పాలని పేర్కొన్నారు. అంతేకాకుండా వివిధ రంగాలకు డిక్లరేషన్‌ల పేరుతో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఆయా రంగాలను మోసం చేసిన తీరును వివరించాలని అన్నారు. వృద్దులకు పెంచుతానన్న రూ.4 వేల పెన్షన్‌తో పాటు ఆడబిడ్డలకు నెలకు ఇస్తానన్న 2500 రూపాయలతో పాటు ఇతర హామీలను అమలుచేయకుండా కాంగ్రెస్ సర్కార్ చేస్తున్న ద్రోహాలను విడమరిచి చెప్పాలని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల తరఫున గత 20 నెలల కాలం నుంచి కాంగ్రెస్‌పార్టీ పైన బిఆర్‌ఎస్ చేస్తున్న ప్రజా పోరాటాలు, నిరసన కార్యక్రమాలను ప్రజలకు గుర్తుచేసేలా పార్టీ కార్యకర్తలను సమాయత్తం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాలను ఈ వారంలోనే ప్రారంభించి రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ముఖ్య కార్యకర్తల సమావేశాలు జరిగేలా చూడాలని కెటిఆర్ తెలిపారు.

## రష్యాతో వాణిజ్యం.. మీ ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తాం

### భారత్‌కు అమెరికా వార్నింగ్

**న్యూ డిల్లీ జూలై 22:**భారత్‌కు అగ్రరాజ్యం అమెరికా మరోసారి కీలక హెచ్చరికలు జారీ చేసింది. రష్యా నుంచి ఆయిల్ దిగుమతి చేసుకుంటే 100 శాతం సుంకాలు విధించనున్నట్లు యూఎస్ సెనేటర్ లిండ్సే గ్రాహమ్ హెచ్చరించారు. భారత్ మాత్రమే కాకుండా రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు చేసే చైనా , బ్రెజిల్ వంటి దేశాలకు కూడా ఇలాంటి హెచ్చరికలే చేశారు. రష్యా నుంచి తక్కువ ధరకు ఆయిల్ కొనుగోలు చేసి యుద్ధం కొనసాగించేందుకు సహకరిస్తున్న దేశాల ఆర్థిక వ్యవస్థను నాశనం చేస్తామంటూ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

## బీసీల రిజర్వేషన్లు అమలు కాకుండా కుట్రలు చేస్తున్నకాంగ్రెస్, బీజేపీ పార్టీలు

### తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**హైదరాబాద్ జూలై 22:** బీసీల రిజర్వేషన్లు అమలు కాకుండా కాంగ్రెస్, బీజేపీ రెండు జాతీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. మంగళవారం తెలుగు యూనివర్సిటీ వద్ద కవిత మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును శాసనసభ, మండలిలో ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వం పంపిందని.. కానీ రిజర్వేషన్‌లకు మతం రంగు పులిమి రాష్ట్రపతి వద్దకు కేంద్ర ప్రభుత్వం పంపలేదని చెప్పుకొచ్చారు ఎమ్మెల్సీ కవిత.తెలంగాణలో బీజేపీకి ఓట్లు రావని తెలిసే, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు రిజర్వేషన్ల బిల్లు తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చలేమని మాట్లాడారని ఎమ్మెల్సీ కవిత గుర్తుచేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో 50 శాతానికి పైగా రిజర్వేషన్లు అమలు చేస్తూ, దక్షిణాది రాష్ట్రాల్లో న్యాయపరమైన సమస్యలు అంటూ దాటవేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికి 50 సార్లకు పైగా ఢిల్లీ వెళ్లారని.. కానీ రిజర్వేషన్లపై ప్రధానమంత్రి నరేంద్రమోదీపై ఒత్తిడి ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి, 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో కెవిట్ పిటీషన్ వేసి, రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ తీసుకొచ్చి, చట్టబద్ధత కల్పించాలని ఎమ్మెల్సీ కవిత కోరారు.

## రేవంత్ సోత్కర్షపై చర్చోపచర్చలు



**మహబూబ్ నగర్, జూలై 22:**నాయకుడు ఎప్పుడూ కళ్లు నెత్తిమీద పెట్టుకోవద్దు.. ఎప్పుడూ కాళ్లు నేల మీద ఉండాలి. తాము ఎక్కడి నుంచి వచ్చాము.. ఎలా ఎదిగామన్నది మరవకూడదు. అసలు మూలాలు మరిచిపోవద్దు. అలా మరిచిపోతే మనం మంచి నేతగా నిలబడలేం. వైఎస్ఆర్ ఈ విషయంలో ఆదర్శుడు. ఆయన తన మూలాలు మరిచిపోకుండా సీఎం అయినా కూడా గతంలో తనకు సాయం చేసిన వారిని గుర్తు పెట్టుకున్నాడు. వారికి అండగా నిలిచాడు..కానీ తెలంగాణ సీఎం అయ్యాక రేవంత్ రెడ్డిలో వచ్చిన ఈ మార్పు విమర్శలకు దారితీస్తోంది. అవును.. ఎదోలా దక్కా మొక్కీలు తిని రేవంత్ సీఎం అయ్యాడు. టీడీపీ నుంచి కాంగ్రెస్ లోకి.. తర్వాత కేసీఆర్ ను ఎదురించి జైలు పాలు కావడం.. సానుభూతి రావడం.. ఇలా ఒక్కో మెట్టు ఎక్కాడు.అయితే సీఎం అయ్యాక తన వర్గానికే పదవులు ఇచ్చుకుంటున్నారని.. తాను చెప్పిన వారినే అందలమెక్కిస్తున్నాడన్న విమర్శలు ఉన్నాయి. సరే వ్యతిరేకత రాకుండా ఏ నేత అయినా ఇలానే చేస్తాడు.. అందులో తప్పు పట్టడానికి ఏం లేదు..కానీ తాను నియామకం చేసిన నేతల విషయంలోనే రేవంత్ రెడ్డి తీరు వివాదాస్పదమవుతోంది. అదే అందరికీ రేవంత్ పై నెగెటివిటీని వ్యాపింపచేస్తోంది. రేవంత్ రెడ్డి బడుగు బలహీన వర్గాల వారికీ పదవులు ఇచ్చాడు మెచ్చుకోవాల్సిందే.. కానీ ఆ పదవులు ఇచ్చి వారిని నేనే ఇలా చేశానని.. వారి కులగోత్రాలను అందరి ముందు చెప్పడం మాత్రం ఏమాత్రం మంచి పద్ధతి కాదు..చేసిన సాయం మరొకరికి తెలియకుండా నడవాలంటారు. సాయం చేసిన మనం చెప్పొద్దు.. అందుకున్న వారు చెబితేనే దానికి విలువ.. తాజాగా రేవంత్ రెడ్డి ఇద్దరిని మంత్రులుగా చేశాడు. ఓ బీసీ సభలో అది తన ఖాతాలో వేసుకున్నాడు. ఆ క్రెడిట్ నాదేనంటూ మాట్లాడిన మాటలు బూమరాంగ్ అయ్యాయి. వారిని తిట్టాడా? లేక పొగిడాడా? అన్న కోణంలో వైరల్ అయ్యాయి.. "బట్టలు ఉతికే జాతికి చెందిన వీర్లపల్లి శంకర్‌ని ఎమ్మెల్యే చేశాను.. చేపలు పట్టుకునే వాకిటి శ్రీహరిని ఇవాళ మంత్రిని చేశాను" అన్న డైలాగులు విమర్శల పాలయ్యాయి..ఎంత చేసినా ఆ క్రెడిట్ ను చెప్పుకోవడానికి ఆ నేతలను అవమానించేలా మాట్లాడడంపైనే విమర్శలు వస్తున్నాయి. చేసింది చెప్పుకోవడం గొప్ప కాదు.. పదిమంది చెప్పుకునేలా చేయడం గొప్ప. ఆ విషయాన్ని రేవంత్ గ్రహిస్తే మేలు అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. బట్టలు ఉతికే జాతికి చెందిన వీర్లపల్లి శంకర్‌ని ఎమ్మెల్యే చేశాను చేపలు పట్టుకునే వాకిటి శ్రీహరిని ఇవాళ మంత్రిని చేశాను సీఎం రేవంత్ రెడ్డి

## ఉపరాష్ట్రపతి రాజీనామాను ఆమోదించిన ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము

### ఉపరాష్ట్రపతి రాజీనామాపై స్పందించిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

### మంచి ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్ష



**న్యూ డిల్లీ జూలై 22:**ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్ రాజీనామాను ప్రెసిడెంట్ ద్రౌపది ముర్ము ఆమోదించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్రపతి ముర్ము ఫైల్ పై సంతకం చేసింది. ఆ తర్వాత ఆ రాజీనామాను కేంద్ర హెూంమంత్రిత్వ శాఖకి పంపారు.అలాగే దీనికి సంబంధించి త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. అనారోగ్య కారణాలతో ధన్ ఖడ్ రాజీనామా చేయగా .. ఆయన ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రధాని మోడీ వ్యాఖ్యనించారు. ఈ నేపథ్యంలో ఉపరాష్ట్రపతి రాజీనామాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. ఉపరాష్ట్రపతి సహా వివిధ హెూదాల్లో దేశానికి సేవ చేసేందుకు ధన్‌ఖడ్‌కు అనేక అవకాశాలు లభించాయన్నారు. ఆయన మంచి ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

## సంపాదకీయం


# యథేచ్ఛగా ఉల్లంఘనలు

ప్రపంచ తత్వవేత్త కారల్ మార్క్స్ 1867 క్యాపిటల్ గ్రంథంలో ఒక అంశాన్ని నొక్కి చెప్పారు. 'పెట్టుబడిదారుల, కార్మికుల మధ్య వర్గ పోరాటమంటే పని గంటల పోరాటమే' అన్నారు. ఎప్పుడో పద్దెనిమిదవ శతాబ్దకాలంలో చెప్పిన ఆయన మాటలు రెండు వందల సంవత్సరాలు దాటినా మననం చేసుకుంటున్నామంటే నేటికీ కార్మికవర్గాన్ని పెట్టుబడిదారి సమాజం ఎంతగా దోచుకుంటుందో అర్థం చేసుకోవచ్చు. దేశంలో మిత్రపక్షాల సహకారంతో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ కార్పొరేట్లకు మరింత ఊడిగం చేసేందుకు పావులు కదుపుతున్నది. కార్మిక చట్టాల స్థానంలో లేబర్‌కోడ్స్ తెచ్చి అమలు చేయజూస్తోంది. ఓవైపు దాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఉద్యమిస్తున్న కార్మికులపై రాష్ట్ర ప్రభుత్వం పుండుమీద కారం చల్లింది. జూలై 5న పని గంటలు 8 నుండి 10కి పెంచుతూ జీఓ నెం.282ను విడుదల చేసింది. తెలంగాణ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-1988 పరిధిలోకి వచ్చే సంస్థల్లో పని దినానికి అనుమతించింది. బీజేపీ విధానాలకు తాము వ్యతిరేకమని నిత్యం మాట్లాడే కాంగ్రెస్ సర్కార్ రాష్ట్రంలో యాజమాన్యల లాభాల కోసం "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" పేరిట ఈ జీఓ తెచ్చింది. కార్మికుల శ్రమను దోచిపెట్టడంలో బీజేపీ, తమకు విధానపరంగా తేడా లేదని కాంగ్రెస్ నిరూపించింది. కేంద్రంలో 'బడా భారు' లేబర్ కోడ్‌లు తెస్తే రాష్ట్రంలో 'చోటా భారు' షాప్స్ యాక్ట్‌కు సవరణలు చేశారు. తెలంగాణ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్-1988 పరిధిలోకి వచ్చే సంస్థల్లో రోజుకు పది గంటల పని దినం పెంచుతూ షాప్స్‌కు మినహాయింపు ఉంటుందని జీఓలో పేర్కొన్నారు. ఈ చట్టంలోని సెక్షన్ 16, 17లకు సవరణలు చేస్తూ వ్యాపార సంస్థల్లో, కార్యాలయాల్లోని ఉద్యోగులంతా ఇక నుండి రోజుకు పది గంటలు పనిచేయాలి, వారానికి 48 గంటలు మించరాదని నిబంధన పెట్టారు. అలాంటప్పుడు ఆరు రోజులు రోజు పది గంటలకు ఎందుకు పెంచారు? సమాధానం లేదు. వారానికి అరవై గంటలు పని చేయిస్తారు. మూడు నెలల్లో 144 గంటలకు మించరాదని పేర్కొన్నారు. రోజులో ఆరు గంటలు పని చేస్తే అరగంట మాత్రమే విశ్రాంతి ఉంటుందట. కార్మికులు యంత్రాల మాదిరి పనిచేయాలి. ఓవర్ టైమ్ వేతనాలతో రోజుకు పన్నెండు గంటలు పెంచుకోడానికి వారానికి 72 గంటలకు అవకాశం కల్పించారు. కేంద్రం లేబర్ కోడ్‌లో కూడా ఇదే చెప్పింది. ఇన్ఫోసిస్, ఐటి అధిపతులు ఇదే కోరారు. పక్క రాష్ట్రంలోని ప్రపంచ బ్యాంకు ప్రియమైన ముఖ్యమంత్రి అన్ని కంపెనీల్లో, ఫ్యాక్టరీల్లో పది గంటలు పనిదినానికై నిర్ణయం తీసుకున్నారు. గతంలో యుపి, మధ్యప్రదేశ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పన్నెండు గంటల పనిదినం ప్రవేశపెట్టారు. ఇటీవల కర్నాటక, తమిళనాడులో ఇదే ప్రయత్నం చేశారు. ఇదే కోవలో రాష్ట్రంలో పనిదినం పెంచింది. తర్వాత అన్ని కంపెనీలకు వర్తించే విధంగా తీసుకువస్తారు. రాష్ట్రంలో కార్మిక శాఖ లెక్కల ప్రకారం 7,79,223 ఎస్టాబ్లిష్‌మెంట్స్ ఈ జీఓ పరిధిలో ఉన్నాయి. ఇందులో సుమారు 24,66,360 మంది ఉపాధి పొందుతున్నారు. వీరికి షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ జీఓ నెం.116 (2007) ప్రకారం వేతనాలు నిర్ణయించారు. నేటికి కనీస వేతనం రూ.12,420లు మాత్రమే. 18 ఏండ్లు గడిచినా కనీస వేతనాలు సవరించలేదు. ప్రతి ఐదేండ్లకోసారి సవరించాలి. అందుకు ప్రభుత్వాలు సిద్ధపడలేదు. కానీ 365 రోజులు 24 గంటలు తెరిచి వ్యాపారం చేసుకోడానికి పది గంటల పాటు పని చేయించుకోడానికి ఆగమేఘాల మీద జీఓ ఇచ్చారు. ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు ఇంత కన్నా నిదర్శనం ఏముంటుంది? అధిక పనిగంటల వల్ల కార్మికులు, ఉద్యోగులు ఎంత నష్టపోతారు? వ్యాపారులు ఎంత లాభ పడతారో పరిశీలిద్దాం! ఉదా: కార్మిక శాఖ షాప్ ఎంప్లాయీస్‌కు ఇచ్చిన జీఓ 116 ప్రకారం సగటున రూ.13వేలు కనీస వేతనం ఉంది. రోజుకు పదిగంటల చొప్పున నెలకు 26 రోజులకు గాను 260 గంటలు పని చేస్తారు. 8 గంటల చొప్పున 208 గంటలే పని చేయాలి. 52 గంటలు ఓవర్‌టైమ్‌కు డబుల్ వేతనం లెక్కిస్తే చట్టం ప్రకారం మరో రూ.6,500లు ఇవ్వాలి. మొత్తం 25 లక్షల మందికి ఓవర్‌టైమ్ వేతనాలను లెక్కిస్తే నెలకు రూ.1,625 కోట్లు, ఏడాదికి రూ.19,500 కోట్లు రెండు గంటలు పని పెంచడం వల్ల కార్మికులు శ్రమదోపిడీకి గురవుతారు, యజమానులు లాభపడతారు. పెరిగిన ధరల ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కార్మిక సంఘాలు ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నాయి. ప్రభుత్వం కనీస వేతనాలు పెంచకపోవడం వల్ల ఒక్క ఉద్యోగి నెలకు రూ.13వేలు ఇప్పటికే నష్టపోతున్నాడు. అవి లెక్కిస్తే 25 లక్షల మందికి ఏడాదికి మరో రూ.32,500 కోట్లు నష్టపోతున్నారు. ఇదంతా ఏడాది లెక్కనే. రాష్ట్రంలోని మొత్తం 73 షెడ్యూల్డ్ ఎంప్లారుమెంట్స్‌లో కోటి మందికి పైగా ఉన్నారు. వారందరికీ లెక్కిస్తే ఏడాదికి లక్షా 30 వేల కోట్ల రూపాయలు కార్మికులు దోపిడీకి గురవుతున్నారు. పెట్టుబడిదారి వర్గం ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి వేతనాలు పెంచనివ్వడం లేదు. ఏండ్ల తరబడి వేతన సవరణ కూడా లేదు. కార్మిక శాఖ ప్రతి పాదనలపై ముఖ్యమంత్రి మంత్రులతో కమిటీ వేసి వేతనాలు ఎలా తగ్గించాలా అని ఆలోచిస్తున్నారు. పని గంటలు పెంచడానికి మాత్రం కమిటీ వేయలేదు. చర్చ కూడా జరగలేదు. గుట్టుచప్పుడు కాకుండా జీవో జారీచేశారు. కార్మికుల శ్రమను దోచుకోవడం వల్ల పోగుపడిన పెట్టుబడి క్రమంగా గుత్త పెట్టుబడిగా మారింది. ప్రపంచీకరణ వల్ల విశ్వవ్యాప్తంగా ఫైనాన్స్ పెట్టుబడిగా విస్తరించింది. అది ఇప్పుడు దేశాల ఆర్థిక వ్యవస్థలనే అతలాకుతలం చేస్తున్నది. తన ఆటంకాలను తొలగించాలని ఒత్తిడి చేస్తున్నది. వాటిలో కీలకమైంది కార్మిక సంక్షేమ చట్టాల మార్పు లేదా రద్దు చేయడం. చారిత్రకంగా ఎన్నో పోరాటాలు, త్యాగాల వల్ల ఎనిమిది గంటల పనిదినం సాధ్యమైంది. ప్రపంచ చరిత్రలో మొదటిసారిగా 1810 రాబర్ట్ ఓవెన్‌లో 8 గంటల పనిదినం ఆలోచన రేకెత్తింది. 1817లోనే 8 గంటల పని, 8 గంటలు విశ్రాంతి, 8 గంటల వినోదం ఫార్ములా ముందుకు తెచ్చింది. ఇంగ్లాండ్‌లో కార్మికవర్గం పోరాడి 1847లో ఫ్యాక్టరీల చట్టం ద్వారా పది గంటలు చట్టబద్ధమైంది. 1866లో అంతర్జాతీయ వర్కింగ్ మెన్ అసోసియేషన్‌లో మార్క్స్ చొరవతో తీర్మానం చేసింది. 1886 అమెరికా చికాగో వీరుల త్యాగం తెలిసిందే. రష్యా విప్లవం తర్వాత ఎనిమిది గంటల పని అనేక దేశాలు సాధించుకున్నాయి. భారతదేశంలోనే 1862 హౌరా రైల్వే కార్మికుల సమ్మె 8 గంటల పని కోసం జరిగింది. 1919 ఐఎల్ఓ ఏర్పడ్డ తర్వాత అన్ని దేశాల్లో అమలు ప్రయత్నాలు ఊపందుకున్నాయి. ఐఎల్ఓ మొదటి కన్వెన్షన్‌లోనే 8 గంటల పనిదినం నిర్ణయమైంది. కానీ దీన్ని మోడీ ప్రభుత్వం ఉల్లంఘిస్తున్నది. రాష్ట్రంలోని కాంగ్రెస్ కూడా ఐఎల్ఓ కన్వెన్షన్ తీర్మానాన్ని ధిక్కరించి పెట్టుబడిదారులకు కార్మిక వర్గాన్ని తాకట్టు పెట్టి బానిసత్వంలోకి నెట్టివేస్తున్నది. ప్రధాని, ముఖ్యమంత్రి ఇద్దరు పెట్టుబడిదారుల కోసం ప్రపంచ పర్యటనలు చేస్తున్నారు. అక్కడి దేశాల పనిగంటలు పరిశీలించారా? అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, స్వీడన్, ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్ లాంటి దేశాల్లో ఐదు రోజుల పని, రెండు రోజుల పాటు సెలవులిస్తున్నారు. వారానికి 30 గంటల నుండి నలభై గంటలలోపే అమలు చేస్తున్నారు అవసరాలకు సరిపడే వేతనాలు నిర్ణయిస్తున్నారు.కానీ మన దేశంలో పనిగంటలు పెంచుతూ చట్టాలు చేస్తున్నారు. బహుళజాతి కంపెనీలు మన దేశంలో చవకగా లభించే శ్రమశక్తి దోచుకోడానికి వస్తున్నాయి. సంపద మూటగట్టుకొని పోతున్నాయి. అందుకు పాలకవర్గాలు విధానాలను మార్పు చేసి ఏకపక్షంగా సహకరిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర కార్మికవ్యతిరేక నిర్ణయాల్ని దేశంలో వామపక్ష, ప్రజాతంత్ర శక్తులు మాత్రమే ప్రతిఘటిస్తున్నాయి. పది కార్మిక సం ఘాలు ఒక్కటై జూలై 9న 25 కోట్ల మందితో సమ్మె చేశాయి. అయినప్పటికీ పాలక వర్గాల్లో మార్పురావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో కార్మికవర్గమంతా ఒక్కతాటిపైకి రావాలి. దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినం కోసం మరో చారిత్రక పోరాటానికి సిద్ధమవ్వాలి.

# నేడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి

## భారత స్వాతంత్ర్యోద్యమంలో దేశమాత విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి అమరుడైన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్

భారత స్వాతంత్ర్యోద్యమంలో దేశమాత విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి అమరుడైన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్.. అజాద్ ఈ పేరు వింటే చాలు తెల్లదొరలు గుండెల్లో రైళ్లు పరిగెత్తేవి. ఎక్కడ ఏ విధ్వంసానికి పథకం రచించి, తమపై దాడి చేస్తాడోనని ప్రాణాలు అరచేతబెట్టుకునేవారు. బ్రిటిషర్ల దాస్య శృంఖలాల నుంచి భరతమాతకు విముక్తి కలిగించడం కోసం ఎందరో మహాత్ములు తమ ప్రాణాలను ఫణంగా పెట్టారు. మరెందరో వీరులు ఉరికంబమెక్కారు. అలాంటి వారిలో ముఖ్యులు భగత్ సింగ్, చంద్రశేఖర్ అజాద్. అత్యంత పిన్నవయసులోనే దేశం కోసం తమ జీవితాన్నే అర్పించిన మహాపురుషులు. దేశం గర్వించదగ్గ ఆ మహాపురుషుల్లో చంద్రశేఖర్ అజాద్ కూడా ఒకరు. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్, పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్ కిషన్ ఖన్నా మరియు అష్ఫాకుల్లా ఖాన్‌ల సహచరుడిగా బ్రిటీషువారి గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన చంద్రశేఖర్ ఆజాద్ మనదేశం గర్వించదగ్గ అసమాన వీరుడు. భగత్ సింగ్ మార్గ నిర్దేశకుడిగా పేరుగాంచిన ఆజాద్ పూర్తిపేరు చంద్రశేఖర సీతారామ్ తివారి. ఈయన పండిత్‌జీగా కూడా పిలువబడ్డారు.మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఝాబువా జిల్లా, బాబ్రా (భాబ్ గా) గ్రామంలో పండిట్ సీతారామ్ తివారి, జగరానీ దేవీలకు 1906 జూలై 23వ తేదీన చంద్రశేఖర్ ఆజాద్ జన్మించారు. ప్రాథమిక విద్యను సొంత గ్రామంలోనే పూర్తి చేసిన ఈయన వారణాసిలో సంస్కృత పాఠశాలలో హయ్యర్ సెకండరీ విద్యను అభ్యసించారు.1919లో అమృత్‌సర్‌లో జరిగిన జలియన్ వాలాబాగ్ దుర్ఘటనతో తీవ్రంగా కలతచెందిన ఆజాద్.. ఆ తరువాత 1921లో మహాత్మాగాంధీ నడిపిన సహాయ నిరాకరణోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఈ ఉద్యమంలో పాల్గొన్న నేరానికిగానూ ఈయన తన పదిహేనేళ్ల ప్రాయంలోనే అరెస్టయ్యారు.విచారణ సందర్భంగా కోర్టులో "నీ పేరేంటి?" అని మెజిస్ట్రేట్ అడిగిన ప్రశ్నకు ఆయన పెద్ద శబ్దంతో "ఆజాద్" అని అరచి చెప్పారు. దాంతో ఆయనకు మెజిస్ట్రేట్ 15 కొరడా దెబ్బలు శిక్షగా విధించాడు. అయితే ప్రతి కొరడా దెబ్బకు ఆయన భారత్ మాతాకీ జై (వందేమాతరం) అంటూ గొంతెత్తి నినదించారు. ఇక అప్పటినుంచి చంద్రశేఖర్ ఆజాద్‌గా ఆయన పేరు స్థిరపడిపోయింది.సహాయ నిరాకరణోద్యమం ఆజాద్‌లో దాగి ఉన్న విప్లవవాదిని మేల్కొలిపింది. ఎలాగైనా సరే భారతదేశాన్ని బ్రిటీష్‌వారి కబంధ హస్తాల నుంచి విడిపించాల్సిందేనని ఆయన బలంగా నిశ్చయించుకున్నారు. అనుకున్నదే తడవుగా ఆయన హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్‌ను స్థాపించారు. భగత్ సింగ్, సుఖదేవ్, తదితరులకు మార్గనిర్దేశకుడిగా మారారు.1928వ సంవత్సరంలో పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడి కన్నుమూసిన 'పంజాబ్ కేసరీ లాలాలజపతిరాయ్ మృతికి ప్రతికారంగా రాజ్ గురు, భగత్ సింగ్, బ్రిటీష్ పోలీస్ అధికారి సాండర్స్ ను కాల్చి చంపగా, సాండర్స్ వెంట వచ్చిన హెడ్ కానిస్టేబుల్ రాండ్ ను అజాద్ కాల్చి చంపాడు. ఉత్తర ప్రదేశ్, పంజాబ్ ప్రభుత్వాలు ఆజాద్ ను సజీవంగా పట్టుకునే ప్రయత్నం చేశాయి. అతనిని ప్రాణాలతో తీసుకువచ్చినా లేక చంపి తెచ్చినా 30 వేల రూపాయలు బహుమతిగా ప్రకటించారు. అ రోజు 1931, ఫిబ్రవరి 27, శుక్రవారం అలహాబాదులోని ఆల్ఫ్రెడ్ పార్క్‌కు చేరుకోగా, ఇన్ఫార్మర్లు ఇచ్చిన సమాచారం మేరకు బ్రిటీష్ పోలీసులు చుట్టుముట్టారు. ఆజాద్‌ను లొంగిపోవాలంటూ హెచ్చరికలు చేశారు. అయినా కూడా మొక్కవోని ధైర్యంతో పోలీసులకు లొంగకుండా, ఒక్కడే పోరాడుతూ ముగ్గురు పోలీసులను హతమార్చారు. అలసిపోయేదాకా పోరాడిన ఆయన చివరి క్షణంలో తన వద్ద మిగిలిన ఒకే ఒక్క బుల్లెట్‌తో తనను తానే కాల్చుకుని అశువులు బాసారు. అజాద్ పోరాడిన తీరు భారతదేశ విప్లవ చరిత్రకే వన్నె తెచ్చిన ఘటన. భారతీయ యువత ముందు నిలిచిన ఒక మహోజ్వల ఉదాహరణ.



# ఏఐ హాబ్ గా భారత్....

**బెంగళూరు, జూలై 22:** ఈ ప్రపంచంలో ఎక్కడైనా సరే ఉత్పత్తికి తగ్గట్టుగా డిమాండ్ ఉంటేనే ఉపాధి లభిస్తుంది. ఉత్పత్తి అధికంగా ఉండే డిమాండ్ తక్కువగా ఉంటే ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయి. అలాగే డిమాండ్ అధికంగా ఉండి ఉత్పత్తి తక్కువగా ఉంటే అప్పుడు కూడా ఉపాధి అవకాశాలు ప్రభావితమవుతాయి.. అందువల్లే ఉత్పత్తికి, డిమాండుకు వ్యత్యాసం ఉండకూడదని.. ఇవి రెండు సమాంతరంగా సాగిపోవాలని ఆర్థిక నిపుణులు చెబుతుంటారు. దీనినే ఆర్థిక శాస్త్ర పరిభాషలో క్షీణోపాంత సూత్రం అని పిలుస్తుంటారు. నేటి కాలంలో ఈ సిద్ధాంతాన్ని అనేక దేశాలు పాటిస్తుంటాయి.. కాకపోతే గడిచిన కొంతకాలంగా అన్ని దేశాలు అడ్డగోలు విధానాలను పాటిస్తున్న నేపథ్యంలో డిమాండ్ సప్లై అనే సిద్ధాంతం తడబాటుకు గురవుతోంది. అందువల్లే అన్ని దేశాలు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాయి.ప్రస్తుతం ప్రపంచం కృత్రిమ మేధ వెంట పరుగులు తీస్తోంది. ఓపెన్ ఏఐ అనే కంపెనీ ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. అధిక్రమ క్రమంగా అన్ని రంగాలలో విస్తరించడం మొదలు పెట్టింది. ప్రస్తుతం ఓపెన్ ఏఐ, మెటా, గూగుల్, మైక్రోసాఫ్ట్, ట్విట్టర్ వంటి టాప్ ఐటి కంపెనీలు కృత్రిమ మేధ లో సరికొత్త ప్రయోగాలు చేస్తున్నాయి. ఇవి ఎన్ని రకాలుగా ప్రయోగాలు చేసినప్పటికీ వినియోగం అనేది అంతిమంగా ఉండాలి. వినియోగం అనేది సరైన స్థాయిలో లేనప్పుడు కంపెనీలు తయారు చేసిన సాంకేతిక పరిజ్ఞానానికి అర్థం లేదు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించకపోతే మనుషులు వెనుకబడిపోతారు. ఈ విషయాన్ని గుర్తించి కేంద్రం సమూల సంస్కరణలకు శ్రీకారం చుట్టే దిశగా అడుగులు వేసింది. బహుశా ప్రపంచంలో ఈ స్థాయిలో ఏ ప్రభుత్వం కూడా ఆలోచించలేదు. కృత్రిమ మేధ వినియోగం పెరిగిపోతున్న నేపథ్యంలో.. ఆ సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడే దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ముఖ్యంగా 10 లక్షల మంది సిటిజన్లకు కృత్రిమ మేధ ఎలా వాడాలో ఉచితంగా శిక్షణ ఇవ్వనుంది. ఇదే విషయాన్ని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు.. ఈ ప్రకారం వచ్చే కొద్ది రోజుల్లో కృత్రిమ మేధ మార్కెట్లో భారత్ మొదటి స్థానాన్ని ఆక్రమించే అవకాశం ఉంది.కృత్రిమ మేధ లో భారతదేశానికి చెందిన కంపెనీలు కూడా పనిచేస్తున్నాయి.. దిగ్గజ సంస్థలు చేయలేని అద్భుతాలను చేసి చూపిస్తున్నాయి.. ఇప్పటికే వాట్సాప్ లో మన దేశం లో భాషలను మొత్తం అనుసంధానం చేసే విధంగా పుచ్ ఏఐని అర్జిత్ జైన్ అనే వ్యక్తి ప్రవేశపెట్టాడు.. అరవింద్ శ్రీనివాస్ అనే వ్యక్తి ప్రీ ఫ్లెక్సిటీ అనే ఏఐ టెక్నాలజీని రూపొందించాడు. ఇవన్నీ కూడా దిగ్గజ సంస్థల టెక్నాలజీని మించిపోయాయి. ఒక రకంగా ఐ, గూగుల్ ప్లే స్టోర్ లో టాప్ స్థానంలో ఉన్నాయి. ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ మీద ఇప్పుడే ప్రారంభ ప్రయోగాలు జరుగుతున్న నేపథ్యంలో.. ఇందులో భారత ఐటీ నిపుణులు అత్యంత కీలకంగా పనిచేస్తున్నారు. టాప్ కంపెనీలలో పనిచేస్తున్న నిపుణులు మొత్తం భారతదేశానికి చెందినవారే. వారంతా వేలకోట్ల ప్యాకేజీ ఆదుకుంటున్నారు.. అయితే త్వరలో భారత నిపుణులు కంపెనీలు ఏర్పాటు చేసే అవకాశం లేకపోలేదు. ఒకవేళ ఈ కంపెనీలు గనుక ఏర్పాటు అయితే.. కృత్రిమ మేధ లో సమూల మార్పులు వచ్చే



అవకాశం ఉంది. భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలో అతిపెద్ద వినియోగదారుల మార్కెట్ గా ఉంది కాబట్టి .. కృత్రిమ మేధకు జనాలను అలవాటు చేయిస్తే.. ఆ కంపెనీలకు తిరుగు ఉండదు.ఉదాహరణకు డిజిటల్ చెల్లింపులను తీసుకుంటే.. ప్రపంచంలో అత్యధికంగా యూపీఐ పేమెంట్లు చేస్తున్న దేశంగా భారత్ నిలిచింది.. జూన్ నెలలో 24.3 లక్షల కోట్ల నగదు లావాదేవీలు జరిగాయి. దీన్ని బట్టి భారత్ డిజిటల్ చెల్లింపుల్లో ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఇక్కడ జనానికి కృత్రిమ మేధను వాడే అలవాటు చేయిస్తే భారత్ నెంబర్ వన్ స్థానంలో నిలుస్తుంది. దాంతోపాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి . దానికి అనుబంధంగా మరిన్ని కంపెనీలు వస్తాయి. అప్పుడు దేశ జిడిపి పెరుగుతుంది.. ఇతర వ్యాపారాలు కూడా ముమ్మరం అవుతాయి. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని కేంద్ర మందిని అశ్విని వైష్ణవ్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది.

# 24 లక్షల కోట్ల డిజిటల్ లావాదేవీలు

**న్యూఢిల్లీ, జూలై 21:** ప్రపంచ ఆర్థిక శక్తిగా అమెరికాకు పేరు ఉంది. రెండవ స్థానంలో చైనా ఉంది. మూడో స్థానంలో జర్మనీ కొనసాగుతోంది.. నాలుగు స్థానంలో ఇండియా ఉంది. తొలి మూడు దేశాలకు సాధ్యం కానిది.. ఆ మూడు దేశాలు చేయలేనిది భారత్ చేసింది. చేయడం మాత్రమే కాదు సరి కొత్త చరిత్ర సృష్టించింది.. ఆ మూడు దేశాలు కలలో కూడా ఊహించని అద్భుతాన్ని చేసింది.డిజిటల్ లావాదేవీలలో దూసుకుపోతోంది. ఫైవ్ స్టార్ హోటల్ నుంచి మొదలు పెడితే కూరగాయల దుకాణం వరకు ప్రతి లావాదేవీ కూడా అంతర్జాలం లోనే జరిగిపోతుంది. అరుదుగా మాత్రమే నగదు లావాదేవీలు జరుగుతున్నాయి. మనదేశంలో జూన్ నెలలో 24.3 లక్షల కోట్ల నగదు లావాదేవీలు యూపీఐ ద్వారా జరిగాయి అంటే.. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ ఏ స్థాయిలో పెరిగిందో అర్థం చేసుకోవచ్చు. ఇదే విషయాన్ని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ వెల్లడించింది. గత ఏడది జూన్ నెలతో పోల్చి చూస్తే ఇది 32 శాతం అధికమని తెలుస్తోంది. "వ్యక్తిగత.. చిన్నచిన్న వ్యాపారులకు డిజిటల్ చెల్లింపు అనేది ఆర్థిక సాధనంగా మారింది. వారి వ్యాపారాలు డిజిటల్ విధానంలోనే సాగుతున్నాయి. ఇవన్నీ కూడా వారి ఆర్థికముఖ చిత్రాన్ని పూర్తిగా మార్చేస్తున్నాయి. చెల్లింపుల విధానం మారడం వల్ల వ్యాపారాలు కూడా ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారని" అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ వెల్లడించింది.మనదేశంలో కోవిడ్ కంటే ముందు డిజిటల్ విధానంలో చెల్లింపులు ఒక స్థాయి వ్యక్తులకు మాత్రమే పరిమితమయ్యేవి. కానీ కోవిడ్ తర్వాత ఒక్కసారిగా పరిస్థితి మారిపోయింది. డిజిటల్ చెల్లింపులు అనేవి అన్ని రంగాలకు విస్తరించాయి. కనీవినీ ఎరుగని రీతిలో చెల్లింపుల స్థాయి పెరిగిపోయింది. అందువల్లే ఈ స్థాయిలో లావాదేవీలు జరుగుతున్నాయి.. ప్రభుత్వం కూడా డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడానికి కృషి చేస్తున్న నేపథ్యంలో.. ఆర్థిక లావాదేవీలు మరింత పెరిగిపోతున్నాయి. అందువల్లే ప్రజలు చెల్లింపుల కోసం మరో మాటకు తావు లేకుండా యూపీఐ విధానాన్ని ఎంచుకుంటున్నారు. అయితే ఏడాది వ్యవధిలోనే 32 శాతం డిజిటల్ లావాదేవీలు పెరిగాయంటే.. భవిష్యత్ కాలంలో ఈ శాతం మరింత పెరుగుతుందని ఆర్థిక రంగ నిపుణులు చెబుతున్నారు.ఆర్థికంగా శక్తివంతమైన తొలి మూడు దేశాలలో ఆన్లైన్ లావాదేవీలు అంతంత మాత్రమే సాగుతున్నాయి. ఇప్పటికీ ఆ దేశాలలో కొంతమంది ప్రజలకు ఆన్లైన్ లావాదేవీల మీద అవగాహన లేదు. అవగాహన



కల్పించే ప్రయత్నాలను అక్కడ ప్రభుత్వాలు చేయడం లేదు. అక్షరాస్యతపరంగా ఆ మూడు దేశాలు మనకంటే మెరుగ్గానే ఉన్నప్పటికీ ఆర్థిక అక్షరాస్యత విషయంలో మాత్రం వెనుకబడే ఉన్నాయి. ఇప్పటికీ ఆదేశాలలో చెల్లింపులు నగదు ద్వారానే సాగుతున్నాయి.. డిజిటల్ విధానంలో చెల్లింపుల వల్ల ఆర్థిక అక్షరాస్యత మీద అవగాహన ఉంటుంది. మోసాలకు ఆస్కారం ఉండదు. పారదర్శకతకు పెద్దపీట వేయడం వల్ల అవకతవకలకు అవకాశం ఉండదు.

# పిడుగుపాటుతో 36 గొర్రెలు మృతి

## గొర్ల కాపరిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలి

## -మంథని ఆర్డీవో కు వినతి పత్రం అందజేసిన యాదవ సంఘం నాయకులు

**మంథని:** మంథని మండలం సిరిపురం గోదావరినది ఒడ్డున సోమవారం సాయంత్రం గొర్రెలమంద పై పిడుగు పడడంతో చిల్లపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి పుట్ట పోచయ్య, పుట్ట సంతోష్ లకు చెందిన 36 గొర్రెలు మృతి చెందిన సంఘటనలో 3లక్షలకు పైన నష్టం వాటిల్లిందని,అట్టి గొర్రెల కాపరి కుటుంభాన్ని ప్రభుత్వం ఆదుకొని నష్టపరిహారం చెల్లించా లని మంథని మండల యాదవ సంఘం నాయకులు పర్శవేన మోహన్ యాదవ్, కనవేన శ్రీనివాస్ యాదవ్. జగిరి సదానందం యాదవ్ లు విజ్ఞప్తి చేశారు. మంగళవారం మంథని పట్టణంలోని రెవిన్యూ డీవిజినల్ అధికారికి, మంథని తహసీల్దార్ కు మంథని మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న సమయంలో గొర్రెల, మేకల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాలకు గొర్రెల మందను ఎత్తైన ప్రాంతంలో ఉంచుకోవాలన్నారు. గొర్ల కాపర్ల వృత్తితో జీవనం కొనసాగిస్తున్న చిల్లపల్లి గ్రామానికి చెందిన పుట్ట పోచయ్య, పుట్ట సంతోష్ లను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు కనవేన కొమురయ్య యాదవ్, సింగనవేన మల్లేష్ యాదవ్, బోగొండ రవి యాదవ్, మాదారవేన ఓదెల యాదవ్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు



# హరీష్ కు సోషల్ మీడియాలో కౌంటర్లు

**మాకో ఎకరం ఇప్పించాలంటూ రిక్వెస్టులు**

**హైదరాబాద్, జూలై 22:**రాజకీయాలన్నాక మాటలు మాట్లాడితే సరిపోదు. వాస్తవ పరిస్థితులు చెప్పాలి. కానీ తమ పార్టీ ప్రయోజనాలను, ప్రత్యర్థులను ప్రజల ముందు దోషులుగా నిలబెట్టాలంటే బురద చల్లడం ఒక్కటే మార్గం. తాము చెప్పిన మాటలు వంద మందిలో పది మంది అయినా నమ్ముతారని కావచ్చు. తాజాగా బీఆర్ఎస్ నేత హరీశ్ రావు చేసిన కామెంట్స్ కూడా ఇందుకు అద్దం పడుతున్నాయి. ఒకప్పుడు తెలంగాణలో ఎకరం భూమి అమ్మితే ఆంధ్రప్రదేశ్ లో పది ఎకరాల భూమి వచ్చేదని, కానీ ఇక్కడ రేవంత్ రెడ్డి, అక్కడ చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక సీన్ రివర్స్ అయిందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఎకరా భూమి అమ్మితే తెలంగాణలో రెండు ఎకరాల భూమి వస్తుందని హరీశ్ రావు అన్నారు. ఈ అకౌంట్ వెనుక ఉంది ఎవరో తెలుసా? నాడు చంద్రబాబు కూడా... అయితే 2019 నుంచి 2024 వరకూ ఆంధ్రప్రదేశ్ లోనూ అక్కడ ప్రతిపక్షంలో ఉన్న చంద్రబాబు



ఇదే మాట మాట్లాడారు. ఏపీలో నాలుగు ఎకరాల భూమి అమ్మితే తెలంగాణలో ఎకరం భూమి వస్తుందని పదే పదే ఆయన ఎన్నికల ప్రచారంలోనూ పదే పదే చెప్పారు. అయితే హరీశ్ రావు తెలంగాణలో ఎక్కడ భూముల ధరలు తగ్గాయో చెప్పాలని సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లో భూముల ధరలు ఎక్కడ పెరిగాయో చెప్పాలని, అలాగే తెలంగాణలోనూ తగ్గిన భూముల ధరలు ఎక్కడో చెప్పాలన్నారు. దేశ వ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం స్తబ్దుగా ఉన్న సమయంలోనూ హైదరాబాద్ లో భూముల ధరలు ఏమాత్రం తగ్గలేదని చెబుతున్నారు.అలాగే తెలంగాణలోనూ మారుమూల ప్రాంతాల్లో భూముల ధరలు ఏమాత్రం తగ్గలేదని, కేవలం ప్రచారం చేసినంత మాత్రాన జనం నమ్మరని కాంగ్రెస్ పార్టీ నేతలు అంటున్నారు. దమ్ముంటే తమ సవాల్ కు సిద్ధం కావాలని అంటున్నారు. ఆంధ్రప్రదేశ్ లో పది ఎకరాల భూమిని అమ్ముదామని, ఇక్కడ ఆ సొమ్ముతో కనీసం రెండు ఎకరాలు కొంటే తాము పదవులకు రాజీనామా చేస్తామని ఛాలెంజ్ చేస్తున్నారు. హరీశ్ రావు ఉూదర గొట్టే మాటలు మానుకోవాలంటూ హెచ్చరిస్తున్నారు. కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో కంటే ఇప్పుడు భూముల ధరలు రెట్టింపయిన విషయాన్ని మీకు అత్యంత సన్నిహితులైన రియల్ ఎస్టేట్ వ్యాపారులన కనుక్కోవాలంటూ సోషల్ మీడియాలో సవాల్ విసురుతున్నారు.

## ఉప రాష్ట్రపతి రాజీనామాతో దేశ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు

**న్యూ ఢిల్లీ జూలై 22:**బీదేశ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్ఖడ్ అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేసారు.సోమవారం ఉదయం నుంచి ఎగువసభను సజావుగా నడిపించిన ఆయన రాత్రికి తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ముర్ముకు పంపారు. దీంతో ఆయన రాజీనామాపై ప్రస్తుతం తీవ్రంగా చర్చ నడుస్తోంది.పది రోజుల క్రితమే ఓ కార్యక్రమంలో పాల్గొన్న ధన్ఖర్ ప్రస్తుతం పూర్తికాలం ఉప రాష్ట్రపతి పదవిలో కొనసాగుతానని స్పష్టం చేశారు. జులై 10న జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తూ.. 'నేను ఆగస్టు 2027లో సరైన సమయంలో దైవ నిర్ణయానికి లోబడి పదవీ విరమణ చేస్తాను' అని స్పష్టం చేశారు. ఆయన 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ధన్ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే, పది రోజుల క్రితం పూర్తి కాలం ఈ పదవిలో కొనసాగుతానని చెప్పిన ఆయన.. ఇప్పుడు అనూహ్యంగా రాజీనామా చేయడం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో తీవ్రంగా చర్చ నడుస్తోంది.ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 67(ఏ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే నుంచి వైస్ ప్రెసిడెంట్ వరకు...



**జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా**


**న్యూఢిల్లీ, జూలై 22:**ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్.. తన పదవికి అనూహ్యంగా రాజీనామా చేయడం దేశవ్యాప్తంగా తీవ్ర ఆశ్చర్యాన్ని కలిగించింది. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన రోజునే ఆయన పదవి నుంచి తప్పుకోవడం గమనార్హం. దేశ రాజకీయాల్లో ఎమ్మెల్యే స్థాయి నుంచి ఉపరాష్ట్రపతి స్థాయి వరకు ఎదిగిన నాయకుడు జగదీప్ ధన్‌ఖడ్. బెంగాల్ గవర్నర్‌గా పనిచేసిన సమయంలో.. మమతా బెనర్జీ సర్కార్‌తో తరచూ వివాదాలు జరిగేవి. ఆ తర్వాత ఉపరాష్ట్రపతి పదవిలోకి వచ్చిన తర్వాత కూడా సుప్రీంకోర్టు, న్యాయ వ్యవస్థపై జగదీప్ ధన్‌ఖడ్ చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి.భారత రాజకీయాల్లో జగదీప్ ధన్‌ఖడ్ ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించుకున్నారు. అదే సమయంలో దేశ చరిత్రలోనే ఇప్పటివరకు ఉపరాష్ట్రపతి పదవిలో ఉన్న అత్యంత వివాదాస్పద వ్యక్తిగానూ నిలిచారు. తొలుత లాయర్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన జగదీప్ ధన్‌ఖడ్.. ఆ తర్వాత రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా.. ఆ తర్వాత గవర్నర్‌గా ఒక్కో మెట్టును ఎక్కుతూ వచ్చి, చివరికి దేశంలోనే రెండో అత్యున్నత పదవి అయిన ఉపరాష్ట్రపతి పదవిని అలంకరించారు. గవర్నర్, ఉపరాష్ట్రపతి పదవుల్లో ఉన్నప్పుడు జగదీప్ ధన్‌ఖడ్ అనుసరించిన వైఖరి, చేసిన వ్యాఖ్యలు కొన్నిసార్లు తీవ్ర వివాదాస్పదంగా మారాయి.పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా ఉన్న సమయంలో తరచూ మమతా బెనర్జీ ప్రభుత్వంతో జగదీప్ ధన్‌ఖడ్ వివాదాల్లో ఉండేవారు. ఆ తర్వాత వైస్ ప్రెసిడెంట్ పదవిని చేపట్టాక.. పార్లమెంటులోనూ, బయటా.. భారత న్యాయవ్యవస్థపై అనేక వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీంతో భారత రాజకీయాల్లోనే ఆయన ఒక వివాదాస్పద ఉపరాష్ట్రపతిగా నిలిచారు.పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలి రోజే ఉపరాష్ట్రపతి పదవికి ధన్‌ఖఢ్ రాజీనామా చేయడం గమనార్హం. ఆరోగ్య కారణాల వల్ల ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపించిన రాజీనామా లేఖలో జగదీప్ ధన్‌ఖడ్ రాశారు. వైద్యుల సలహా మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఉపరాష్ట్రపతి రాజీనామా దేశంలో ప్రకంపనలు రేపింది. దీని వెనుక రాజకీయ కారణాలూ లేకపోలేదని చర్చ జరుగుతోంది.భారతదేశ చరిత్రలో పరివర్తనాత్మకమైన కాలంలో.. ఉపరాష్ట్రపతిగా సేవ చేయడం తనకు నిజమైన గౌరవంగా భావిస్తున్నట్లు రాజీనామా సందర్భంగా ధన్‌ఖడ్ పేర్కొన్నారు. రాజీనామా లేఖలో.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భారత్ ఒక ఆర్థిక శక్తిగా, ప్రపంచ స్థాయిలో ఎదగడంలో తాను ఒక భాగం అయినందుకు గర్వపడుతున్నట్లు పేర్కొన్నారు.జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాపై కాంగ్రెస్ పార్టీ అనేక అనుమానాలు, సందేహాలు వ్యక్తం చేసింది. ఇది సాధారణంగా జరిగింది కాదని.. దాని వెనుక ఏదో పెద్ద విషయం దాగి ఉందని ఆరోపించింది. ఉపరాష్ట్రపతిగా 2027 వరకు మరో 2 ఏళ్ల పదవీకాలం ఉన్నా.. జగదీప్ ధన్‌ఖడ్ హఠాత్తుగా పదవి నుంచి దిగిపోవడం అనేక ప్రశ్నలకు తావిస్తోంది. సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు జరిగిన మొదటి బీఏసీ సమావేశానికి కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, కిరణ్ రిజిజు హాజరయ్యారని.. అయితే సాయంత్రం 4.30 గంటలకు మాత్రం రాలేదని అదే ధన్‌ఖడ్ రాజీనామాకు కారణం అయి ఉంటుందని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ ఎక్స్‌లో చేసిన పోస్ట్ సంచలనంగా మారింది.కేంద్ర మంత్రుల గైర్హాజరీపై ధన్‌ఖడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. మంగళవారం మధ్యాహ్నం 1 గంటలకు ఆ సమావేశాన్ని షెడ్యూల్ చేశారని తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 1 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటలకు మధ్య ఏదో జరిగిందని.. అందుకే ఇద్దరు కేంద్ర మంత్రులు సాయంత్రం సమావేశానికి హాజరు కాలేదని పేర్కొన్నారు.1951 మే 18న రాజస్థాన్‌లోని ఝున్‌ఝును జిల్లాలోని కిథానా గ్రామంలో జగదీప్ ధన్‌ఖడ్ జన్మించారు. జైపూర్ మహారాజా కాలేజీ నుంచి బీఎస్సీ ఫిజిక్స్‌లో ఆనర్స్ డిగ్రీని పొందారు. 1978-79లో రాజస్థాన్ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ పూర్తి చేశారు. 1979 నవంబర్ 10న రాజస్థాన్ బార్ కౌన్సిల్‌లో లాయర్‌గా పేరు నమోదు చేసుకున్నారు.1990 మార్చి 27వ తేదీన రాజస్థాన్ హైకోర్టు జగదీప్ ధన్‌ఖడ్‌ను ను సీనియర్ అడ్వకేట్‌గా నియమించింది. నాటి నుంచి ఆయన సుప్రీంకోర్టులో ప్రాక్టీస్ చేస్తూ.. స్టీల్, బొగ్గు, మైనింగ్, అంతర్జాతీయ వాణిజ్య ఆర్బిట్రేషన్ వంటి రంగాల్లో న్యాయ సేవలు అందించారు. దేశంలోని వివిధ హైకోర్టుల్లో ధన్‌ఖడ్ వాదనలు వినిపించారు. 2019లో పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించే వరకు.. ఆయన రాష్ట్రంలోని అత్యంత సీనియర్ డిజిగ్నేటెడ్ సీనియర్ అడ్వకేట్‌గా కొనసాగారు.

# జూలై 25 నుంచి రేషన్ కార్డుల పంపిణి

**వాన కాలం సాగుకు సకల సౌకర్యాలు**

**సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు**

**జయశంకర్ భూపాలపల్లి:**జూలై 25 నుంచి ఆగస్టు 10 వరకు మండల కేంద్రాలలో రేషన్ కార్డుల పంపిణీ చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి వానాకాలం సాగు, భారీ వర్షాలు, సీజనల్ వ్యాధుల నియంత్రణ, రేషన్ కార్డుల పంపిణీ వంటి పలు అంశాల పై సీఎం రేవంత్ రెడ్డి సచివాలయం నుండి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, మంత్రి వర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ,పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజనర్సింహ, వివేక్ వెంకటస్వామి , వాకాటి శ్రీహరి, సీతక్క, శ్రీధర్ బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణా రావు అన్ని జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సమావేశంలో ఖమ్మం నుండి ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది ఖమ్మం జిల్లాలో మూడు గంటల వ్యవధిలో 39 సెంటీ మీటర్ల భారీ వర్షం పడిందని, ప్రస్తుతం కూడా అటువంటి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ లను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో



అంటువ్యాధులు ప్రబల కుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యవసాయ సాగు పనులు సజావుగా జరిగేందుకు అవసరమైన ఎరువులు విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచడం, నీటిపారుదల శాఖ ద్వారా రైతులకు సాగునీరు విడుదల పై కలెక్టర్ దృష్టి సారించాలని అన్నారు. జూలై 21 వరకు మన రాష్ట్రంలో దాదాపు 20 శాతం లోటు వర్షపాతం నమోదైందని, గత 3 రోజులు గా వర్షాలు ఎక్కువ కురుస్తున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఎస్.డి.ఆర్.ఎఫ్ బృందాలను అప్రమత్తం చేయాలని, జిహెచ్ఎంసి పరిధిలో హైదరా ఆధ్వర్యంలో 150 బృందాలను సిద్ధం చేశామని అన్నారు. నగరంలో వర్షాలు ఉన్నప్పుడు ట్రాఫిక్ నియంత్రణకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో పిడుగు పాటుకు మరణాలు సంభవిస్తున్నాయని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని వర్షాలు వచ్చినప్పుడు చెట్ల కింద స్తంభాల దగ్గర ఉండకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. పిడుగు పాటుతో మరణించిన కుటుంబాలకు ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని, దీనికోసం పోలీసు అధికారులు వెంటనే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయాలని అన్నారు. వర్షాకాలంలో వచ్చే అంటూ రోగాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ముఖ్యంగా ఐటీడీఏ గిరిజన ప్రాంతాల్లో అధిక శ్రద్ధ వహించాలని అన్నారు. నీటి నిల్వ లేకుండా చూడాలని, ఎక్కడైనా వర్షపు నీరు నిల్వ ఉంటే అక్కడ ఆయిల్ బాల్స్ వంటివి స్థానిక సంస్థల ద్వారా వేయాలని అన్నారు. డ్రైయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జిల్లా ఆస్పత్రి వరకు వైద్యులు సిబ్బంది సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని , ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును కలెక్టర్లు పర్యవేక్షించాలని అన్నారు. జిల్లా పరిధిలో ఉన్న ఐఏఎస్ అధికారులు క్షేత్రస్థాయి తనిఖీలు అధికంగా నిర్వహించాలని, ఆసుపత్రులను ఆకస్మిక తనిఖీ చేసి పనితీరు పర్యవేక్షించాలని అన్నారు.

# ఆ ఇద్దరే... నేతలంతా సైలెంట్...

**హైదరాబాద్, జూలై 22:**తెలంగాణలో అపోజిషన్ బీఆర్ఎస్..అధికార కాంగ్రెస్‌తో ఢీ అంటే ఢీ అంటోంది. పార్టీ మీద, అతినేత మీద వస్తున్న విమర్శలు, ఆరోపణలను ఎదుర్కోవడంలో అయినా..ప్రభుత్వ వైఫల్యాల మీద ప్రశ్నించడంలో అయినా..బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు ముందుంటున్నారు. అయితే పదేళ్లు పవర్‌లో ఉన్నప్పుడు అధికారం అనుభవించిన చాలా మంది బీఆర్ఎస్ ముఖ్య నేతలెవరు తమంతట తాముగా ఏ కార్యక్రమం చేయడం లేదట.పార్టీ నేతలకు, క్యాడర్‌కు ఏ ఇబ్బందులు వచ్చినా, అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి వేధింపులు ఎదురైనా కేటీఆర్, హరీశ్‌రావు తప్ప మిగతా ముఖ్య నేతలు పెద్దగా స్పందించడం లేదట. తమ తమ జిల్లాల్లో జరుగుతున్న సంఘటనలపై కూడా పైనుంచి ఆదేశాలు వచ్చే వరకు మనకెందుకులే అన్న ధోరణితో ఉంటున్నారట బీఆర్ఎస్ కీలక లీడర్లు.మల్కాజ్‌గిరిలో అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య వివాదం చెలరేగింది. బోనాల పండగ చెక్కుల పంపిణీలో ప్రోటోకాల్ రగడ కాస్త ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్ సునీత భర్త రాము యాదవ్‌పై కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు దాడి చేశారని అంటున్నారు. తమ పార్టీ నేతపై దాడి జరిగిందన్న విషయం తెలుకున్న వెంటనే ఖమ్మం పర్యటనలో ఉన్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేరుగా మల్కాజ్‌గిరిలోని కార్పొరేటల్ సునీత ఇంటికి వెళ్లి ఆమె భర్త రాము యాదవ్‌ను పరామర్శించారు.పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అయితే తమ పార్టీ నేతపై కాంగ్రెస్ లీడర్లు దాడి చేశారన్న విషయం తెలిసినా హైదరాబాద్‌లోని పార్టీ ముఖ్యనేతలు మందు సైలెంట్‌గా ఉండిపోయారట. కనీసం ఏం జరిగిందో తెలుసుకునే ప్రయత్నం కూడా చెయ్యలేదట. కానీ కేటీఆర్ వెళ్లి వాళ్లను పరామర్శించి వచ్చాక అప్పుడు హైదరాబాద్ బీఆర్ఎస్ నేతలు మేల్కొన్నారట. అది కూడా కేటీఆర్ చెబితే కానీ హైదరాబాద్ బీఆర్ఎస్ నేతలు కదలలేదని తెలుస్తోంది. మన పార్టీ నేతలపై దాడి జరిగితే ఎందుకు స్పందించలేదని కేటీఆర్ వారిని ప్రశ్నించినట్లు తెలంగాణ భవన్ వర్గాల టాక్.అందులోనూ బీసీ వర్గం నేతపై దాడి జరిగితే కనీసం పార్టీలోని ఆ సామాజికవర్గం నేతలు కూడా స్పందించరా అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కేటీఆర్





చెప్పిన తర్వాత మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు గౌడ్ తదితరులు అప్పుడు మల్కాజ్‌గిరికి వెళ్లి దాడిలో గాయపడ్డ కార్పొరేటర్ సునీత భర్త రాము యాదవ్‌ను పరామర్శించారని తెలుస్తోంది. ఇదే పని ముందు చేసి ఉంటే బాగుండేదన్న చర్చ పార్టీలో జరుగుతోంది.ఈ ఒక్క ఇష్యూలోనే కాదు చాలా అంశాల్లో, చాలా సందర్భాల్లో కేటీఆర్, హరీశ్‌రావులు మినహా మిగతా ముఖ్యనేతలంతా తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న చర్చ బీఆర్ఎస్ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై వేధింపులు ఎక్కువయ్యాయని వాపోతోంది క్యాడర్. పార్టీ నేతలపై దాడులు, అక్రమ కేసులు పెట్టినా మిగతా నేతలు పెద్దగా స్పందించడం లేదని అంటున్నారు. అప్పుడు కూడా కేటీఆర్ లేదంటే హరీశ్‌రావులు చెబితే తప్ప ముఖ్య నేతలెవ్వరు రెస్పాండ్ కావడం లేదని చెబుతున్నారు.ఇలా ప్రతిసారి పైనుంచి ఆదేశాలు వస్తేనో.. అధిష్టానం చెబితేనో తప్ప మిగతా సందర్భాల్లో తమకెందుకులే అని పట్టీపట్టనట్లు ఉంటున్నారట బీఆర్ఎస్ నేతలు. అధికార కాంగ్రెస్, బీజేపీ నుంచి పార్టీ అధినేత కేసీఆర్ లేదంటే మిగతా వారిపై విమర్శలు, ఆరోపణలు చేసిన సందర్భాల్లోను పైనుంచి చెబితే ముఖ్యనేతలు రియాక్ట్ కావడం లేదని లేదని తెలుస్తోంది. ఇలా అన్నీ కేటీఆర్, హరీశ్‌రావులే చూసుకోవాలంటే కష్టమేనని, అన్నింటికీ వాళ్లే స్పందించాలంటే అయ్యే పని కాదని పార్టీ ముఖ్య నేతల్లో మార్పు రావాలన్న టాక్ పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది.

## రేవంత్ పై మంత్రుల ఫిర్యాదు?

**పదేళ్లు నేనే సీఎం అనే కామెంట్లపై పార్టీలో తీవ్ర ప్రకంపనలు.!**



**హైదరాబాద్:**మీనాక్షిని కలిసి ఆవేదన వెళ్లగక్కిన ఐదుగురు మంత్రులు పదేళ్లు రేవంత్ సీఎంగా ఉంటే మేము భజన చెయ్యాలా? 10 ఏళ్ళు నేనే ముఖ్యమంత్రిగా ఉంటానని రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీలో తీవ్ర ప్రకంపనలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికే రేవంత్ రెడ్డిపై సోషల్ మీడియాలో కోమటిరెడ్డి సోదరుడు రాజగోపాల్ రెడ్డి తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఇదే వ్యవహారంపై రాష్ట్ర కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. సాధారణంగా జాతీయ పార్టీల్లో వ్యక్తిగత ఎజెండాలు ఉండవు. ఎమ్మెల్యే అభ్యర్థిని నిలబెట్టాలన్నా, ముఖ్యమంత్రిని నియమించాలన్నా, తొలిగించాలన్నా అధిష్ఠానమే నిర్ణయం తీసుకుంటుంది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో ఈ సంస్కృతి ఎప్పటి నుండో ఉంది, అలాంటిది రాష్ట్రంలో రేవంత్ రెడ్డి మాత్రం రాబోయే పదేండ్లు తానే సీఎంను అని పదే పదే చెబుతున్నారు. రేవంత్ రెడ్డి వ్యవహారంపై అసలు కాంగ్రెస్ నేతలు రుస రుసలాడుతున్నారు. ఇలా ఏకపక్షంగా ప్రకటించుకోవడం వెనుక కారణం, ఎవరిని చూసుకొని ఆ ధైర్యం అని ఆరా తీస్తున్నారు. వివరాల్లోకి వెళితే, రేవంత్ కామెంట్లు పార్టీలో మంత్రులను ఉక్కిరి బిక్కిరి చేసింది. ముఖ్యంగా కోమటిరెడ్డి, పొంగులేటి, భట్టి లాంటి వారు వచ్చే సారి కాంగ్రెస్ పార్టీ గెలిస్తే తామే సీఎం పీఠాన్ని చేజిక్కించుకోవచ్చు అనే ఆలోచనలో ఉన్నారు. ఉన్నపళంగా రేవంత్ రెడ్డి వచ్చి నేనే 10 ఏళ్ళు సీఎం అంటూ హడావుడి చెయ్యడంతో వారికి మింగుడు పడట్లేదు. అందుకే రేవంత్ కేబినెట్ మంత్రులు దాదాపు ఐదుగురు రేవంత్ రెడ్డిపై ఫిర్యాదులు చేశారు. పదేళ్లు రేవంత్ సీఎంగా ఉంటే మేము భజన చెయ్యాలా? రాహుల్ అపాయింట్ మెంటే లేదు.. రేవంత్ మళ్ళీ సీఎం ఎలా అవుతాడు? సొంత ఇమేజ్ కోసం కాంగ్రెస్ పార్టీని బలి పెడితే ఊరుకోమని మంత్రులు స్పష్టం చేశారట. మళ్ళీ రేవంత్ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఊరుకోమని మీనాక్షికి గట్టిగానే చెప్పినట్లు సమాచారం. దీంతో, మీనాక్షి నటరాజన్ రేవంత్ రెడ్డికి ఫోన్ చేసి మరీ క్లాస్ పీకినట్లు తెలుస్తుంది. ఇప్పటినుండి అయినా, నోరు అదుపులో పెట్టుకోవాలని గట్టి వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సీఎం పదవి పంచాయతీ ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో కాలమే సమాధానం చెప్పాలి.

## పంచాయతీ ఎన్నికలకు కొత్త ఓటర్ల జాబితా.!

**హైదరాబాద్:**పంచాయతీ ఎన్నికలకు కొత్త ఓటర్ల జాబితా తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు ఓటర్ల జాబితాను కొత్తగా సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. పంచాయతీలు, వార్డుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పూర్తిస్థాయి సమాచారంతో జాబితా తయారుచేయాలనే రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు సమాచారం. గ్రామాన్ని యూనిట్ గా తీసుకుని వార్డుల వారీగా ఓటర్ల జాబితాను రూపొందించే అవకాశం ఉంది. ఇప్పటికే ఓటర్ల జాబితా సిద్ధమవగా.. పంచాయతీలు, వార్డుల సంఖ్య పెంచాలనే డిమాండ్లతో కొత్త ఓటర్ లిస్టు తయారు చేస్తున్నట్లు సమాచారం.

# స్కాలర్షిప్ లు బిక్ష కాదు విద్యార్థుల హక్కు

**షాద్ నగర్:** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు మరియు విద్యార్థులు డిమాండ్ చేశారు. మంగళవారం షాద్నగర్ చౌరస్తాలో పలు కళాశాలల విద్యార్థులతో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్ మీడియాతో మాట్లాడుతూ... గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలన నుండి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి 18 నెలలు పూర్తయినప్పటికీ ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారన్నారు. కేవలం రంగారెడ్డి జిల్లా సంబంధించిన విద్యార్థులకు చెల్లించాల్సిన 750 కోట్లు ఫీజు రియంబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్ లో పెండింగ్ లో ఉన్నాయని అలాగే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 8,150 కోట్ల రూపాయలు ఇప్పటివరకు పిల్లలకు విడుదల చేయకపోవడం ప్రభుత్వం యొక్క బాధ్యత రాహిత్యంగా బావించవలసి వస్తుందని నిరుపేదలైన విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన స్కాలర్షిప్ లను పెండింగ్ లో పెట్టడం ద్వారా విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్న ధర్నాలు నిర్వహించిన అక్రమ అరెస్టులు చేస్తున్నారే తప్ప ఇప్పటివరకు ఎలాంటి స్కాలర్షిప్లు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. ఎస్ఎఫ్ఐ నాయకులు మరియు విద్యార్థులు షాద్నగర్ చౌరస్తాలో వాహనాలను అడ్డుకొని ధర్నా నిర్వహించడం ద్వారా కొంతసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు ఎస్ఎఫ్ఐ నాయకులు విద్యార్థులు అడ్డుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొన్నాయి. తద్వారా పోలీసులు విద్యార్థులను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న కోట్ల స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ స్కాలర్షిప్లు బిక్ష కాదు విద్యార్థుల హక్కు అని అన్నారు.రాష్ట్రంలోని వేలాది మంది పేద, మధ్య తరగతి విద్యార్థులు స్కాలర్‌షిప్ అందక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఫీజుల కట్టలేని స్థితిలో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ టౌన్ అధ్యక్ష కార్యదర్శులు సుమయిర్, శివ శంకర్ టౌన్ ఉపాధ్యక్షులు అదిల్ మరియు ఎస్ఎఫ్ఐ నాయకులు యూసుఫ్, మజర్, ఆరీఫ్, హర్ష, రెహమాన్, అబ్బు, సుభాన్, ఆరీఫ్, అయాన్, మహేష్, శమి, ఫాయ్యుమ్, వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# స్థలాలపై కన్నేసిన సీఎం రేవంత్ రెడ్డి

**ఎమ్మెల్యే మాధవరం**



**హైదరాబాద్:**కూకట్ పల్లి నియోజకవర్గానికి జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు నెలకు 4 కోట్ల రూపాయలు రావాల్సి ఉన్న 80 లక్షలు ఇచ్చి అభివృద్ధి చేయమంటే ఎలా జరుగుతుంది అని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు. గడిచిన 18 నెలల్లో అభివృద్ధి చేయడం మరచి బ్యానర్లు పెట్టి డబ్బులు వృధా చేశారు తప్ప చేసింది ఏమీ లేదని విమర్శించారు. తనని నియోజకవర్గంలోని హౌసింగ్ బోర్డు స్థలాలను ఇప్పటికే 1000 కోట్ల రూపాయలకు పైగా అమ్మేశారని, మరో 5000 కోట్ల రూపాయల విలువ చేసే స్థలాల పైన రేవంత్ రెడ్డి కన్నువేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆఖరికి కేపి.హెచ్.బి కాలనీ లో 18 గజాలు, 36 గజాలను సైతం వదలడం లేదని అన్నారు. రోడ్డు నెంబర్ 2 లో గుడికి ఆనుకొని ఉన్న స్థలాన్ని సైతం అమ్మే ప్రయత్నం చేస్తున్నారని ఇలాంటి వాటిని ఉపేక్షించేది లేదని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ఫ్లైఓవర్లు, అండర్ పాసులు, మంచినీటి పైప్లైన్ తో పాటు నూతన డ్రైనేజీ నిర్మాణాలు సైతం చేపట్టామని ఇప్పుడు వీరు మాత్రం ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వంద ఫీట్ల రోడ్డు చూపెట్టి హౌసింగ్ బోర్డ్ అధికారులు ప్రజలను మోసం చేస్తూ వేలం వేస్తున్నారని స్థలాన్ని చూసేసరికి 40 ఫీట్ల రోడ్డు చూపెడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన బుద్ధిని మార్చుకోకపోతే కూకట్ పల్లి నియోజకవర్గ ప్రజలే బుద్ధి చెబుతారని తెలిపారు.

# హాస్టల్ బాలికలను వేధిస్తున్న కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్

**నారాయణఖేడ్:**నారాయణఖేడ్ పట్టణంలోని బీసీ బాలికల హాస్టల్ వార్డెన్ శారద కుమారుడు రాజేష్ తమను వేధిస్తున్నాడని విద్యార్థినులు పోలీసులకు ఫిర్యాదు చేసారు. రాజేష్ తమను అసభ్యకరంగా తాకుతున్నాడని హాస్టల్ సిబ్బందికి ఫిర్యాదు చేస్తే.. అన్న లాంటి వాడే ఏం అవ్వదు అంటూ తిరిగి బాలికలను హాస్టల్ సిబ్బంది తిట్టారని ఆరోపించాఉరు.రాజేష్ ప్రవర్తన పట్ల తన తల్లి శారదకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాలికలు ఆందోళనకు దిగారు. తనను ఎవరూ ఏమి చేయలేరని ప్రభుత్వం మాదేనని రాజేష్ అసభ్య పదజాలంతో దూషిస్తాడని విద్యార్థినులు ఆరోపించారు. తమను వేధిస్తున్న కాంగ్రెస్ నాయకుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని నారాయణఖేడ్ పోలీసులకు ఫిర్యాదు చేసారు.

# రైతులకు ఎరువులు అందించాలి

**జర్నలిస్ట్ లకి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు ఇవ్వాలని డిమాండ్.**

**కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి నీటిని విడుదల చేయాలి**

**జూలై 27న కేటీఆర్ పర్యటన**

**మాజీ ఏమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి**



**జయశంకర్ భూపాలపల్లి:**కాంగ్రెస్ పాలనలో చెప్పులు లైన్లో పెట్టి ఎరువుల కోసం ఎదురు చూసే పరిస్థితి వచ్చింది. జిల్లాలకు మంత్రులు వస్తున్నారు పోతున్నారు మంత్రులు అంటే ప్రభుత్వాని నడిపించేవారు,ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కువగా సేద్యం చేసే జయశంకర్ భూపాలపల్లి జిల్లా అని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి అన్నారు. ఈనెల 27వ తేదీన భూపాలపల్లి నియోజకవర్గంలోని మొగుళ్ళపల్లి మండలం,ఇస్సిపేట గ్రామ మాజీ సర్పంచ్ కీ.శే కొడారి కోమురయ్య విగ్రహ ఆవిష్కరణ మరియు బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయం లో ముఖ్య కార్యకర్తల సమావేశానికి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి వర్యులు, ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావు రాక సందర్భంగా మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి మాట్లాడుతూ...మంత్రి శ్రీధర్ బాబు జిల్లాల్లో ఎరువుల కొరత లేకుండా చూడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ మరమ్మత్తు చేయకపోవడంతో కొన్ని వేల క్యూసెక్కుల నీళ్లు సముద్ర గర్భంలో కలిసి పోతున్నాయి.ఇప్పటికైనా కాళేశ్వరం ప్రాజెక్ట్ మోటార్లు ఆన్ చేసి నీటిని విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా. అదే విదంగా భూపాలపల్లి లో నివసించే వారు వివిధ ప్రాంతాల నుండి బ్రతుకుదెరువు కోసం వచ్చిన వారు ఎక్కువ వారికీ ఇక్కడ ఇళ్ళు నిర్మించుకోవడానికి కూడా కనీస జాగా లేని వారు ఎక్కువ వాళ్ళల్లో పేదవారైన అర్హులైన లబ్ధిదారులకు మేము మా ప్రభుత్వ హయాంలో ఎటువంటి విమర్శలకు తావు లేకుండా డబుల్ బెడ్ రూమ్ లబ్ధి దారులను అందరి సమక్షంలో అధికారుల మధ్యలో డ్రా పద్దతిలో ఎంపిక చేయడం జరిగింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ లబ్ధి దారుల లిస్ట్ మార్చి అంతా దళారీ వ్యవస్థను నడిపిస్తున్నారు. అదే విదంగా మీడియా మిత్రులకు గతంలో మేము ఇచ్చిన ఇళ్ళ పట్టాలను వెంటనే జర్నలిస్ట్ సోదరులకు కేటాయించాలని,అదే విదంగా వారికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళను నిర్మించి ఇవ్వాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని, జిల్లా కలెక్టర్ ను డిమాండ్ చేశారు. కేటీఆర్ పర్యటన సందర్భంగా భూపాలపల్లి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపు నిచ్చారు.

# ఈటెల వర్సెస్ బండి
# లైట్ తీసుకున్న అధిష్టానం



**హైదరాబాద్, జూలై 22:** తెలంగాణ బీజేపీ లో ఇద్దరు నేతల మధ్య పోరు పార్టీలో ప్రకంపనాలు సృష్టిస్తున్నాయి. కానీ ఈ విషయంలో ఇప్పటికీ పార్టీలో పెద్దలు మాత్రం మౌనం వహిస్తున్నారు. అందుకు కారణాలు ఏమీ ఉంటాయోనని రాజకీయ విశ్లేషకులు తర్జన భర్జన పడుతున్నారు.భారతీయ జనతా పార్టీ కి ఒక స్పష్టమైన వ్యూహం ఉంటుంది. బలమైన అధిష్టానం, కోర్ కమిటీ ఆ పార్టీని ముందుకు నడిపిస్తుంది. అధిష్టానం ఏ విధమైన నిర్ణయం తీసుకున్న కట్టుబడి ఉండే కట్టప్పలకే ఎక్కువ ప్రాధాన్యత ఉంటుంది. పార్టీ అధిష్టానానికి తలొగ్గి నడిచే వారికి, వారి సూచనలు పాటిస్తూ, వారు అనుసరించే వ్యూహంలో భాగంగా తీసుకునే కఠినమైన నిర్ణయాలకు అనుగుణంగా వ్యవహరించాల్సి ఉంటుంది. అలాంటి వారికి ఏ సందర్భంలో ఏ అవకాశం, పదవి ఇవ్వాలని నిర్ణయాలు ఉంటాయి. అవి అర్థం చేసుకొని పార్టీలో నిలదొక్కుకుని నడిచే వారికి మాత్రం సమయం, సందర్భం బట్టి అవకాశం కల్పిస్తారు. వాటిని చక్కగా ఉపయోగించుకునే వారు ఆ పార్టీలో ఉన్నత స్థానానికి ఎదుగుతారనేది నిర్వివాదాంశం.ఒక సామాన్య కార్యకర్త ఏబీవీపీలో పనిచేసి కరీంనగర్ కార్పొరేటర్ గా ఉన్న బండి సంజయ్ కుమార్ ను అధిష్టానం ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం ఇవ్వడం, పరాజయం పాలైన ఆయనకు వెంటనే ఎంపీ గా మరో అవకాశం కల్పించి గెలిపించుకున్నారు. 2023 ఎన్నికలకు ముందు రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించిన అధిష్టానం నిర్ణయాన్ని దిక్కరించలేదు. కనీసం ఆ నిర్ణయంపై పల్లెత్తు మాట కూడా మాట్లాడలేదు. అదే ఆయన్ను ఆ ఎన్నికలో పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఓడినా, రెండోసారి ఎంపీ గా పోటీ చేసి గెలిచిన తరువాత కేంద్ర మంత్రిగా నియమించింది. పార్టీ ఒక కార్యకర్తను నాయకునిగా ఎలా తీర్చిదిద్దుతుందో బండి రాజకీయ ప్రస్తానం చూస్తే అవగతమౌతుంది.ఏడుసార్లు బిఆర్ఎస్ ఎమ్మెల్యేగా హుజులారాబాద్ నుంచి ఎన్నికైన ఈటల తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ కు కుడిభుజంగా నడిచి పార్టీని ఆదుకున్న నాయకుడిగా పేరుతెచ్చుకున్నారు. 2014 లో మొదటిసారి రాష్ట్ర కేబినెట్ లో నెంబర్ 2 స్థానంలో ఉన్న ఆయన్ను రెండోసారి ఎన్నికల అనంతరం పొమ్మనలేక పొగపెట్టారు. ముక్కుసూటిగా వ్యవహరించే ఈటల పార్టీలో జరిగే పరిణామాలపై స్పష్టంగా తన అభిప్రాయాలను వ్యక్తం చేయడం ఒక వర్గానికి కంటగింపయ్యారు. కేటీఆర్ ను సీఎం చేయాలనే విషయంలో ఈటల ఒక టీవీ చానెల్ కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తన అభిప్రాయాన్ని కుండ బద్దలు కొట్టేశాడు. అదే ఆయనను పార్టీ నుంచి పంపించేందుకు కారణమని పార్టీ శ్రేణులు అభిప్రాయపడ్డారు. కానీ పార్టీ నుంచి బయటికొచ్చిన ఆయన కాంగ్రెస్ లో చేరుతాడని ఊహించారు. కమ్యూనిస్టు భావజాలం గల ఈటల బీజేపీ లో చేరడం, ఆ పార్టీలో ఆశ్చర్యానికి గురిచేశాయి. తదుపరి జరిగిన ఉప ఎన్నికల్లో విజయం సాధించి తన సత్తా చాటుకున్నాడు. ఆ సమయంలో తన వెంట నడిచే అనుచరగణం పూర్తిగా బీజేపీలో చేరడంతో హుజురాబాద్ పరిధిలోని మండలాల్లో బీజేపీకి బలమైన నాయకత్వంతో ముందుకు నడిచింది. కానీ అక్కడ ఇదివరకే పార్టీలో కొనసాగుతున్న సీనియర్ నాయకులకు, ఈటల తో చేరిన నాయకులకు మధ్య మాత్రం సయోధ్య కొరవడింది. దాని ప్రభావం అసెంబ్లీ ఎన్నికలపై ప్రత్యక్షంగా పడింది. రెండు ప్రాంతాల్లో పోటీ చేసి ఓడిన ఈటల తన ఓటమికి కారణాలను తెలుసుకునే సమయంలోనే మల్కాజ్ గిరి ఎన్నికలలో ఎంపీగా పోటీచేసి గెలుపొందారు. కానీ తన రాజకీయ ప్రస్థానానికి వేదికగా నిలిచిన హుజురాబాద్ లో అనుచరులు ఎదుర్కొంటున్న సమస్యలు వారు నేరుగా వచ్చి తెలిపేవరకు తెలుసుకునే ప్రయత్నం చేయలేదు. పార్టీ వ్యవహారాల్లో తలమునకలై ఉన్న సమయంలో సొంత నియోజకవర్గంలో విపరీత పరిణామాలు చోటుచేసుకున్నాయి. పార్టీ అధ్యక్ష పదవి కోసం పోటీలో ముందున్న ఈటల ను కాదని రాంచందర్ రావు ను ఎంపిక చేయడం వెనుక కథ ఏదైనా కుట్ర కోణం దాగుందని భావించారు. ఒకవైపు సొంత నియోజకవర్గంలో తనకు వ్యతిరేకంగా ఒక ప్రచారం జరగడం, మరోవైపు తాను అనుకున్న స్థాయిలో పార్టీ గుర్తించినట్లు ఈటల భావించడంతోనే పరోక్షంగా ఒక నాయకుడిని ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి. ఆ మాటలు కేంద్ర మంత్రి బండిని ఉద్దేశించి అన్నారని జరిగిన ప్రచారంతో, ఈ విషయంలో ఎలాంటి వ్యాఖ్యలు చేయవద్దని బండి తన అనుచర గణానికి చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయంలో ఈటల ఆ స్థాయిలో వ్యాఖ్యలు చేయడంపై కూడా అధిష్టానం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ వ్యవహారాలను బహిరంగంగా ప్రస్తావించడం బీజేపీ సీరియస్ గా తీసుకుంటుంది. పార్టీలో ఎన్ని వర్గాలున్నా, బయటికి మాత్రం అందరూ సమష్టి గా ముందుకు వెళ్లాలని, ఏ మనస్పర్ధలు ఉన్నా అంతర్గతంగా చర్చించుకొని పరిష్కరించుకోవాలని పార్టీ సూచిస్తుంది. అయితే వీరిద్దరి ఎపిసోడ్ ను పార్టీ ఏవిధంగా చూస్తుందో, వారు నిర్ణయం తరువాతే తెలుస్తోంది.

# హెచ్ సీఏలో ఏం జరుగుతోంది

**దారి మళ్లుతున్న నిధులు**

**జిల్లాల్లోనూ వాళ్లే సభ్యులు.. వాళ్లే ఆటగాళ్లు..**

**హైదరాబాద్, జూలై 22:**కొన్ని రోజులుగా హైదరా బాద్ క్రికెట్ అసోసియేషన్ వ్యవహారం ప్రధానంగా చర్చల్లో నిలుస్తోంది. హెచ్‌సీఏ అవినీతి, అక్రమాలపై ఇప్పటికే సీఐడీ విచారణ చేస్తోంది. ఈ క్రమంలో హెచ్‌సీఏ అక్రమాలు తవ్వుతున్న కొద్దీ ఒక్కొక్క టిగా బయటపడుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధి లక్ష్యాన్ని నిర్వీర్యం చేస్తూ జిల్లాల్లో, గ్రామీణ క్రికెట్‌పై ఆసక్తి ఉన్న క్రీడాకారుల భవిష్యత్‌ను హెచ్‌సీఏ ఫణంగా పెట్టింది.తద్వారా కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడింది. ఎన్నో ఏళ్లుగా జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి నిర్లక్ష్యానికి గురవుతున్నప్పటికీ హెచ్‌సీఏ అధ్యక్షు డిగా జగన్‌మోహన్‌రావు ఎన్నికైన తర్వా త ఇది మరింత దిగజారిపోయింది. అధికారిక లెక్కల్లో నిధులు కేటాయిస్తున్నప్పటికీ నిధుల విని యోగం మాత్రం మచ్చుకు కూడా కనిపించడంలేదు.హెచ్‌సీఏ జిల్లాల్లోని క్లబ్‌లకు పేరుకే నిధులను ప్రకటించి చేతు లు దులుపుకుంటోంది. ప్రతిభ ఉన్న క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా చేయాల్సిన హెచ్‌సీఏ తన బాధ్యతను విస్మరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి ఉన్న పిల్లల్లో క్రికెట్‌లో నైపుణ్యం పెంపొందించకుండా అవినీతి, అక్రమాలకు కేంద్రంగా నిలిచింది. ప్రతీ సంవత్సరం జిల్లా క్లబ్‌లు నిర్వహించే సమ్మర్ క్యాంపులకు హెచ్‌సీఏ నిధులు కేటాయిస్తుంది. 2024 ఏప్రిల్‌లో నిర్వహించిన సమ్మర్ క్యాంపుల కోసం గానూ ఒక్కో జిల్లా క్లబ్‌కు రూ.15లక్షలు మంజూరు చేసింది. ఆయా జిల్లాల్లోని 28 సెంటర్లలో 30 రోజుల పాటు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తారు.వరంగల్ జిల్లాలో 6, మహబూబ్‌నగర్‌లో 4, మెదక్‌లో 3, నిజామాబాద్‌లో 3, కరీంనగర్‌లో 3, ఖమ్మంలో 3, ఆదిలాబాద్‌లో 3, హైదరాబాద్‌లో 5 సెంటర్లలో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు ప్రకటించారు. ఒక్కో లూ క్యాంపులో 80 నుంచి 100 మంది పిల్లలకు శిక్షణ ఇస్తారు. దీనిలో బాలలకు సంబంధించి అండర్ అండర్ అండర్‌రీ బాలికలకు సంబంధించి అండర్ అండర్ శిక్షణ నిర్వహిస్తారు. అయితే ప్రణాళికాపరంగా అంతా బాగానే ఉన్నా..దీన్ని ఆచరించడంలో మాత్రం హెచ్‌సీఏ తీవ్ర నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తోంది.కేవలం పేరుకే జిల్లాల్లో నిర్వహించే సమ్మర్ క్యాంపుల కోసం నిధులు కేటాయిస్తుంది. కానీ ఖర్చు చేసి పిల్లలకు శిక్షణ మాత్రం ఇవ్వదు. సమ్మర్ క్యాంపుల పేరుతో తూతూమంత్రంలా శిక్షణను నిర్వహించి చేతులు దులుపుకుంటోంది. జిల్లాల్లో క్రికెట్ అభివృద్ధి చేయకపోగా సమ్మర్ క్యాంపులు, టోర్నమెంట్ల పేరిట ప్రతి ఏటా కోట్లాది రూపాయల అవినీతికి హెచ్‌సీఏ పాల్పడుతున్నదని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ ఆరోపిస్తున్నది. వాస్తవానికి హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ కేవలం హైదరాబాద్ జిల్లాకే పరిమితం కావాలి. కానీ తెలంగాణలోని అన్ని జిల్లాల క్లబ్‌లు హెచ్‌సీఏ ఆధ్వర్యంలోనే కొనసాగుతున్నాయి. అయితే హెచ్‌సీఏ పరిధిలో మొత్తం 216 క్లబ్‌లు ఉన్నాయి. వాటిలో కేవలం 8 మాత్రమే జిల్లాల క్లబ్‌లు పనిచేస్తున్నాయి.ఈ గణాంకాల ద్వారా తెలంగాణ రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధిపై హెచ్‌సీఏ నిర్లక్ష్యం, అన్ని జిల్లాల క్లబ్బులపై ఆధిపత్య ధోరణి స్పష్టమవుతున్నది. దీనికి తోడు మొత్తం 216 క్లబ్బుల్లో 57 క్లబ్బులు సస్పెండ్ అయ్యాయి. సస్పెండ్ అయిన క్లబ్బులను కొనసాగించడం, ఫేక్ క్లబ్‌ల నిర్వహణలో హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు కీలకంగా వ్యవహరించారని ఆరోపణలున్నాయి.ఇదిలా ఉంటే ఆయా జిల్లాలకు ఉన్న ఒక్క క్లబ్బుల నిర్వహణలోనూ అవినీతి, అక్రమాలకు హెచ్‌సీఏ తెర లేపింది. పేరుకే జిల్లాల క్లబ్బులు, వాటిలో ఉండే సభ్యులందరూ హైదరాబాద్‌కు చెందిన వారే కావడం గమనార్హం. జిల్లా క్లబ్బుల్లో స్థానికులకు చోటు లేకుండా హెచ్‌సీఏకు సంబంధించిన వ్యక్తులు కొనసాగుతున్నారని టీసీఏ ఆరోపిస్తుంది. దీంతో జిల్లాల క్లబ్బులకు కేటాయించిన నిధులు దుర్వినియోగం కావడానికి మరింత అవకాశం ఉంది.సభ్యులకే కాదు జిల్లా క్లబ్‌ల్లోని ఆటగాళ్లు కూడా హైదరాబాద్‌కు చెందిన వారే ఉంటున్నారనే ఆరోపణ అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. హెచ్‌సీఏ పరిధిలోని ఆటగాళ్లనే జిల్లా క్రికెట్ క్లబ్ తరపున బరిలో దింపుతున్నారు. ఈక్రమంలో జిల్లా క్లబ్‌ల్లో ఆడేందుకు క్రీడాకారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని టీసీఏ ప్రధానంగా ఆరోపిస్తోంది.దీంతో గ్రామీణ స్థాయి క్రీడాకారులకు అవకాశాలు లేకపోవడమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధి కుంటుపడుతోంది. ఇప్పటికైనా హెచ్‌సీఏ ఆధిపత్యాన్ని తగ్గించడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని క్లబ్‌లను ఏర్పాటు చేసి ఆసక్తి గల అభ్యర్థులకు సరైన శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి.




# ఏటీసీల్లో కొత్త కోర్సులు...



**హైదరాబాద్, జూలై 22:**తెలంగాణలో యువతకు నైపుణ్య శిక్షణ కోసం అధునాతన సాంకేతిక కేంద్రాల ఏర్పాటుపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్షించారు. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా కోర్సులు ఉండాలని, జీనోమ్ వ్యాలీలో మోడల్ ఏటీసీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మూడు దశల్లో ఏటీసీల అభివృద్ధి జరుగుతుందని, మొదటి రెండు దశల్లో 49 కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని సీఎం సూచించారు.తెలంగాణ యువతకు అధునాతన నైపుణ్య శిక్షణ అందించేందుకు అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లు ( ఏటీసీ ) ఏర్పాటు, పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. తెలంగాణ రైజింగ్ 2047 విజన్‌కు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులు, శిక్షణ అందించేలా ఏటీసీలను తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. మూడు ఫేజ్‌ల్లో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జీనోమ్ వ్యాలీలో ఒక మోడల్ ఏటీసీ ఏర్పాటు చేసి ఫార్మా, బయో టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించే కోర్సులు నిర్వహించాలని ఆయన ఆదేశించారు. వీలైనంత త్వరగా ఏటీసీల అభివృద్ధి పనులు పూర్తవ్వాలని, ఈ పనులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని చెప్పారు.రాష్ట్రంలో మూడు ఫేజ్‌లలో ఏటీసీలను అభివృద్ధి చేయనున్నట్లు సీఎం చెప్పారు. ఫేజ్-1, ఫేజ్-2, ఫేజ్-3గా విభజించి అభివృద్ధి చేస్తామన్నారు. ఫేజ్ - 1లో 25, ఫేజ్-2లో 40, ఫేజ్-3లో 46 ఏటీసీలను అభివృద్ధి చేస్తున్నామని.. వాటి పురోగతిపై ఈ సమీక్షలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫేజ్ - 1, ఫేజ్ - 2లో ఇప్పటి వరకు 49 అందుబాటులోకి వచ్చాయని అధికారులు తెలిపారు.ఏటీసీల ఏర్పాటుకు అధికారులు యుద్ధ ప్రాతిపదకను పనులు ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ముఖ్యంగా ఫార్మా, బయో టెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ పరిశ్రమల ఏటీసీ ఏర్పాటుకు అవసరమైన స్థలం కేటాయింపుతో పాటు అధునాతన సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలంటూ అధికారులకు రేవంత్ రెడ్డి సూచించారు.గిగ్ వర్కర్స్ పాలసీపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. గిగ్ కార్మికులకు ప్రతిపాదిత పాలసీని అధికారులు రేవంత్ రెడ్డి వివరించారు. వీళ్ల కోసం అధికారులు ఒక చట్టబద్ధమైన గుర్తింపు అంశాలన్ని పాలసీలో ప్రతిపాదించారు. సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం ప్రాతినిధ్యం వహించేలా ప్రతిపాదనలు చేశారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గిగ్ కార్మికుల పాలసీపై అధికారులకు పలు సూచనలు చేశారు. గిగ్ వర్కర్స్ సమాచారం మొత్తం ఆన్‌లైన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సంక్షేమ నిధి ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యాలను కల్పించాలంటూ సీఎం సూచించారు.

# ఉప రాష్ట్రపతి జగ్దీప్ ధనఖర్ రాజీనామా

**స్పందించిన కాంగ్రెస్ నేత కాంగ్రెస్ ఎంపీల ఫోరం చైర్మన్ డాక్టర్ మల్లు రవి**



**హైదరాబాద్:**ఉపరాష్ట్రపతి జగ్దీప్ ధనఖర్ రాజీనామా అనేది బీజేపీ అంతర్గత వ్యవహారమైనప్పటికీ ఆయన రాజీనామా ఎన్నో అనుమానాలకు తావిస్తోందని ఎంపి డాక్టర్ మల్లు రవి అన్నారు.ఈ మద్య జగ్దీప్ ధనఖర్ మాట్లాడుతున్నటువంటి విధానం, ఆయన సభ్యులకు సానుకూలంగా వ్యవహరిస్తున్న తీరును దృష్టిలో ఉంచుకుని బీజేపీ ఆయనను రాజీనామాచేయించినట్లు భావిస్తున్నానని అన్నారు.బీహార్ ఎన్నికల ముందు కొత్తవారిని ఉప రాష్ట్రపతిగా చేయాలని ఉద్దేశ్యంతోనే జగ్దీప్ ధనఖర్తో రాజీనామా చేయించినట్లుగా భావిస్తున్నా. ఆరోగ్యకారణాలు ఉన్నట్లయితే ఇవాళ కూడా ఏలాంటి ఇబ్బంది లేకుండా ఆరోగ్య సమస్యలు లేకుండా ఇవాళ కూడా జగ్దీప్ ధనఖర్ సభను విజయవంతంగా నడిపించిన సంగతి అందరికి తెలుసని అన్నారు.

## సినిమా



# 'రాజు గాని సవాల్' రిలీజ్‌కి రెడీ



లెలిజాల రవీందర్, రితికా చక్రవర్తి జంటగా నటిస్తున్న సినిమా 'రాజు గాని సవాల్'. లెలిజాల కమల ప్రజాపతి సమర్పణలో, ఎల్ ఆర్ ప్రొడక్షన్ బ్యానర్ పై లెలిజాల రవీందర్ నిర్మిస్తూ, దర్శకత్వం వహించారు. రక్షా బంధన్ సందర్భంగా ఆగస్టు 8న శ్రీ లక్ష్మి పిక్చర్స్ ద్వారా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో ఈ చిత్ర ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. హీరోయిన్స్ డింపుల్ హయతి, రాశీ సింగ్, తెలుగు ఫిలిం ఛాంబర్ అధ్యక్షులు భరత్ భూషణ్, ప్రొడ్యూసర్స్ దామోదర ప్రసాద్, టి. రామసత్యనారాయణ, ప్రసన్నకుమార్, గీత రచయిత గోరటి వెంకన్న, నటుడు డా.భద్రం ముఖ్య అతిథులుగా ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు, నిర్మాత, హీరో లెలిజాల రవీందర్ మాట్లాడుతూ, 'మా మూవీ ట్రైలర్ లాంచ్‌కు వచ్చిన పెద్దలు అందరికీ థ్యాంక్స్. ఇలాంటి పెద్దల మధ్య నా మూవీ ఈవెంట్ జరుపుకోవాలని కొన్నేళ్లుగా కలగం టున్నాను. అది ఈ రోజు నెరవేరడం హ్యాపీగా ఉంది. మా జీవితాల్లో జరిగిన కొన్ని రియల్ ఇన్సిడెంట్స్‌ను ఆధారంగా చేసుకుని రూపొందించిన చిత్రమిది. సహజంగా ఉండేందుకు కవాడిగూడ రియల్ లొకేషన్స్‌లో షూటింగ్ చేశాం. మధ్య తరగతి వారి జీవితంలో ఎన్నో సవాళ్లు ఉంటాయి. అలాంటి సందర్భంలో ఒక పెద్ద సమస్య ఎదురైతే ఆ మిడిల్ క్లాస్ పర్సన్ ఎలా ఎదుర్కొన్నాడు అనేది ఈ చిత్రంలో చూస్తారు. ఫ్యామిలీ బాండింగ్స్, స్నేహితుల మధ్య ఉండే అనుబంధాలను ఆకట్టుకునేలా తెరకెక్కించాం. సినిమా టెక్నికల్‌గా క్వాలిటీగా ఉండాలని టాప్ టెక్నీషియన్స్‌ను పెట్టుకున్నాం. యశ్వంత్ నాగ్ మ్యూజిక్‌లో రామ్ మిరియాల, అనురాగ్ కులకర్ణి, గోరటి వెంకన్న వంటి సింగర్స్ సాంగ్స్ పాడారు. ఈ సినిమా చూసి బాపిరాజు క్లాసికల్ మ్యూజికల్ హిట్ అవుతుందనటం హ్యాపీగా ఉంది' అని అన్నారు.

# పవన్ కళ్యాణ్ నోట ఫ్లాపుల మాట



హైదరాబాద్ లో జరిగిన హరిహర వీరమల్లు ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా ముగిసింది. సమయపాలన పరంగా కొంచెం ఆలస్యం జరిగినప్పటికీ ఎలాంటి అవాంతరాలు, ఇబ్బంది లేకుండా పక్కా ప్లానింగ్ తో నిర్వహించడం హమ్మయ్యా అనుకునేలా చేసింది. పరిమితికి మించి అభిమానులు వచ్చినప్పటికీ పాసుల విషయంలో కఠినంగా వ్యవహరించడం వల్ల సెక్యూరిటీ సమస్యలు రాలేదు. ఏపీ, తెలంగాణ, కర్ణాటకకు సంబంధించిన మంత్రులు, బ్రహ్మానందం లాంటి ఇండస్ట్రీ ప్రముఖులు తప్ప ప్రత్యేకంగా వేరే సెలబ్రిటీలు రాలేదు. ఫ్యాన్స్ కోరుకున్న త్రివిక్రమ్ శ్రీనివాస్, బండ్ల గణేష్ ఇద్దరూ లేకపోవడం లోటే. ఇక పవన్ కళ్యాణ్ తన ప్రసంగంలో మాట్లాడుతూ ఫ్లాపుల ప్రస్తావన తీసుకొచ్చారు. ఎక్కువ ఫ్లాపులు వచ్చి ఒకదశలో డౌన్ ఫీలవుతున్న టైంలో త్రివిక్రమ్ శ్రీనివాస్ లాంటి గొప్ప స్నేహితుడు వచ్చాడని, జల్సా రూపంలో తనకు హిట్ ఇవ్వడమే కాక ఒక గొప్ప బంధానికి తోడుగా నిలిచాడని చెప్పుకొచ్చారు. ఇప్పుడు సినిమా మీకు నచ్చిందా బద్దలు కొట్టేయండి అంటూ హరిహర వీరమల్లు ఏ స్థాయిలో ఉంటుందో చెప్పకనే చెప్పారు. భీమ్లా నాయక్ టైంలో పది పదిహేను రూపాయల టికెట్లకు కూడా మంచి వసూళ్లు తెచ్చామని, ఇప్పుడు మన ప్రభుత్వంలో ఎవడ్రా మనల్ని ఆపేది అంటూ వచ్చిన ఫ్యాన్స్ అందరికీ జోష్ ఇచ్చారు పవన్ కళ్యాణ్. మాట్లాడుతున్నంత సేపూ ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రిగా కాక ఒకప్పటి పవర్ స్టార్ లా ఫ్యాన్స్ కి కనిపించడం ఈవెంట్ లో మెయిన్ హైలైట్. ఉదయం ప్రెస్ మీట్ లో చెప్పిన విషయాలు మళ్ళీ రిపీట్ కాకుండా జాగ్రత్త పడటం బాగుంది. అందరికీ థాంక్స్ చెప్పే ఉద్దేశంతో కాగితం మీద రాసుకొచ్చిన పవన్ కళ్యాణ్ తాను చెప్పాలనుకున్న పాయింట్స్ అన్నీ పూర్తి చేశాకే స్టేజి దిగడం విశేషం. హరిహర వీరమల్లులకు సంబంధించిన విశేషాలు పంచుకున్న పవన్ కళ్యాణ్ విశాఖపట్నంతో పాటు మరో రెండు మూడు చోట్ల మిమ్మల్ని కలుసుకుంటానంటూ చెప్పడం చూస్తే రాబోయే రోజుల్లో మరిన్ని కబుర్లు తెలియనున్నాయి.

# మెప్పించే భిన్న కాన్సెప్ట్




తోట శ్రీకాంత్ కుమార్ రచన, దర్శకత్వంలో త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'థ్యాంక్యూ డియర్'. మహాలక్ష్మి ప్రొడక్షన్స్ బ్యానర్ పై పప్పు బాలాజీ రెడ్డి నిర్మిస్తున్నారు. ధనుష్ రఘుముద్రి, హెబ్బా పటేల్, రేఖా నిరోషా ముఖ్య పాత్రల్లో నటించారు. ఇటీవల డైరెక్టర్ వివి వినాయక్ లాంచ్ చేసిన టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా సోమవారం ఈ చిత్రంలోని తొలి గీతం 'చిక్కక చిక్కిన గుమ్మ'ను హీరో మంచు మనోజ్ లాంచ్ చేశారు. ఈ పాటను నిర్మాత బాలాజీ రెడ్డి స్వయంగా రాయగా, శ్రీచరణ్ ఈ పాటకు తన స్వరాన్ని జోడించారు. ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ,'ఈ సినిమాలోని తొలి పాటను నేను విడుదల చేయడం సంతోషకరంగా ఉంది. ఈ చిత్రం గొప్ప విజయం సాధిం చాలని ఆశిస్తున్నా' అని అన్నారు. 'మాకు సపోర్ట్‌గా నిలిచిన మనోజ్‌కి ధన్యవాదాలు. సినిమా కూడా మంచి హిట్ అవుతుందనే నమ్మకంతో ఉన్నాం' అని నిర్మాత బాలాజీ రెడ్డి చెప్పారు.'ఈ పాటని మనోజ్ బాగా ఎంజాయ్ చేశారు' అని సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ అన్నారు. లైన్ ప్రొడ్యూసర్ పునీత్ మాట్లాడుతూ, 'మనోజ్ రిలీజ్ చేసిన మా తొలి ఇన్‌స్టంట్ హిట్ అయ్యింది. పాట మాదిరిగానే సినిమా కూడా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు.

# రోజూ భార్యకు పాద నమస్కారం చేసే నటుడు



భర్తకు భార్య పాద నమస్కారం చేయడం ఎప్పట్నుంచో ఉన్న ఆనవాయితీ. ఏదైనా పూజలు చేసినపుడో, ఇంకేదైనా ప్రత్యేక సందర్భంలోనో భార్యలు ఇలా చేస్తారు. కానీ ఈ రోజుల్లో ఇలాంటివి అరుదైపోయాయి. అలా ఆశించే భర్తలు తక్కువ. ఆ రకంగా చేసే భార్యలూ అరుదైపోయారు. ఐతే భార్యకు భర్త పాద నమస్కారం చేయడం అన్నది అరుదైన విషయం. శాస్త్రాలు ఆ విషయం చెప్పవు. భార్య మీద ప్రేమ, గౌరవంతో అలా చేసే వాళ్లను కూడా తక్కువగానే చూస్తాం. ఐతే పాన్ ఇండియా స్థాయిలో మంచి పాపులారిటీ ఉన్న భోజ్‌పురి నటుడు రవికిషన్.. ప్రతి రోజూ తన భార్య పాదాలకు నమస్కారం చేస్తాడట. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ఒక టీవీ షోలో వెల్లడించడం విశేషం. 'రేసు గుర్రం' సహా పలు తెలుగు చిత్రాల్లో నటించి తెలుగులోనూ మంచి గుర్తింపు సంపాదించిన రవి కిషన్.. బోజ్‌పురిలో సూపర్ స్టార్. ఆయనకు బాలీవుడ్లోనూ మంచి గుర్తింపే ఉంది. ఇటీవల కపిల్ శర్మ నిర్వహించే టీవీ షోలో పాల్గొన్న రవి కిషన్.. తన భార్యకూ రోజూ పాద నమస్కారం చేస్తానని వెల్లడించాడు. రవి కిషన్ తన చిన్న నాటి స్నేహితురాలైన ప్రీతిని వివాహం చేసుకున్నాడు. ఐతే సినిమాల్లో గుర్తింపు తెచ్చుకోవడానికి ముందే తనకు పెళ్లి జరిగిందని.. తనకు ఏమీ లేని రోజుల్లో ప్రీతి తన వెంట నిలిచిందని రవి కిషన్ వెల్లడించాడు. తనకు పెద్ద కష్టాలు వచ్చినపుడు భార్యనే అండగా నిలిచిందని.. అందుకే ఇందుకు కృతజ్ఞతగా తాను ఆమెకు ఏం చేయగలనని ఆలోచించి ప్రతి రోజూ పాద నమస్కారం చేయడం మొదలుపెట్టానని రవి కిషన్ తెలిపాడు. ఐతే ఇది ఆమె నిద్ర పోయిన తర్వాత చేస్తానని అతను వెల్లడించాడు.

# 'పెద్ది' కోసం కొత్త అవతార్‌లో..



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'పెద్ది' కోసం కష్టపడి పనిచేస్తున్నారు. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫిలిం మేకర్ బుచ్చి బాబు సానా ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ పాన్- ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో విజనరీ వెంకట సతీష్ కిలారు తన ప్రతిష్టాత్మక బ్యానర్ వృద్ధి సినిమాస్ బ్యానర్ పై భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్‌తో దేశవ్యాప్తంగా భారీ అంచనాలను సృష్టించింది. ఈ చిత్రం కీలకమైన, సుదీర్ఘమైన షెడ్యూల్ మంగళవారం ప్రారంభం కానుంది. ఈ కీలకమైన ఫేజ్ కి ముందు రామ్ చరణ్ ఈ పాత్ర కోసం కొత్త అవతార్‌లోకి మారారు. పవర్‌ఫుల్ లుక్‌కి ఫిట్ అవడానికి ఫిజికల్‌గా ట్రాన్స్ ఫర్మేషన్ అయ్యారు. వరుసగా కసరత్తులు చేస్తూ శరీరాన్ని దృఢంగా తీర్చిదిద్దుకున్నారు. జిమ్‌లో తీసిన ఫోటో చూస్తే.. రగ్డ్ బీర్డ్, ముడివేసి వేసిన జుట్టు, దృఢమైన శరీరంతో లుక్ అదిరిపోయింది. ఈ మార్పు కేవలం లుక్ కోసమే కాదు, పాత్రపై అతని అంకితభావానికి నిదర్శనం. గ్రీక్ గాడ్ లా కనిపిస్తున్న చరణ్ రెగ్యులర్ మోడ్ వదిలేసి బీస్ట్ మోడ్‌లోకి ఫుల్‌గా మారిపోయాడు. చరణ్ పుట్టిన రోజు మార్చి 27న విడుదల కానున్న పెద్ది, తన కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులలో ఒకటిగా ఇప్పటికే సంచలనం సృష్టించింది. ఈ చిత్రం నుంచి కన్నడ సూపర్‌స్టార్ శివ రాజ్‌కుమార్ ఫస్ట్ లుక్ కూడా ఇటీవల అతని పుట్టినరోజున విడుదలైంది. ఈ చిత్రంలో జాన్వి కపూర్ కథానాయికగా నటించగా, జగపతి బాబు, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ ఆర్.రత్నవేలు డీఓపీగా పని చేస్తున్నారు. ఆస్కార్ అవార్డు గ్రహీత మాస్ట్రో ఎ.ఆర్. రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

# ఓజి హీరోయిన్ మీద మార్కెటింగ్ కుట్ర ?



శర్వానంద్ శ్రీకారం, నాని గ్యాంగ్ లీడర్ తో మనకూ పరిచయమున్న ప్రియాంకా అరుళ్ మోహన్ ప్రస్తుతం పవన్ కళ్యాణ్ తో ఓజి చేస్తున్న సంగతి తెలిసిందే. దీని షూటింగ్ అయిపోయింది కానీ ఈ సినిమా మీద అమ్మడు చాలా ఆశలు పెట్టుకుంది. టాలీవుడ్ మొదటి బ్లాక్ బస్టర్ దీంతో దక్కబోతోందని ఎదురు చూస్తోంది. సరిపోదా శనివారం మంచి పేరే తీసుకొచ్చినప్పటికీ అది పూర్తిగా నాని, ఎస్జె సూర్య డామినేషన్ లో నడవడంతో ఎక్కువ హైలైట్ కాలేకపోయింది. అయితే తమిళంలో మంచి ఫాలోయింగ్ ఉన్న ప్రియాంకా మోహన్ మీద మార్కెటింగ్ కుట్ర జరుగుతోందని కోలీవుడ్ మీడియా వర్గాలు కోడై కూస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే ప్రియాంకా అరుళ్ మోహన్ కు మొన్నటిదాకా మార్కెట్ బాగానే ఉండేది. శివ కార్తికేయన్ తో డాన్ %-% డాక్టర్, సూర్య ఈటిలు మంచి హిట్లే ఇచ్చాయి. ధనుష్ కెప్టెన్ మిల్లర్, జయం రవి బ్రదర్ ఆశించిన ఫలితాలు అందుకోలేకపోయినా ఇమేజ్ పరంగా మరీ డౌన్ ఫాల్ అయితే రాలేదు. ప్రస్తుతం కెవిన్ తో చేస్తున్న మూవీ ఒకటే తన చేతిలో ఉంది. చెన్నై టాక్ ప్రకారం ప్రియాంక మోహన్ మీద ఒక పిఆర్ ఏజెన్సీ ఉద్దేశపూర్వకంగానే నెగటివ్ క్యాంపైన్ తో తనకు అవకాశాలు రాకుండా చేస్తోందట. ఒకప్పుడు ఇదే కంపెనీ కోలీవుడ్ టాప్ సెలబ్రిటీలతో పాటు ఈమెకు కూడా సేవలు అందించింది. అయితే వీళ్ళ పద్ధతి నచ్చక ప్రియాంకా కొన్ని నెలల క్రితం వాళ్ళతో ఒప్పందం రద్దు చేసుకుంది. దీన్ని అవమానంగా భావించిన సదరు సంస్థ కావాలనే తన గురించి తప్పుడు ప్రచారాలు చేస్తోందని ఫ్యాన్స్ కంప్లయింట్ చేస్తున్నారు. వీటి మీద అంత సులభంగా ఆధారాలు దొరకవు కాబట్టి ప్రస్తుతానికి ఇది ఆన్ లైన్ డిస్కషన్ కు మాత్రమే పరిమితమయ్యింది. జాబిలమ్మ నీకు అంత కోపమాలో తను స్పెషల్ సాంగ్ చేసినప్పుడు జరిగిన ట్రోలింగ్ వెనుక కూడా అదే పిఆర్ ఉన్నారని అభిమానులు అనుమానపడుతున్నారు. అందుకే అంటారు సినీ పరిశ్రమలో ఎవరికి ఎవరు ఏమి కారు, ఇక్కడంతా అవసరాల మీద నడిచే వారని.



# క్రీడలు




## ఎనిమిదేళ్ల తర్వాత ఎంట్రీ ఇస్తున్న లియామ్ డాసన్




ఇంగ్లాండ్ నాలుగో టెస్టు కోసం తమ ప్లేయింగ్ ఎలెవన్‌ను ప్రకటించింది. ఇందులో ఒక ఆసక్తికరమైన మార్పు జరిగింది. లియామ్ డాసన్ 8 సంవత్సరాల తర్వాత టెస్ట్ క్రికెట్ ఆడనున్నాడు. అతన్ని షోయబ్ బషీర్ స్థానంలో తీసుకున్నారు. ఈ సిరీస్‌లో కరుణ్ నాయర్ కూడా 8 సంవత్సరాల తర్వాత ప్లేయింగ్ ఎలెవన్‌లోకి వచ్చాడు. వీరిద్దరి మధ్య ఈ రీఎంట్రీ కాకుండా మరో ఆసక్తికరమైన కనెక్షన్ కూడా ఉంది. ప్రస్తుతం 1-2తో సిరీస్‌లో వెనుకబడి ఉన్న టీమిండియాకు నాలుగో టెస్ట్ డూ ఆర్ డై లాంటిది. ఈ మ్యాచ్ ఓడిపోతే శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని జట్టు సిరీస్‌ను కోల్పోతుంది. ఒకవేళ ఈ టెస్ట్ డ్రా అయినా, ఐదవ టెస్ట్‌లో భారత్ గెలిచినా సిరీస్‌ను సమం మాత్రమే చేయగలదు. భారత్ వర్సెస్ ఇంగ్లాండ్ టెస్ట్ మ్యాచ్‌లలో అత్యధిక వ్యక్తిగత స్కోరు కరుణ్ నాయర్ పేరు మీద ఉంది. అతను 2016 డిసెంబర్‌లో చెన్నైలో జరిగిన టెస్టులో అజేయంగా 303 పరుగులు చేశాడు. ఆ టెస్ట్ మ్యాచ్ లియామ్ డాసన్ కు అరంగేట్రం మ్యాచ్. ఆ మ్యాచ్‌లో డాసన్ 2 వికెట్లు కూడా పడగొట్టాడు. ఈ విధంగా ఇద్దరు ఆటగాళ్ల కెరీర్‌లో 8 ఏళ్ల విరామం తర్వాత ప్లేయింగ్ ఎలెవన్‌లోకి తిరిగి రావడం, ఒకరి రికార్డు మ్యాచ్ మరొకరి అరంగేట్రం మ్యాచ్ కావడం ఒక ప్రత్యేక కనెక్షన్. ఆల్‌రౌండర్ లియామ్ డాసన్ ఇప్పటివరకు 3 టెస్టులు ఆడాడు. వాటిలోని 5 ఇన్నింగ్స్‌లలో 7 వికెట్లు పడగొట్టాడు. అతను 212 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడి, 10731 పరుగులు చేసి, 371 వికెట్లు తీశాడు. అతను మంచి బ్యాటింగ్ కూడా చేయగలడు. ఇది బెన్ స్టోక్స్ నేతృత్వంలోని ఇంగ్లాండ్ జట్టు బ్యాటింగ్ లైనప్‌ను మరింత బలోపేతం చేస్తుంది. ఇంతకు ముందు, మూడో మ్యాచ్‌లో జోఫ్రా ఆర్చర్ కూడా 4 సంవత్సరాల తర్వాత టెస్ట్ క్రికెట్ ఆడాడు. ఆర్చర్ రాకతో ఇంగ్లాండ్ బౌలింగ్ మరింత పటిష్ఠంగా మారింది.

## మాంచెస్టర్ మైదానంలో ట్రిపుల్ సెంచరీ చేసిన బ్యాట్స్‌మెన్



మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో ట్రిపుల్ సెంచరీ సాధించిన ఏకైక బ్యాట్స్‌మెన్ బాబ్ సింప్సన్ గురించి తెలుసుకోండి. 1964లో ఇంగ్లాండ్‌పై అతను సాధించిన 311 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఆధునిక క్రికెట్‌లో కూడా ఇలాంటి ఇన్నింగ్స్‌లు చాలా అరుదుగా కనిపిస్తాయి. మాంచెస్టర్ టెస్టులో భారత్-ఇంగ్లాండ్ ఆటగాళ్ల నుంచి ఎలాంటి ప్రదర్శనలు వస్తాయో చూడాలి. భారత్, ఇంగ్లాండ్ మధ్య నాలుగో టెస్ట్ మ్యాచ్ మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానంలో జరగనుంది. ఈ మైదానానికి ఒక ప్రత్యేక రికార్డు ఉంది. టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఇక్కడ ట్రిపుల్ సెంచరీ (300 పరుగులు) సాధించిన ఏకైక బ్యాట్స్‌మెన్ బాబ్ సింప్సన్ మాత్రమే. ఆ అద్భుతమైన మ్యాచ్ గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మధ్య ఈ మ్యాచ్ 1964 జూలై 23-28 తేదీల్లో జరిగింది. ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా కెప్టెన్ బాబ్ సింప్సన్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. బాబ్ సింప్సన్, బిల్ లారీతో కలిసి ఆస్ట్రేలియా ఇన్నింగ్స్‌ను ప్రారంభించాడు. ఈ ఇద్దరు బ్యాట్స్‌మెన్ మొదటి వికెట్‌కు 201 పరుగుల భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. బిల్ లారీ 313 బంతుల్లో 106 పరుగులు చేసి అవుటయ్యాడు. అయితే, సింప్సన్ మాత్రం రెండో ఎండ్‌లో క్రీజులో పాతుకుపోయాడు. బాబ్ సింప్సన్, బ్రియాన్ బూత్ తో కలిసి ఐదవ వికెట్‌కు 219 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి, జట్టు స్కోరును 600 పరుగుల మార్కును దాటించాడు. సింప్సన్ 743 బంతులు ఎదుర్కొని 311 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. అతను 762 నిమిషాల పాటు బ్యాటింగ్ చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో ఒక సిక్స్, 23 ఫోర్లు ఉన్నాయి. సింప్సన్ అద్భుతమైన బ్యాటింగ్ పుణ్యమా అని ఆస్ట్రేలియా 656/8 స్కోరు వద్ద తమ మొదటి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ఇంగ్లాండ్ బౌలర్లలో జాన్ ప్రైస్ మూడు వికెట్లు తీశాడు, ఫ్రెడ్ రమ్సే, టామ్ కార్ట్‌రైట్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఆస్ట్రేలియా భారీ స్కోరుకు సమాధానంగా, ఇంగ్లాండ్ 15 పరుగులకే జాన్ ఎడ్రిచ్(6) వికెట్ కోల్పోయింది. అయితే, అక్కడ నుండి కెప్టెన్ టెడ్ డెక్స్టర్, ఓపెనర్ జియోఫ్ బాయ్‌కాట్ తో కలిసి రెండో వికెట్‌కు 111 పరుగులు జోడించి జట్టును ఆదుకున్నాడు. జియోఫ్ బాయ్‌కాట్ 58 పరుగుల వద్ద పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత కెప్టెన్ టెడ్ డెక్స్టర్ కెన్ బారింగ్టన్ తో కలిసి మూడో వికెట్‌కు 246 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. డెక్స్టర్ 174 పరుగులకు అవుటవ్వగా, బారింగ్టన్ 256 పరుగుల అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఇంగ్లాండ్ తమ మొదటి ఇన్నింగ్స్‌లో 611 పరుగులు చేసింది. ఈ ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా తరఫున గ్రాహం మెకెంజీ ఏడు వికెట్లు తీసుకోగా, టామ్ వీవర్స్ మిగిలిన మూడు వికెట్లు పడగొట్టాడు. ఆస్ట్రేలియా తమ రెండో ఇన్నింగ్స్‌లో రెండు ఓవర్లు ఆడి, వికెట్ నష్టపోకుండా నాలుగు పరుగులు చేసింది. చివరకు మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్ టెస్ట్ క్రికెట్ చరిత్రలో బాబ్ సింప్సన్ ట్రిపుల్ సెంచరీకి, ఓల్డ్ ట్రాఫోర్డ్ మైదానానికి ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది.

## భారత క్రికెటర్లకు నిజంగా దేశభక్తి ఉంటే ఆ పని చేయాలి?




పాకిస్థాన్ మాజీ క్రికెటర్ సల్మాన్ బట్, భారత మాజీ క్రికెటర్లు పాకిస్తాన్ తో క్రికెట్ మ్యాచ్ రద్దు చేసిన విషయంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశభక్తి ఉంటే భారత్ పాకిస్థాన్ తో ఏ స్థాయిలోనూ క్రికెట్ ఆడకూడదని డిమాండ్ చేశారు. భారత క్రికెటర్లకు నిజంగానే దేశభక్తి ఉంటే ఇకపై పాకిస్థాన్‌తో ఏ స్థాయిలో కూడా క్రికెట్ ఆడొద్దని పాకిస్థాన్ మాజీ క్రికెటర్ సల్మాన్ భట్ ఘాటు విమర్శలు చేశాడు. ఒక్క క్రికెట్ అనే కాదు.. అంతర్జాతీయ స్థాయిలో, ఒలింపిక్స్ వేదికగా కూడా పాకిస్థాన్‌తో ఏ స్పోర్ట్‌లోనూ పోటీ పడొద్దని, అలా చేయగలారా? అంటూ సవాల్ విసిరాడు. సల్మాన్ భట్ ఏడుపునకు కారణం ఏంటంటే.. గత ఆదివారం (జులై 20) వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్ లీగ్‌లో పాకిస్థాన్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను భారత క్రికెటర్లు రద్దు చేసుకున్నారు. ఈ డబ్ల్యూసీఎల్ టోర్నీలో ఇరు దేశాల రిటైర్డ్ క్రికెటర్లు మ్యాచ్ ఆడాల్సి ఉంది. యువరాజ్ కెప్టెన్సీలో భారత మాజీ క్రికెటర్ల జట్టు, షాహిద్ అఫ్రిదీ కెప్టెన్సీలో పాక్ మాజీ క్రికెటర్ల టీమ్ తలపడాల్సి ఉండగా మ్యాచ్ రద్దు అయింది. పహల్గామ్ ఉగ్రదాడికి నిరసనగా భారత మాజీ క్రికెటర్లు పాక్‌తో మ్యాచ్ ఆడకూడదని నిర్ణయించుకున్నారు. ఇది తీవ్ర చర్చకు దారి తీసింది. చివరి నిమిషంలో మ్యాచ్ రద్దుతో క్రికెట్ ప్రపంచం దీని గురించి మాట్లాడుకుంది. ఇదే విషయంపై సల్మాన్ భట్ స్పందిస్తూ.. ఇకపై టీమిండియా, పాకిస్థాన్‌తో వరల్డ్ కప్, ఒలింపిక్స్‌లో కూడా తలపడదని వాళు ప్రామిస్ చేయాలంటూ తన ఆక్రోషం వెళ్లగక్కాడు. క్రికెట్ విషయానికి వచ్చే సరికే ఇండియా, పాకిస్థాన్ మధ్య సంబంధాల మధ్య చర్చ జరుగుతుందని, ఇతర ఆటల్లో మాత్రం అలాంటి ఇబ్బంది ఉండదని అన్నాడు. ఇప్పుడు చేసినట్లే.. వరల్డ్ కప్, ఒలింపిక్స్‌లో కూడా భారత జట్టు పాకిస్థాన్‌తో ఆడమని చెప్పాలని, అప్పుడు వాళ్ల దేశభక్తి ఏ పాటిదో తాను కూడా చూస్తానంటూ పెద్ద పెద్ద మాటలే మాట్లాడాడు. కాగా ఇండియాతో క్రికెట్ ఆడాలని పాకిస్థాన్ క్రికెటర్లు ఎంతో ఆసక్తిగా ఉంటారు. ఎందుకంటే పేద దేశమైన పాకిస్థాన్‌కు టీమిండియాతో మ్యాచ్‌లు ఆడి ఎక్కువ డబ్బు సంపాదించుకోవచ్చు అని చూస్తుంటారు. ఇండియా పాకిస్థాన్ మ్యాచ్‌కు ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఇండియాతో మ్యాచ్ అనగానే వాళ్లకు స్పాన్సర్లు, యాడ్ రెవెన్యూ, బ్రాడ్ కాస్టింగ్ నుంచి మంచిగా డబ్బు వస్తుంది. దాని కోసమే ఇండియాతో మ్యాచ్‌ల కోసం పాకులాడుతూ ఉంటారు. ఇప్పుడు సల్మాన్ భట్ ఏడుపు కూడా అందుకే. కాగా వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్‌లో పాకిస్థాన్‌తో మ్యాచ్ రద్దు చేయడంపై భారత మాజీ క్రికెటర్లపై భారత క్రికెట్ అభిమానులు ప్రశంసల వర్షం కురిపించారు. నిజానికి.. ఈ టోర్నీలో భారత్, పాక్ తలపడుతున్నాయని తెలియగానే.. తీవ్ర విమర్శలు వచ్చాయి. మొత్తానికి భారత క్రికెట్ అభిమానుల నుంచి వచ్చి ఒత్తిడి, విమర్శల కారణంగానే మ్యాచ్ రద్దు అయింది.

## నాలుగో టెస్ట్‌లో పంత్ వికెట్ కీపింగ్ చేస్తాడా..




ఇంగ్లాండ్‌తో నాలుగో టెస్టులో రిషబ్ పంత్ వికెట్ కీపింగ్ చేస్తాడా లేదా అనే సందేహాలకు ప్రాక్టీస్ వీడియో తెరదించింది. పంత్ పూర్తి ఫిట్‌నెస్‌తో కీపింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. రిషబ్ పంత్ వికెట్ కీపింగ్ చేస్తూ బ్యాటింగ్ చేయడం టీమిండియాకు పెద్ద బలం. అతని ఫిట్‌నెస్ గురించి ఉన్న ఆందోళనలు ఈ వీడియోతో కొంతవరకు తీరిపోయాయి. ఇంగ్లాండ్‌తో జరగనున్న నాలుగో టెస్ట్ మ్యాచ్ టీమిండియాకు డూ ఆర్ డై లాంటిది. ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలి. గాయాల బెడద టీమిండియాను వెంటాడుతోంది. నితీష్ కుమార్ రెడ్డి సిరీస్ మొత్తానికి దూరమయ్యాడు. అర్షదీప్ సింగ్ కూడా నాలుగో టెస్ట్ ఆడటం లేదు. రిషబ్ పంత్ గురించి కూడా మరో వార్త వెలుగులోకి వచ్చింది. అతను కేవలం బ్యాట్స్‌మెన్‌గా మాత్రమే ఆడతాడని, వికెట్ కీపింగ్ చేయడం కష్టమని తెలిసింది. అయితే, ఇప్పుడు ఒక వీడియో బయటపడింది. దీంతో శుభమన్ గిల్ టెన్షన్ కొంత తగ్గిందని చెప్పొచ్చు. మూడో టెస్టు మొదటి రోజే రిషబ్ పంత్ వేలికి గాయమైంది. దీంతో అతను మైదానం నుంచి బయటకు వెళ్లాడు. ఆ తర్వాత టెస్ట్ మ్యాచ్ అంతా ధ్రువ్ జురెల్ వికెట్ కీపింగ్ చేశాడు. రిషబ్ పంత్ బ్యాటింగ్ చేసినా తను కంప్లీట్ ఫిట్‌గా లేడు. దీంతో నాలుగో టెస్టుకు పంత్ దూరం అవుతాడని, లేదా కేవలం బ్యాట్స్‌మెన్‌గా మాత్రమే ఆడతాడని చాలా వార్తలు వచ్చాయి. కానీ, ఇప్పుడు వచ్చిన కొత్త వీడియో అభిమానులకు కాస్త ఊరటనిచ్చింది. రిషబ్ పంత్ కు సంబంధించిన ఒక వీడియో బయటపడింది. ఇది మాంచెస్టర్‌లో ప్రాక్టీస్ సెషన్‌కు సంబంధించినది. ఈ వీడియోలో పంత్ వికెట్ కీపింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. అతను చాలా సేపు వికెట్ కీపింగ్ చేశాడు. అతనికి ఎలాంటి ఇబ్బంది ఉన్నట్లు కనిపించలేదు. దీన్ని బట్టి చూస్తే, నాలుగో టెస్టులో రిషబ్ పంత్ వికెట్ కీపింగ్ చేసే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. రిషబ్ పంత్ ఈ సిరీస్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన మొదటి టెస్టులో రెండు ఇన్నింగ్స్‌లలోనూ సెంచరీలు (134, 118) సాధించాడు. రెండో టెస్టులో (25, 65) రెండో ఇన్నింగ్స్‌లో 65 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడాడు. గాయం ఉన్నప్పటికీ మూడో టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో 74 పరుగులు చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లో 9 పరుగులకే అవుటయ్యాడు. అతని బ్యాటింగ్ ఫామ్ టీమిండియాకు చాలా కీలకం. భారత్‌కు నాలుగో టెస్ట్ డూ ఆర్ డై లాంటిది. సిరీస్‌లో మొదటి టెస్టును ఇంగ్లాండ్, రెండో టెస్టును భారత్ గెలిచాయి. మూడో టెస్టులో విజయం సాధించి ఇంగ్లాండ్ 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. నాలుగో టెస్టును ఇంగ్లాండ్ గెలిస్తే, సిరీస్‌లో ఆధిక్యాన్ని సాధిస్తుంది. అదే జరిగితే, ఐదవ టెస్టును గెలిచినా ఇంగ్లాండ్ సిరీస్‌ను సమం చేయగలదు. టీమిండియా ఈ టెస్టును గెలిచి సిరీస్‌ను 2-2తో సమం చేయాలని చూస్తోంది. ఒకవేళ ఈ టెస్ట్ డ్రా అయినా, ఇంగ్లాండ్‌కు సిరీస్ ఓటమి భయం ఉండదు. అందుకే ఈ మ్యాచ్ భారత్‌కు చాలా కీలకం.

## జడేజా రిస్క్ తీసుకొని ఉంటే బాగుండేది..

లార్డ్స్ వేదికగా ఇంగ్లండ్‌తో జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్‌లో భారత అల్ రౌండర్ రవీంద్ర జడేజా చేసిన ఒంటరి పోరాటం వృథా అయింది. ఈ మ్యాచ్‌లో భారీ తేడాతో భారత్ ఓడిపోతుందని అనుకున్న తరుణంగా జడేజా పట్టు వదలకుండా బ్యాటింగ్ చేశాడు. దీంతో భారత్ కేవలం 22 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ నేపథ్యంలో జడేజాపై పలువురు సీనియర్లు విమర్శలు కూడా చేశారు. జడేజా ఇంకాస్త వేగంగా ఆడి ఉంటే బాగుండేది అని వాళ్లు అభిప్రాయపడ్డారు. అయితే తాజాగా టీం ఇండియా మాజీ క్రికెటర్ సురేశ్ రైనా జడేజాపై ప్రశంసల వర్షం కురిపించాడు. టెస్టు క్రికెట్‌లో జడేజా అత్యుత్తమ ఆల్ రౌండర్ అని కొనియాడాడు. టీం ఇండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీతో పోలుస్తూ.. జడేజాను ప్రశంసిస్తూనే.. ఇంకాస్త వేగంగా ఆడి ఉంటే బాగుండేదని అన్నాడు. టెస్టుల్లో ఇంగ్లండ్ గడ్డపై కోహ్లీ కంటే జడేజానే ఎక్కువ పరుగులు చేశాడని రైనా అన్నాడు. ఇద్దరి మధ్య హాఫ్ సెంచరీల సంఖ్యలో మాత్రమే వ్యత్యాసం ఉందని.. కానీ ప్రపంచంలోనే జడేజా అత్యుత్తమ ఆల్ రౌండర్ అని పేర్కొన్నాడు. “లార్డ్స్ టెస్టులో మనం 100 పరుగుల తేడాతో ఓడిపోతాం అనుకున్నాం. కానీ, జడేజా పట్టుదలతో ఆఖరి వరకూ పోరాడిన తీరు అద్భుతం. అయితే జడ్డూ ఇంకాస్త రిస్క్ తీసుకొని ఉంటే బాగుండేది. బుమ్రా క్రీజ్‌లో ఉన్న సమయంలో ఆ అవకాశం ఉండేది. కొన్ని ఫోర్లు, సిక్సులు కొడితే విజయ లాంఛనం పూర్తి చేసేవాడేమో” అని రైనా పేర్కొన్నాడు. ఇక భారత్ ఇంగ్లండ్ మధ్య నాలుగో టెస్ట్ జూలై 23 నుంచి మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రఫోర్డ్ వేదికగా ప్రారంభం కానుంది.




# ఆరోగ్యం



## ఖాళీ కడుపుతో వీటిని తింటున్నారా..?



మీరు కూడా మీ రోజును స్వీట్లతో ప్రారంభిస్తారా? ఖాళీ కడుపుతో స్వీట్లు తింటూ సమయాన్ని ఆస్వాదిస్తారా..? అయితే.. మీకో షాకింగ్ న్యూస్. ఈ అలవాటు మీ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ఉదయం నిద్రలేచిన వెంటనే తీపి పదార్థాలు తినడం చాలా మంది దినచర్యలో భాగం.. అది టీ అయినా.. బిస్కెట్లు లేదా స్వీట్.. లేదా బ్రెడ్-జామ్ వంటి తేలికపాటి తీపి ఏదైనా కావచ్చు.. కానీ ఖాళీ కడుపుతో స్వీట్లు తినడం నిజంగా సురక్షితమేనా? ఇది సాధారణ అలవాటు అనుకోవచ్చా..? లేదా ఆరోగ్యానికి హానికరమా? ఏ విధంగా శరీరాన్ని దెబ్బతీస్తుంది..? ఇటీవలి పరిశోధన.. వైద్య నిపుణుల అభిప్రాయం దీనిపై చాలా దిగ్భ్రాంతికరంగా ఉన్నాయి. శరీరం ఖాళీ కడుపుతో స్వీట్లు (గ్లూకోజ్ లేదా ఫ్రక్టోజ్) తీసుకున్నప్పుడు, రక్తంలో చక్కెర అకస్మాత్తుగా వేగంగా పెరుగుతుంది. ఇది శరీరంలో ఇన్సులిన్ హార్మోన్ పెద్ద మొత్తంలో విడుదలకు కారణమవుతుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ క్లినికల్ న్యూట్రిషన్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం.. ఉదయం ఖాళీ కడుపుతో స్వీట్లు తినడం వల్ల ఇన్సులిన్ నిరోధకత ప్రమాదం పెరుగుతుంది. ఇది టైప్ 2 డయాబెటిస్, ఊబకాయం వంటి వ్యాధులకు కారణమవుతుంది. ఈ అలవాటు చాలా కాలం పాటు కొనసాగితే, అది జీవక్రియ ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. ఉదయం ఖాళీ కడుపుతో స్వీట్లు తినడం వల్ల మీకు తక్షణ శక్తి.. మంచి అనుభూతి లభిస్తుందని.. కానీ ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని.. =మీా హాస్పిటల్‌లోని మెడిసిన్ విభాగానికి చెందిన డాక్టర్ సుభాష్ గిరి వివరిస్తున్నారు. కానీ కొంతకాలం తర్వాత రక్తంలో చక్కెర తగ్గినప్పుడు, మీరు అలసట, చిరాకు, తక్కువ శక్తి వంటి సమస్యలను ఎదుర్కొంటారు. దీనిని షుగర్ క్రాష్ అంటారు. ఇది రోజు సామర్థ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. కొంతమంది నిపుణులు దీనిని రియాక్టివ్ హైపోగ్లైసీమియా అని పిలుస్తారు.. దీనిలో రక్తంలో చక్కెర మొదట పెరుగుతుంది. తరువాత చాలా వేగంగా తగ్గుతుంది. స్వీట్లలో ఉండే ప్రాసెస్ చేసిన చక్కెర ఖాళీ కడుపుతో తీసుకుంటే గ్యాస్, ఆమ్లత్వం, అజీర్ణం కలిగిస్తుంది. ఖాళీ కడుపుతో స్వీట్లు తినడం వల్ల కడుపులోని మంచి బ్యాక్టీరియా సమతుల్యత దెబ్బతింటుంది. దీనివల్ల శరీరంలో వాపు, ఉబ్బరం వంటి సమస్యలు వస్తాయి. ఉదయం సమయం జీర్ణవ్యవస్థకు చాలా సున్నితంగా ఉంటుంది. కాబట్టి ఈ సమయంలో ప్రాసెస్ చేసిన లేదా శుద్ధి చేసిన చక్కెరను నివారించడం మంచిది.

## ఆ నలుగురిలో మీరున్నారా..?



అప్పటిదాకా బాగానే ఉంటారు. మనతో నవ్వుతూ మాట్లాడతారు. ఇంతలోనే పక్షవాతం బారిన పడ్డారనే సమాచారం మనల్ని దిగ్భ్రాంతికి గురిచేస్తుంది. బ్రెయిన్ స్ట్రోక్ అంటే నూటికో కోటికో వచ్చే జబ్బు కాదు. ప్రతి నలుగురిలో ఒకరికి వచ్చే ప్రమాదం ఉంది. ఆ నలుగురిలో మీరున్నారా? అది తెలుసుకోవడం ఎలా? ఇంతకీ మీ బ్రెయిన్ భద్రమేనా? దేశంలో బ్రెయిన్ స్ట్రోక్ కేసులు ఆందోళనకర స్థాయిలో పెరిగిపోతున్నాయి. ప్రతి నలుగురిలో ఒకరు పక్షవాతం బారిన పడుతున్నారు. గత 20 ఏళ్లలో దేశంలో బ్రెయిన్ స్ట్రోక్ కేసులు డబుల్ అయ్యాయి అంటే.. మెదడుకు డేంజర్ బెల్స్ ఏ స్థాయిలో మోగుతున్నాయో మనం అర్థం చేసుకోవచ్చు. బ్రెయిన్ స్ట్రోక్.. మన దేశంలో కోట్లాదిమందిని పీడిస్తున్న వ్యాధి. ప్రతి 20 సెకండ్లకు ఒకరికి పక్షవాతం వస్తుందని, ఏటా దాదాపు 18 లక్షల మంది బ్రెయిన్ స్ట్రోక్‌తో పక్షవాతానికి గురౌతున్నారని మీకు తెలుసా? దీనికి సంబంధించి అనేక రకాల చికిత్స విధానాలు అందుబాటులో ఉన్నప్పటికీ, వాటి మీద అవగాహన లేక ఎంతోమంది ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. ఒక శాతం మంది మాత్రమే మెరుగైన వైద్యంతో బయటపడుతున్నారు. అసలు బ్రెయిన్ స్ట్రోక్ రావడానికి మారుతున్న జీవనశైలి, ఒత్తిడి, జన్యుపరమైన కారణాలు, ఒబేసిటీ, హై బీపీ, డయాబెటిస్, స్మోకింగ్ వంటివి ప్రధాన కారణాలని వైద్య నిపుణులు చెబుతున్నారు. డ్రింకింగ్, అన్ హెల్తీ ఫుడ్ హ్యాబిట్స్ కూడా ఇబ్బందికరంగా మారయంటున్నారు. బ్రెయిన్ స్ట్రోక్‌తో పక్షవాతానికి గురయ్యేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. ఇందులో 25శాతం మంది 40 ఏళ్ల లోపువారే అవ్వడం మరింత ప్రమాదకరం అంశం. ఇటీవల కాలంలో బ్రెయిన్ స్ట్రోక్ కేసులు బాగా పెరుగుతున్నాయి. ఒకప్పుడు వయసు పైబడిన వారికే వచ్చే ఈ బ్రెయిన్ స్ట్రోక్ ఇప్పుడు చిన్న వయసు వారికి కూడా రిస్క్ ను పెంచేసింది. 20 ఏళ్లతో పోల్చితే పక్షవాతం కేసులు రెట్టింపు అయ్యాయని రిపోర్టులు తెలుపుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రమాదకరంగా మారుతున్న వ్యాధుల్లో బ్రెయిన్ స్ట్రోక్ ప్రధానంగా ఉండడం ఆందోళనకు గురి చేస్తోంది. మెదడుకు రక్త సరఫరా అకస్మాత్తుగా ఆగిపోవడం లేదా మెదడులోని రక్తనాళాలు పగిలిపోవడంతో బ్రెయిన్ స్ట్రోక్ వస్తుంది. దీంతో మెదడులోని కణాలు చనిపోయి.. ఏదో ఒక అవయవం చచ్చుబడిపోవడం లేదా చనిపోయే అవకాశం ఉంటుంది. స్ట్రోక్ వచ్చిన ఒక్క నిమిషంలోనే, బ్రెయిన్‌లో 20 లక్షల న్యూరాన్స్ చనిపోతాయని నిపుణులు చెబుతున్నారు.

## చక్కెరకు బదులు ఇవి వాడుతున్నారా?



శరీరంలో చక్కెర మోతాదు తగ్గించుకునే ప్రయత్నంలో చాలామంది స్వీట్నర్లను ఆశ్రయిస్తుంటారు. అయితే, 'ఎరిత్రిటాల్' వంటి కొన్ని స్వీట్నర్లు ఆరోగ్యానికి హానికరం కావచ్చని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. వీటి వినియోగం గుండె, మెదడుకు సంబంధించిన తీవ్ర సమస్యలకు దారితీయవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. షుగర్ ఫ్రీ పేరుతో దొరికే స్వీట్నర్స్ లో ఉండే ఈ ప్రమాదకర పదార్థం ప్రాణాలకు డేంజర్ కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మధుమేహం బారిన పడినవారు, బరువు తగ్గాలనుకునేవారు చక్కెర వాడకాన్ని తగ్గించడం సర్వసాధారణం. ఈ క్రమంలో, చాలామంది రుచి కోసం కృత్రిమ తీపి పదార్థాలు (స్వీట్నర్స్) వాడుతున్నారు. అయితే, అన్ని స్వీట్నర్లు సురక్షితం కాదని, ముఖ్యంగా 'ఎరిత్రిటాల్' అనే ఒక రకం స్వీట్నర్ ప్రాణానికే ప్రమాదకరమని తాజా అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. దీని వాడకం వల్ల గుండెపోటు, మెదడు స్ట్రోక్ వచ్చే ముప్పు పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. ఏంటీ ఎరిత్రిటాల్? ఎందుకు ప్రమాదం? ఎరిత్రిటాల్ అనేది తక్కువ కేలరీలు ఉండే ఒక స్వీట్నర్. దీన్ని షుగర్-ఫ్రీ డ్రింక్స్, ఐస్ క్రీమ్స్, కీటో డైట్ స్నాక్స్‌లో ఎక్కువగా వాడుతుంటారు. ఇది సాధారణ చక్కెరలాగే తీపిగా ఉన్నప్పటికీ, రక్తంలో చక్కెర స్థాయిలను పెంచదు. అందుకే డయాబెటిస్ ఉన్నవారు, బరువు తగ్గాలనుకునేవారు దీనిని ఎక్కువగా వినియోగిస్తారు. అయితే, ఎరిత్రిటాల్ సురక్షితం కాదని పలు అధ్యయనాలు స్పష్టం చేశాయి. యూనివర్సిటీ ఆఫ్ కొలరాడోకు చెందిన నిపుణులు జరిపిన పరిశోధనలో ఎరిత్రిటాల్ మెదడులోని కణాలను దెబ్బతీస్తుందని, మెదడుకు రక్త సరఫరా చేసే నాళాలపై తీవ్ర ఒత్తిడిని పెంచుతుందని తేలింది. దీన్ని వాడిన మూడు గంటల్లోనే శరీరంలో ఈ మార్పులు కనిపించడం గమనార్హం. సోడా తీసుకున్నప్పుడు ఎలాంటి నష్టం జరుగుతుందో, ఎరిత్రిటాల్ కూడా అంతే స్థాయిలో డ్యామేజ్ చేస్తుందని పరిశోధకులు గుర్తించారు. గుండెపోటు, స్ట్రోక్ ముప్పు: ఎరిత్రిటాల్ వాడకం వల్ల శరీరంలో నైట్రిక్ ఆక్సైడ్ స్థాయిలు తగ్గిపోతాయి. నైట్రిక్ ఆక్సైడ్ రక్తనాళాలు వెడల్పుగా ఉండటానికి, రక్త సరఫరా సజావుగా సాగడానికి తోడ్పడుతుంది. ఇది తగ్గడం వల్ల రక్తనాళాలు కుంచించుకుపోయి, రక్తం గడ్డకట్టే సమస్యలు తలెత్తుతాయి. దీంతో ఫ్రీ రాడికల్స్ స్థాయిలు పెరిగి శరీర కణాలు దెబ్బతింటాయి. క్లీవ్‌ల్యాండ్ క్లినిక్ నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, అమెరికాలో 4 వేల మందిపై జరిపిన పరిశోధనలో ఎరిత్రిటాల్ తీసుకుంటున్నవారిలో గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే ముప్పు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. కేవలం 30 గ్రాముల ఎరిత్రిటాల్ వినియోగం కూడా ప్రమాదకరమేనని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## బెల్లీ ఫ్యాట్ తగ్గించే దాల్చినచెక్క..!



బరువు తగ్గడం, ముఖ్యంగా బెల్లీ ఫ్యాట్‌ను తగ్గించుకోవడం ఎంతోమందికి ఒక సవాలుగా మారింది. వ్యాయామాలు, యోగా వంటివి దైనందిన జీవితంలో భాగం చేసుకుంటున్నా ఆహార నియమాలు పాటించడం అంతే ముఖ్యం. ఫైబర్ అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవడంతో పాటు, బరువు తగ్గేందుకు సహాయపడే కొన్ని ప్రత్యేక పదార్థాలను డైట్‌లో చేర్చుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాంటి అద్భుతమైన పదార్థమే మన వంటింట్లో నిత్యం వాడే దాల్చినచెక్క. ఈ సుగంధ ద్రవ్యం కేవలం రుచికే కాదు, బరువు తగ్గడానికి కూడా అద్భుతంగా పనిచేస్తుంది. దాల్చినచెక్కను సరైన పద్ధతిలో ఎలా ఉపయోగించాలో ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం. దాల్చినచెక్కలో అనేక ఔషధ గుణాలు దాగి ఉన్నాయి. ఇది ఆకలిని నియంత్రించడంలో, రక్తంలో చక్కెర స్థాయిలను అదుపు చేయడంలో, కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో, మెటబాలిజంను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అంతేకాదు, ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ ఆక్సిడెంట్, యాంటీ క్యాన్సర్ గుణాలు పుష్కలంగా ఉన్నాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఇది ఆరోగ్యంగా ఉండటానికి అన్ని విధాలుగా తోడ్పడుతుంది. దాల్చినచెక్క నీళ్లు: ఒక లీటర్ నీటిని బాగా మరిగించి, అందులో రెండు దాల్చినచెక్క ముక్కలు లేదా రెండు టీస్పూన్ల దాల్చినచెక్క పొడి వేయాలి. పది నిమిషాలు మరిగించి, నీటి రంగు మారిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసి వడగట్టాలి. ఈ నీటిని ఒక బాటిల్‌లో పోసుకుని రోజంతా అప్పుడప్పుడూ తాగాలి. ఉదయం పరగడుపున తీసుకుంటే మరింత మంచి ఫలితం ఉంటుంది. అల్లం, దాల్చినచెక్క డ్రింక్: ఒకటిన్నర కప్పుల నీటిని మరిగించి, రెండు దాల్చినచెక్క ముక్కలు, ఒక చిన్న అల్లం ముక్క వేయాలి. నీరు మరుగుతుండగానే పావు టీస్పూన్ గుగ్గుల పొడి (శరీరంలోని అదనపు కొవ్వును కరిగిస్తుంది), పావు టీస్పూన్ గార్సీనియా పొడి (మలబార్ చింతపండు) లేదా మాంగోస్టీన్ పొడి కలపాలి. ఈ పదార్థాలన్నీ కలిపి మరిగించిన తర్వాత, నీటిని వడగట్టి చిటికెడు పసుపు (బరువు తగ్గించే కర్ క్యుమిన్ ఉంటుంది) కలపాలి. ఈ డ్రింక్‌ను నెల రోజుల పాటు ప్రతి రాత్రి పడుకునే ముందు తాగితే బెల్లీ ఫ్యాట్ వేగంగా కరిగిపోతుంది. వంటల్లో దాల్చినచెక్క పొడి: రోజువారీ వంటల్లో, సలాడ్స్, టీలలో దాల్చినచెక్క పొడిని కలుపుకోవడం ద్వారా కూడా బరువు తగ్గవచ్చు. ఇది కేవలం ఆరోగ్య ప్రయోజనాలే కాకుండా, వంటలకు అదనపు రుచి, సువాసనను అందిస్తుంది. పొట్ట చుట్టూ కొవ్వు ఎక్కువగా ఉన్నవారికి గుండె జబ్బులు, మధుమేహం, ఆస్తమా వంటివి వచ్చే ముప్పు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, ఈ పద్ధతులను పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండటంతో పాటు, బెల్లీ ఫ్యాట్‌ను తగ్గించుకోవచ్చు.



## వ్యాధుల్ని నయం చేసే కరక్కాయ..!

కొవ్వు కరిగించేందుకు సహకరిస్తుంది. కరక్కాయ పొడిలో ఉప్పు చేర్చి.. దంతదావనం చేస్తే చిగుళ్లు గట్టిపడి వ్యాధులు రావని పెద్దలు చెపుతుంటారు. కరక్కాయ నమలడం వలన పిప్పిపన్ను పోటు తగ్గుతుందట. భోజనానికి అరగంట ముందు కరక్కాయ చూర్ణానికి కొంచెం బెల్లం కలిపి అరచెంచాడు మోతాదుగా రెండు పూటలా తీసుకుంటుంటే రక్తమొలలు తగ్గిపోతాయని చెపుతుంటారు. కరక్కాయను ఆయుర్వేదంలో విరివిగా ఉపయోగిస్తారు. ఎన్నోఔషధ గుణగణాలు కలిగిన కరక్కాయలో చలవ చేసే గుణం ఉంది. ఇది పైత్యాన్ని హరిస్తుంది. దగ్గుతో బాధపడేవారు చిన్న కరక్కాయ ముక్కను బుగ్గన ఉంచుకుంటే ఉపశమనం కలుగుతుంది. కరక్కాయ దీర్ఘకాలిక దగ్గుకు మంచి పరిష్కారం. చిన్న పిల్లలకు కూడా కరక్కాయ పొడి పాలలో కలిపి తినిపించవచ్చు. దీంతో జలుబు, దగ్గు తగ్గిపోతుంది. కరక్కాయ జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. ఆరోగ్యకరమైన పేగు కదలికలకు కూడా ఇది తోడ్పడుతుంది. త్వరగా ఆహారం జీర్ణం అవుతుంది. అంతేకాదు ఇది రోగనిరోధక శక్తిని పెంచుతుంది. తరచూ కరక్కాయను తీసుకుంటే చర్మ సంబంధిత సమస్యలు తగ్గిస్తుంది. ప్రధానంగా దురదలు, ఎగ్జిమా వ్యాధి కూడా ఇది మంచి రెమిడీ. కరక్కాయతో చర్మ సౌందర్యాన్ని కూడా పెంచుకోవచ్చు. అంతేకాదు కరక్కాయ పొడిని ముఖానికి అప్లై చేస్తే కూడా మొటిమలు మాయం అవుతాయి. ముఖం కాంతివంతంగా మారిపోతుంది. కరక్కాయ ముక్కలను నీళ్లలో నానపెట్టి, ఆ నీటిని తాగితే గుండెకు బలం. వాంతులవుతున్నప్పుడు కరక్కాయ పొడిని మంచినీళ్లలో కలిపి తీసుకుంటే తగ్గుతాయి. కరక్కాయలోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలోని విషాలను బయటకు పంపించేస్తాయి. ఉదయం ఖాళీ కడుపున తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు లభిస్తాయి. కొవ్వు కరిగించేందుకు సహకరిస్తుంది. కరక్కాయ పొడిలో ఉప్పు చేర్చి.. దంతదావనం చేస్తే చిగుళ్లు గట్టిపడి వ్యాధులు రావని పెద్దలు చెపుతుంటారు. కరక్కాయ నమలడం వలన పిప్పిపన్ను పోటు తగ్గుతుందట. భోజనానికి అరగంట ముందు కరక్కాయ చూర్ణానికి కొంచెం బెల్లం కలిపి అరచెంచాడు మోతాదుగా రెండు పూటలా తీసుకుంటుంటే రక్తమొలలు తగ్గిపోతాయని చెపుతుంటారు.



# వ్యాపారం



## అదానీ నయా ప్లాన్..

## ఆ రంగంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడులు



అదానీ గ్రూప్ వచ్చే ఐదు సంవత్సరాలలో రూ.లక్ష కోట్ల పెట్టుబడితో దేశంలోని విమానాశ్రయాలను విస్తరించనుంది. ప్రస్తుతం ఏడు విమానాశ్రయాలను నిర్వహిస్తున్న అదానీ గ్రూప్, నవీ ముంబై విమానాశ్రయాన్ని తమ ఆధీనంలోకి తీసుకోనుంది. నవీ ముంబై, ముంబై, అహ్మదాబాద్, జైపూర్, తిరువనంతపురం, లక్నో మరియు గువాహటి విమానాశ్రయాల అభివృద్ధిపై దృష్టి సారించారు.అపర కుబేరుడు గౌతమ్ అదానీ తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించనున్నారు. ఇప్పటికే అనే రంగాల్లో అదానీ గ్రూప్ తన వ్యాపారాలను నిర్వహిస్తోంది. తాజాగా అదానీ గ్రూప్ తన విమానాశ్రయ వ్యాపారాన్ని మరింతగా విస్తరించనుంది. వచ్చే అయిదేళ్లలో రూ.లక్ష కోట్ల వరకు పెట్టుబడులు ఈ రంగంలో పెట్టనున్నట్లు గౌతమ్ అదానీ కుమారుడు, అదానీ గ్రూప్ విమానాశ్రయ వ్యాపారాధిపతి జీత్ అదానీ వెల్లడించారు. అదానీ గ్రూప్ మనదేశంలో ముంబయి సీఎస్ఎమ్ఐఏ సహా 7 విమానాశ్రయాలను ఇప్పటికే నిర్వహిస్తుండగా, వచ్చే అక్టోబర్ నాటికి నవీ ముంబయి విమానాశ్రయాన్ని తమ ఆధీనంలోకి తీసుకోనుంది. విమానాశ్రయ నిర్వహణలో ఇండియాలో దూసుకెళ్తున్న అదానీ గ్రూప్ ప్రస్తుతానికి ఇతర దేశాల్లో విమానాశ్రయాలకు విస్తరించే ప్రణాళికలు లేవని జీత్ తెలిపారు. 'మనదేశంలోనే వచ్చే 10-15 ఏళ్లలో విమానయానంలో భారీ వృద్ధి అవకాశాలున్నాయని మేం భావిస్తున్నాం. పీపీపీ (ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య) పద్ధతిలో అభివృద్ధి చేయడానికి 26 విమానాశ్రయాలను గుర్తించారు. అందుకే విదేశాల కంటే ఇక్కడే బలంగా విస్తరించాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే 5 ఏళ్లలో విమానాశ్రయ మౌలిక వసతులు, స్థిరాస్తులపై రూ.95,000-96,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు జీత్ తెలిపారు. ఇందులో ఎక్కువ భాగం నవీ ముంబయి విమానాశ్రయం, ముంబయి విమానాశ్రయంపైనే పెట్టనున్నట్లు తెలిపారు. నవీ ముంబయిలో రూ.19,000 కోట్లతో 2 కోట్ల మంది ప్రయాణికుల వార్షిక సామర్థ్యంతో విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నాం. ఇక్కడ నిర్మించబోయే టీ2లోనూ 3 కోట్ల మంది ప్రయాణించేలా రూ.30,000 కోట్లు, లేదా 5 కోట్ల మంది ప్రయాణించేలా రూ.40,000-45,000 కోట్ల పెట్టుబడులు పెడతామన్నారు. అలాగే అహ్మదాబాద్, జయపుర, తిరువనంతపురంలలో కొత్త టెర్మినళ్ల ఏర్పాటు ప్రణాళికలూ ఉన్నాయని, వీటితో పాటు లఖ్‌నవూలో కొత్త టెర్మినల్ విస్తరణ కూడా ఉంటుందని, గువహటిలో కొత్త టెర్మినల్‌ను అక్టోబరు-నవంబరుకల్లా అందుబాటులోకి తీసుకురానున్నట్లు జీత్ వెల్లడించారు.

## బెట్టింగ్ యాప్స్ కేసులో బిగ్ ట్విస్ట్..

## గూగుల్, మెటాకు ఈడీ నోటీసులు!




బెట్టింగ్ యాప్స్ కేసులో దర్యాప్తును ఈడీ అధికారులు స్పీడప్ చేశారు. ఇప్పటికే పలువురు సెలబ్రెటీలకు నోటీసులు జారీ చేసిన ఈడీ.. తాజాగా టెక్ దిగ్గజాలు గూగుల్, మెటాకు సమన్లు పంపారు. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో గూగుల్, మెటాలను విచారించనుంది ఈడీ. ఈ నెల 21న విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేసింది. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్, షేర్‌చాట్, స్నాప్‌చాట్ ఇలా ఏ యాప్ ట్రెండింగ్‌లో ఉంటే.. అందులో బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేశారు సెలబ్రిటీలు. ఈ క్రమంలో విచారణలో భాగంగా గూగుల్, మెటాకు ఈడీ అధికారులు నోటీసులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇందులో భాగంగా బెట్టింగ్ యాప్‌ల కేసులో గూగుల్, మెటా సంస్థలకు ఈడీ సమన్లు జారీ చేసింది. జులై 28న ఆయా కంపెనీల ప్రతినిధులు తమ ముందు విచారణకు హాజరు కావాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ వ్యవహారంలో మొత్తం 29 మంది నటీనటులతో పాటు కంటెంట్ క్రియేటర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై విచారణ జరుగుతోంది. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై పంజాగుట్ట, మియాపూర్, సైబరాబాద్, విశాఖపట్నంలో పోలీసులు నమోదు చేసిన ఫిర్యాదుల ఆధారంగా ఈడీ రంగంలోకి దిగి విచారిస్తోంది. ఈ బెట్టింగ్ యాప్‌లతో మనీలాండరింగ్, హవాలా లావాదేవీలు జరుగుతున్నట్లు ఆరోపణలు రావడంతో ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. తాము విచారణ చేస్తున్నప్పటికీ.. గూగుల్, మెటా సంస్థలు ఇలాంటి యాప్‌లను తమ ప్లాట్‌ఫామ్‌లపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయని దర్యాప్తు సంస్థ ఆరోపిస్తోంది. ఈ టెక్ కంపెనీలు బెట్టింగ్ యాప్‌ల ప్రకటనలకు స్లాట్లు కేటాయించడమే గాక, వెబ్‌సైట్ల లింక్‌లను కూడా అందుబాటులో ఉంచుతున్నాయని ఈడీ పేర్కొంది. కాగా తెలంగాణలో బెట్టింగ్స్ యాప్స్ వల్ల ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకున్నారు. జూదాన్ని విచ్చలవిడిగా ప్రమోట్ చేయడంతో.. ప్రజలు కూడా ఆకర్షితులై.. వాటిలో డబ్బులు పెట్టి నష్టపోయారు. కొందరు లక్షలాది రూపాయలు కోల్పోయారు. దీంతో బెట్టింగ్ యాప్ వ్యవహారంలో ప్రమోటర్స్‌గా ఉన్న సినీ సెలెబ్రిటీలు, యూట్యూబర్స్ పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్.. [illegible] నమోదు చేసింది. ఇది పోలీసులు నమోదు చేసే ఎఫ్ఐఆర్ లాంటిదే. బెట్టింగ్ యాప్ ప్రమోటింగ్ చేసినందుకు కోట్లాది రూపాయలు చేతులు మారాయని ఈడి గుర్తించి ఈసీఐఆర్ నమోదు చేసింది. మనీ లాండరింగ్ కోణంలో ఈడి దర్యాప్తు చెయ్యనుంది. ఇప్పటికే టాలీవుడ్ నటులకు ఈడి నోటీసులు పంపింది. రానా దగ్గుబాటి ఈ నెల 23న , ప్రకాష్ రాజ్ ఈ నెల 30న , మంచు లక్ష్మి ఆగస్ట్ 13న విచారణకు హాజరు కావలి అని ఈడి నోటీసులు అందించింది.. బెట్టింగ్ యాప్ లతో జరిగిన అగ్రిమెంట్లు, బ్యాంక్ ఖాతాల వివరాలు తీసుకొని రావాలి అని ఆదేశించింది. మిగతా నిందితులకు సైతం త్వరలోనే ఈడి నోటీసులు ఇవ్వనుంది.

## ఆగస్టులో భారత్‌కు అమెరికా బృందం

ద్వైపాక్షిక వాణిజ్య చర్చల్లో భాగంగా అమెరికా బృందం ఆగస్టులో భారత్‌కు రానుంది. ఇప్పటికే ఐదు దశల్లో చర్చలు జరగ్గా.. తదుపరి రౌండ్ చర్చల కోసం యూఎస్ అధికారులు రానున్నారని సోమవారం ఓ ఉన్నతాధికారి వెల్లడించారు. గత వారం వాషింగ్టన్‌లో భారత్, అమెరికా బృందాలు ఐదో రౌండ్ చర్చలను ముగించాయి. భారత్ తరఫున వాణిజ్య శాఖ స్పెషల్ సెక్రెటరీ రాజేశ్ అగర్వాల్, అమెరికా తరఫున అసిస్టెంట్ యూఎస్ ట్రేడ్ రిప్రెజెంటేటివ్ బ్రెండన్ లించ్ చర్చల్లో పాల్గొన్నారు. ఆగస్టు 1వ తేది నాటికే ఇరు దేశాలు తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ పలు అంశాలపై ఇరు దేశాలు పట్టుబట్టడంతో ఈ ఒప్పందం ఆలస్యం అవుతోంది. భారత్‌లో తమ జన్యు మార్పిడి (జీఎం) విత్తనాలు, పాడి పరిశ్రమలో పాలు, పాల ఉత్పత్తులను అనుమతించాలని అమెరికా తీవ్రంగా డిమాండ్ చేస్తోంది. మరోవైపు భారత్ వాహన, స్టీల్, అల్యూమినియం ఉత్పత్తులపై సుంకాలను తగ్గించాలని పట్టుబడుతోంది.

## భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు



బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.. గతంలో ఎన్నడూ లేని విధంగా నాన్‌స్టాప్‌గా పరుగులు పెడుతూ.. పసిడి ధరలు ఆల్‌టైం హైకి చేరిన విషయం తెలిసిందే.. ఇటీవల భారీగా పెరిగిన పసిడి ధర.. తగ్గినట్లే తగ్గి మళ్లీ లక్ష మార్క్ దాటింది.. అటు వెండి కూడా ఎన్నడూ లేని విధంగా పరుగులు పెడుతుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.. తాజాగా.. బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి.. స్వచ్ఛమైన పసిడి 10 గ్రాములపై తాజాగా 1100 పెరగగా.. వెండి కిలోపై ఏకంగా రూ. 2వేలు పెరిగింది. వాస్తవానికి బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఒక్కోసారి పెరిగితే.. మరికొన్ని సార్లు తగ్గుతూ వస్తుంటాయి.. అయితే.. ఇటీవలే బంగారం, వెండి ధరలు ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ఆ తర్వాత స్వల్పంగా తగ్గినప్పటికీ.. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో మళ్లీ పెరుగుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. జులై 22 2025 మంగళవారం పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా బంగారం, వెండి రేట్లు ఇలా ఉన్నాయి. 24 క్యారెట్ల బంగారం పది గ్రాములపై రూ.1140 పెరిగి.. రూ.1,01,290గా ఉంది.22 క్యారెట్ల పసిడి పది గ్రాములపై రూ.1050 ధర పెరిగి.. రూ.92,850 లుగా ఉంది. వెండి ధర కిలోపై రూ.2వేలు పెరిగి రూ.1,18,000 లుగా ఉంది. అయితే, ప్రాంతాల వారిగా బంగారం, వెండి ధరల్లో వ్యత్యాసం ఉంటుంది. తెలుగు రాష్ట్రాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే.. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం పదిగ్రాముల ధర రూ.1,01,290 ఉంటే.. 22 క్యారెట్ల ధర రూ.92,850 లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,28,000 గా ఉంది. విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,00,040, 22 క్యారెట్ల ధర రూ.91,700 లుగా ఉంది. వెండి కిలో ధర రూ.1,28,000 లుగా ఉంది. ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,01,440, 22 క్యారెట్ల ధర రూ.93,000 లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,18,000 లుగా ఉంది. ముంబైలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,01,290, 22 క్యారెట్ల ధర రూ.92,850 ఉంది. వెండి ధర కిలో రూ.1,18,000 గా ఉంది. చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.1,01,290 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.92,850 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,28,000 లుగా ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,01,290, 22 క్యారెట్ల ధర రూ.92,850 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,18,000 లుగా ఉంది.

## పారదర్శకతకు సెబీ పాతర

## జెన్ స్ట్రీట్‌పై నిషేధం ఎత్తివేత




దేశీయ స్టాక్ మార్కెట్‌లో అక్రమ పద్ధతుల ద్వారా వేల కోట్ల రూపాయలు కొల్లగొట్టిన అమెరికా హెడ్జ్ ఫండ్ జెన్ స్ట్రీట్‌పై విధించిన నిషేధాన్ని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డు (సెబీ) ఎత్తివేసింది. తాము విధించిన రూ.4,800 కోట్ల జరిమానాను ఆ సంస్థ ఎస్క్రో ఖాతాలో డిపాజిట్ చేసిన నేపథ్యంలో స్టాక్ మార్కెట్‌లోకి మళ్లీ ప్రవేశించేందుకు అనుమతిచ్చినట్టు సెబీ సంబంధిత వర్గాలు వెల్లడించాయి. దీంతో మార్కెట్ రెగ్యులేటర్ సెబీ పారదర్శకతపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైఫ్రీక్వెన్సీ ట్రేడింగ్ ద్వారా నిఫ్టీ, బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్‌ల్లో తప్పుడు పద్ధతుల్లో రూ.43,289 కోట్ల అక్రమ లాభాలు ఆర్జించినట్టు సెబీ గుర్తించింది. ఈ నేపథ్యంలోనే జులై తొలి వారంలో జెన్ స్ట్రీట్‌పై నిషేధం విధించింది. ఈ అక్రమార్జనపై విచారణ పూర్తి కాకుండానే, రిటైల్ ఇన్వెస్టర్లను నిండా ముంచిన ఆ సంస్థపై ఆంక్షలు ఎత్తివేయడం ఆందోళకరం. జులై 13న రూ.4,800 కోట్లు ఎస్క్రో ఖాతాలో జమ చేయడంతో జెన్ స్ట్రీట్‌పై సెబీ నిషేధాన్ని ఎత్తివేశాయని.. అయితే.. ఆప్షన్స్ ట్రేడింగ్‌పై నిషేధం కొనసాగుతోందని సెబీ వర్గాలు పేర్కొన్నాయి. నిషేధం ఎత్తివేసిన విషయాన్ని అటు జెన్ స్ట్రీట్‌తో పాటు స్టాక్ ఎక్స్ఛేంజీలకు, డిపాజిటరీలకు, కస్టోడియన్లకు సెబీ సమాచారం ఇచ్చింది.అక్రమ పద్ధతులకు పాల్పడిన జెన్ స్ట్రీట్ సంస్థపై సెబీ జులై 3న చర్యలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ సంస్థ దాదాపు రూ.44,358 కోట్లు అక్రమంగా ఆర్జించినట్టు సెబీ గుర్తించింది. అదే సమయంలో స్టాక్ ఫ్యూచర్స్‌లో రూ.7,208 కోట్లు, ఇండెక్స్ ఫ్యూచర్స్‌లో రూ.191 కోట్లు, నగదు విభాగంలో రూ.288 కోట్లు పోగొట్టుకుంది. ఈ నష్టాలను మినహాయిస్తే.. నికరంగా రూ.36,671 కోట్లు అక్రమంగా సంపాదించింది. అందులో రూ.4,843 కోట్ల సొమ్మును మాత్రమే జరిమానగా చెల్లించాలని సెబీ ఆదేశించడం గమనార్హం.

## యూకో బ్యాంక్ లాభం రూ.607 కోట్లు

ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంక్.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో రూ.607 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.551 కోట్లతో పోల్చితే లాభం 10.16% పెరిగింది. బలమైన రుణ వృద్ధితో పాటు ఆస్తుల నాణ్యత మెరుగుపడడం ఇందుకు దోహదపడినట్టు బ్యాంక్ తెలిపింది. ఇటు వడ్డీ ఆదాయం, అటు వడ్డీయేతర ఆదాయం కూడా పెరిగాయని బ్యాంక్ ఎండీ, సీఈఓ అశ్విని కుమార్ తెలిపారు. రుణాలపై ఆర్జించిన వడ్డీ ఆదాయమే రూ.6,000 కోట్ల నుంచి రూ.6,400 కోట్లకు పెరిగిందన్నారు. దీనికి తోడు నిర్వహణా వ్యయా లు 4% మాత్రమే పెరగడం లాభదాయకత పెరుగుదలకు దోహదపడిందని తెలిపారు. అయితే రుణాలపై వడ్డీ సవరణ ముందస్తుగానే ప్రకటించిన కారణంగా నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) గతంలో అంచనా వేసిన 3-3.10% నుంచి 2.9-3 శాతానికి తగ్గవచ్చని ఆయన చెప్పారు. జూన్ త్రైమాసికంలో ఎన్ఐఎం 2.96 శాతంగా ఉన్నట్టు తెలిపారు. జూన్ 30 నాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం 13.51% వృద్ధితో రూ.5,23,736 కోట్లకు పెరగగా, రుణాలు 16.48% వృద్ధితో రూ.2,25,101 కోట్లకు, డిపాజిట్లు 11.37% వృద్ధితో రూ.2,98,635 కోట్లకు చేరాయని పేర్కొంది. ఈ కాలంలో స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 3.32% నుంచి 2.63 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 0.78% నుంచి 0.45 శాతానికి తగ్గాయి.

## వినాయకుడి లడ్డు 34 వేల ఆదాయం

**-ఆనందాన్ని వ్యక్తం చేసి,ధన్యవాదాలు తెలిపిన బీసీ కాలనీ శివ శక్తి నగర్ యువత.**



**దేవరకద్ర, అమరచింత మంగళవారం 22 (స్కై న్యూస్)** వనపర్తి జిల్లా అమరచింత పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన శివ శక్తి నగర్ లో గత సంవత్సరంలోని వినాయకుడి చేతిలోని లడ్డు వేలంపాట డబ్బులను యువత అభిప్రాయం మేరకు లడ్డు వేలం డబ్బులను అందిస్తానీ ప్రముఖ సినీ నిర్మాత, ప్రముఖ చేనేత వ్యాపారస్తులు,సామాజిక సేవకులు మహంకాళి శ్రీనివాసులు యువతకు తెలిపారు. మంగళవారం వేలం డబ్బులను 34,000 రూపాయలను అమరచింతలోని బీసీ కాలనీ శివ శక్తి నగర్ యువతకు అందించడం జరిగినది. ఈ సందర్భంగా యువత మాట్లాడుతూ మహంకాళి శ్రీనివాసులు మా యువత పట్ల, అమరచింత పట్టణ ప్రజల పట్ల, నాయకుల పట్ల మంచి అభిప్రాయంతో ఉన్నారు.వారు నిత్యం మన ఊరి అభివృద్ధిని కోరుతూ, మన ఊరి అభివృద్ధి కొరకే మాట్లాడుతూ,ఆలోచిస్తూ ఊరి అభివృద్ధి కొరకై తన వంతు ప్రయత్నం చేస్తున్నారు.వారు ప్రస్తుతము ఏ పార్టీలో లేకుండా ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఉంటూ గతంలోనూ ఇప్పుడు ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాంటి మంచి మనసున్న అన్నగారికి పరమేశ్వరుడి,వినాయకుడి ఆశీస్సులు నిత్యం ఉండాలని, రాబోయే కాలమంతా అన్నకి శుభమే జరగాలని కోరుతూ బీసీ కాలనీలో ఉండే శివ శక్తి నగర్ యువత అంతా కూడా సిని నిర్మాత, ప్రముఖ చేనేత వ్యాపారస్తులు,సామాజిక సేవకులు మహంకాళి శ్రీనివాసులు అన్నకి ధన్యవాదాలు తెలియజేశారు.

## రెట్టించిన ఉత్సాహంతో సప్తాహ భజనలు

**మల్దకల్ జూలై 22:** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో అఖండ జ్యోతిసప్త భజన కార్యక్రమం నాలుగవ రోజు మంగళవారం కొనసాగుతున్నది.వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలు బాగా పండాలని ప్రతి సంవత్సరం ఆషాడంలో చివరన ప్రారంభమై శ్రావణమాసంలో ఈ సప్తహ భజన కార్యక్రమం జరుగుతుంది.శ్రీ గిరీశాచల యోగీశ్వర భజన కళాకారుల సమితి అధ్యక్షుడు ప్రసాద్ చారి,ప్రముఖ హార్మోనిస్టు పచ్చర్ల రాఘవేంద్ర చారి ఆధ్వర్యంలో జరుగుతున్నాయి.మల్దకల్ భజన మండలి,భక్తాదులు,భక్తి పాటలతో భజన జరుగుతుంది.ఈ కార్యక్రమంలో ఆలయ వంశీయులు పట్వారి ప్రహ్లాద రావు,ఈవో సత్య చంద్రారెడ్డి, అరవింద రావు,చంద్రశేఖర రావు,అర్చకులు,ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పచ్చర్ల నీలిపల్లి సదలోనిపల్లి ఉత్తనూరు తుపత్రాల గ్రామాల భజన మండలి సభ్యులు పాల్గొని భజన సంకీర్తనలు ఆలపించారు.

## ప్రాతినిత్యంతో పాటు నామినేటెడ్ సభ్యులుగా నియమించాలి...



**నాగర్ కర్నూల్ జిల్లా 22 (స్కై న్యూస్)** స్థానిక సంస్థల ఎన్నికలలో వికలాంగులకు రాతినిత్యంతో పాటు గ్రామపంచాయతీ మండల పరిషత్ జిల్లా పరిషత్ లలో నామినేటెడ్ సభ్యులుగా నియమించాలని ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాజశేఖర్ డిమాండ్ చేశారు మంగళవారం డిపిఓ కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో చత్తీస్గడ్ రాజస్థాన్ మరియు తమిళనాడు రాష్ట్రాలలో కల్పించిన అవకాశాలను తెలంగాణ రాష్ట్రంలో కూడా అమలు చేయాలని కోరారు. పాలన వ్యవస్థలో వికలాంగులకు ప్రాతనిత్యం కల్పించడం ద్వారా వికలాంగుల అభివృద్ధికి అవసరమైన సంక్షేమ కార్యక్రమాలు తమర్థవంతంగా అమలవుతాయని అన్నారు రాజీవ్ యువ వికాసం ఇందిరమ్మ ఇల్లు వికలాంగుల పెన్షన్ తదితర పథకాల లబ్ధిదారుల ఎంపికలో వికలాంగులకు ప్రాధాన్యత కల్పించాలని కోరారు ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ బీమ్ సాగర్ కొల్లాపూర్ నియోజక వర్గ కన్వీనర్ బాల పిరు బల్మూరు మండల కన్వీనర్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

## రాజకీయాలను వ్యక్తి గతంగా చూడరాదు

**హత్య రాజకీయాలకు షాద్ నగర్ లో స్థానం లేదు**

**కాంగ్రెస్ నాయకుడు చిలకమర్రి రవీందర్ రెడ్డి ని పరామర్శించిన కేశంపేట మాజీ జెడ్పిటిసి దంపతులు.**



**షాద్నగర్ 22(స్కైన్యూస్):**ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు ఉండాలని,ఎన్నికల తర్వాత అందరం కలసి అభివృద్ధి కోసం కృషి చేయాలని,వ్యక్తి గత కారణాలతో దాడులు చేయడం సరైన విధానం కాదని అన్నారు కేశంపేట మాజి జెడ్పిటిసి సభ్యురాలు,రంగారెడ్డి జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యులు శ్రీమతి తాంద్ర విశాల శ్రవణ్ రెడ్డి..ఫరూక్ నగర్ మండలం కాంగ్రెస్ నాయకుడు చిలకమర్రి రవీందర్ రెడ్డి ఇటీవల హత్యాయత్నానికి గురైన కాంగ్రెస్ నాయకుడు చిలకమర్రి రవీందర్ రెడ్డిని ఆయన స్వగృహంలో జెడ్పిటసి దంపతులు పరామర్శించారు.ఈ సందర్భంగా మీడియా ద్వారా మాట్లాడుతూ,,కొంతమంది రాజకీయంగా ఎదుర్కోలేక ఇలాంటి దాడులకు పాల్పడటం మంచి విధానం కాదని తెలిపారు.సమాజంలో ఇలాంటి దాడులు సరికావని పేర్కొన్నారు.నిందితుల కుట్ర వెనుక ఎవరున్నారో పోలీసులు చేదించి వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని,దీని వెనుక ఉన్న కుట్రను విచ్ఛిన్నం చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.చిలకమర్రి రవీందర్ రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.ఇలాంటి దాడులకు సహకరించే వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

## భళా మాస్టర్ అహ్మద్ ఖాన్ భళా

**నేషనల్ స్టార్స్ ఎక్సలెన్స్ అవార్డు సొంతం చేసుకున్న మాస్టర్ అహ్మద్ ఖాన్**



**షాద్నగర్ 22(స్కైన్యూస్):** వైఎంకె అకాడమీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలొ విజయవాడ పట్టణంలోని గుజ్జల సరళ దేవి ఫంక్షన్ హాల్ లో నేషనల్ స్టార్స్ ఎక్సలెన్స్ అవార్డు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ అవార్డు ఫంక్షన్ లో రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం లోని న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ అహ్మద్ ఖాన్ ను వైఎంకె అకాడమీ మాస్టర్ రూపస్ పాల్, సినీ హీరో భానుచందర్ చేతుల మీదుగా శాలువాలతో సన్మానం చేసి సర్టిఫికెట్ మరియు మెడల్ అందజేశారు. ఈ సందర్భంగా మాస్టర్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ కాలనుగుణంగా దేశం లో రోజు రోజుకు ఆడవాళ్ళు, పిల్లలపై అసాంగిక చర్యలు పెరుగుతున్న సందర్భంగా ప్రతి ఒక్కరు తమ ప్రాణ రక్షణ కొరకు కుంగ్ ఫు, కరాటే వంటి విద్యను కచ్చితంగా నేర్చుకోవాలని ఆయన సూచించారు. కుంగ్ ఫు, కరాటే తో సెల్ఫ్ డిఫెన్స్ తో పాటు మెదడు శక్తి ని, శరీరాన్ని ఆరోగ్య కరంగా ఉంటుందని అన్నారు. తనకు ఈ అవార్డు దక్కడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. మాస్టర్ అహ్మద్ ఖాన్ కు అవార్డు దక్కడంతో షాద్ నగర్ నియోజకవర్గం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు...

# స్థానిక ఎన్నికలకు సన్నద్ధమవుతున్న అధికారులు

**పోటీకి సై అంటున్న ఆశావాహులు.**

**అధికార విపక్షాల మధ్య గట్టి పోటీ.**

**ఖరారైన బ్యాలెట్ పత్రాల గుర్తింపు.**

**రేపో మాపో ఎన్నికల నోటిఫికేషన్?**



**నాగర్ కర్నూల్ జులై 22 (స్కై న్యూస్)** రాష్ట్రంలో స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధుల పదవీకాలం ( నాగర్ కర్నూల్ ఎంపీటీసీ ఎంపీపీ పదవీకాలం మినహా) ముగిసిన స్థానిక ఎన్నికలపై ఎన్నికల అధికారులు ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో అనేకమంది స్థానిక ఎన్నికలలో పోటీ చేసేందుకు సిద్ధమైన ఆశావాహులకు నిరాశే మిగిలింది. కోర్టు తీర్పుతో రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ కూడా స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉన్నట్లు సంకేతాలు ఇవ్వడంతో ఎన్నికల అధికారులు కూడా ఎన్నికల నిర్వహణ వైపు దృష్టి సారించడంతోపాటు జిల్లా ఉన్నత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించడంతో జిల్లాలో ఎన్నికల వేడి ప్రారంభమైంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఐదు జిల్లాలలో జిల్లా ఉన్నత అధికారులు ఎన్నికల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి సిబ్బంది అవసరాలు బ్యాలెట్ బాక్స్ ల వినియోగంపై పూర్తిస్థాయి సమాచారాన్ని రాష్ట్ర ఎన్నికల అధికారులకు వివరించారు దీంతో ఆశావాహులలో కూడా నూతన ఉత్తేజం నెలకొంది రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో అటు అధికార పార్టీ ఆశావాహుల సంఖ్య భారీగా ఉంది గత శాసనసభ ఎన్నికలలో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అనేకమంది స్థానిక ప్రజాప్రతినిధులు బిఆర్ఎస్ ను కాంగ్రెస్ లోకి చేరడం వారంతా ఆశావాలుగా మారడంతో అధికార పార్టీ అభ్యర్థుల ఎంపిక కత్తి మీద స్వాముల మారనుంది. విపక్ష బిఆర్ఎస్ నేతలు కూడా ఇటీవల అన్ని నియోజకవర్గాలలో విస్తృతస్థాయి సమావేశాలను ఏర్పాటు చేసి నాయకులకు కార్యకర్తలకు దశా దిశను నిర్దేశించడంతోపాటు రాబోయే ఎన్నికలలో విజయం సాధించే దిశగా కృషి చేయాలని నాయకులకు పిలుపునిచ్చారు. జిల్లాలో నారాయణపేట మహబూబ్ నగర్ వనపర్తి గద్వాల జిల్లాలో బిజెపి కూడా స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు ఆయా జిల్లాల ముఖ్య నేతలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు అయినప్పటికీ కాంగ్రెస్ బిఆర్ఎస్ ల మద్యే పోటీ నెలకొనే అవకాశం చాలా గ్రామాలలో కనిపిస్తుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని నాగర్ కర్నూల్ జిల్లాలో 20 జెడ్పిటిసి 214 ఎంపీటీసీ స్థానాలకు, మహబూబ్ నగర్ జిల్లాలో 16 జెడ్పిటిసి 175 ఎంపీటీసీ స్థానాలకు, జోగులాంబ గద్వాల జిల్లాలో 13 జడ్పిటిసి 142 ఎంపీటీసీ స్థానాలకు, నారాయణపేట జిల్లాలో 13 జడ్పిటిసి స్థానాలకు 136 ఎంపిటిసి స్థానాలకు వనపర్తి జిల్లాలో 15 జడ్పిటిసి స్థానాలకు 133 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం అవుతున్నారు. ఎన్నికల అధికారులు కూడా ప్రతిరోజు ఎన్నికలపై దృష్టి సాధించడంతో రేపో మాపో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని తెలుస్తుంది తాజాగా సోమవారం ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల నిర్వహణలో భాగంగా బ్యాలెట్ పత్రాల గుర్తింపును ఖరారు చేసినట్లు ఎంపీటీసీ ఎన్నికలకు గులాబీ బ్యాలెట్ పత్రాన్ని జడ్పిటిసి ఎన్నికలకు తెలుపు బ్యాలెట్ పత్రాన్ని ఖరారు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లా కలెక్టర్లకు కూడా రాష్ట్ర ఎన్నికల అధికారులు సమాచారాన్ని చేరవేసి బ్యాలెట్ పత్రాల ముద్రింపు పై దృష్టి సారించాలని సూచించినట్లు తెలిసింది.

## త్వరలోనే కె.టి దొడ్డి మండల లో యంగ్ ఇండియా పాఠశాల కు భూమిపూజ

**జోగులాంబ గద్వాల,జులై22(స్కై న్యూస్):** గద్వాల నియోజకవర్గం కె.టి దొడ్డి మండలం కేంద్రంలోని మండల ఇందిరా మహిళ శక్తి మిషన్ - 2025 సంబరాలు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి హాజరయ్యారు.ఎమ్మెల్యే కి మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు , నాయకులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు.అర్హులైన నిరుపేద ప్రజలకు రేషన్ కార్డులు లను ఎమ్మెల్యే గారి చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది.మహిళా సంఘాలకు సంబంధించిన రుణాల చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా మహిళలకు అందించడం జరిగింది.ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతం నుండి ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లేవారు. కానీ నేను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఈ మండలం అభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేయడం జరిగింది ఈ ప్రాంత అభివృద్ధి కోసం నీటి ,సాగునీరు, రైతులకు అందించడం జరుగుతుంది. అదేవిధంగా విద్య వైద్య రంగ అభివృద్ధి కోసం కూడా కృషి చేయడం జరుగుతుంది ఇప్పుడిప్పుడే విద్యారంగం అభివృద్ధి చెందుతుంది. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించాలి చదివించడం వల్ల మంచి బంగారు భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడం జరుగుతుంది. రైతులకు రైతుబంధు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు, 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ 200 యూనిట్లు కరెంటు ఉచితం, ఇందిరమ్మ ఇల్లు, సన్న బియ్యం పంపిణీ ఇలాంటి అనేకమైన వంటి సంక్షేమ పథకాలను ప్రభుత్వం ఒకదాని తర్వాత ఒకటి రూపొందించి నిరుపేదలైన ప్రజలకు అందించడం జరుగుతుంది తెలిపారు.మహిళలు కూడా ఆర్థికంగా ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి జరుగుతుంది. ప్రతి గ్రామాలలో మహిళా సంఘాలు ఏర్పాటు చేసుకోవాలి మహిళలను సంఘాల నుంచి వచ్చిన రుణాలతో మహిళలు చిన్న చిన్న కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవడం జరిగింది ప్రతి ఒక మహిళ మహిళా సంఘం లో సభ్యురాలు ఉండాలి దానివల్ల అనుకోకుండా మహిళ మరణిస్తే వారి కుటుంబానికి 10 లక్షల రూపాయలు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం లభిస్తుంది అదేవిధంగా ఆరోగ్య సమస్యలు వస్తే ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం లభిస్తుంది ఈ వర్తించాలంటే మహిళలు ఖచ్చితంగా సంఘంలో సభ్యురాలు ఉండాలని అన్నారు.అదేవిధంగా మహిళలు కూడా ఆర్థికంగా ఎదగాలి అని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేయడం జరిగింది. పురుషులతో సమానంగా మహిళలు కూడా అంది రంగాల్లో రాణించాలని సీఎం రేవంత్ రెడ్డి గారు మహిళలను కోటీశ్వరులు చేయాలని అహర్నిశలు కృషి చేయడం జరుగుతుంది అందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని రూపొందించి మహిళలకు మహిళా సంఘాల గ్రూపుల ద్వారా బ్యాంకుల ద్వారా రుణాలను అందించడం జరుగుతుంది. వాటి ద్వారా మహిళలు చిన్న చిన్న కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా ఎదగాలి అదేవిధంగా ఆర్టీసీ బస్సులను కూడా మహిళలకు అందించడం జరిగింది అదే విధంగా సోలార్ ప్రాజెక్టులో కూడా ఏర్పాటు చేయడం జరిగింది క్యాంటీన్లు, కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలి ఇలా చిన్న సంస్థల నుండి పెద్ద సంస్థలు ఏర్పాటు చేసి ఆర్థికంగా ఎదిగినప్పుడే వారు కూడా కోటీశ్వరులుగా ఎదగడానికి అవకాశం ఉంటుంది అని తెలిపారు.తెలంగాణ రాష్ట్రంలో నిరుపేదలైన ప్రజల కోసం ప్రజలకు ఇల్లు ఉండాలని సొంతింటి కల నెరవేరాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవలే ఇందిరమ్మ ఇళ్లలో ప్రొసీడింగ్ పత్రాలను మంజూరు చేయడం జరిగింది. లబ్ధి పొందిన ప్రతి ఒక్కరు తొందరగా ఇంటి నిర్మాణం చేసుకోవాలి కోరారు. రాని వాళ్ళు అధైర్య పడకండి అవసరం లేదు ప్రతి ఒక్కరికి వచ్చే విధంగా ప్రభుత్వం కృషి చేయడం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో నిరుపేదలైన ప్రజలకు రేషన్ కార్డు పంపిణీ చేయడం జరుగుతుంది కె.టి దొడ్డి మండలానికి రేషన్ కార్డు మంజూరు కావడం జరిగింది. రేషన్ కార్డు ద్వారా ప్రతి ఒక్క కుటుంబానికి ప్రభుత్వం నుండి వచ్చే సన్నబియ్యం, నిత్యవసర సరుకులు లభించడం జరుగుతుంది. కాబట్టి ప్రతి ఒక్కరు రేషన్ కార్డును ఉపయోగించుకొని ప్రభుత్వం నుండి సంక్షేమ పథకాలు లబ్ధి



పొందాలని కోరారు. రేషన్ కార్డులు రాని వాళ్లకు కూడా త్వరగా ప్రతి ఒక్కరు నమోదు చేసుకోవాలి అని కోరారు.మీ అందరి ఆశీస్సులతో నేను రెండోసారి ఎమ్మెల్యేగా గెలవడం జరిగింది కాబట్టి మీ అందరికీ అభివృద్ధి కోసం గద్వాల నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసమే ప్రభుత్వంతో భాగస్వాము ను కావడం జరిగింది అభివృద్ధి కోసం ప్రభుత్వానికి మద్దతు తెలపడం జరిగింది తెలిపారు.భవిష్యత్తులో కే.టి దొడ్డి మండల మరింత అభివృద్ధి కొరకు నా వంతు కృషి చేయడం జరుగుతుంది అదేవిధంగా గద్వాల నియోజకవర్గ అభివృద్ధి కొరకు నా చివరి శ్వాస వరకు కృషి చేయడం జరుగుతుంది తెలిపారు.భవిష్యత్తులో మహిళలు అన్ని రంగాలలో రాణించాలి పురుషులతో సమానంగా ఆర్థికంగా ఎదగాలని కోరారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కురవ హనుమంతు, మాజీ జడ్పీ చైర్మన్ బండారి జిల్లా సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్ మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణ నాయుడు, సింగిల్ విండో డైరెక్టర్ రఘు కుమార్ శెట్టి, నాయకులు ఉరుకుందు, చంద్రశేఖర్, వెంకన్న గౌడ్, యుగంధర్ గౌడ్ శేఖర్ రెడ్డి, రాజేష్ , ఆంజనేయులు, తిక్కన్న, రంగారెడ్డి, భీమ రాయుడు, సత్యనారాయణ, భగవంతు వెంకటేష్ గౌడ్, టిచర్ గోవిందు గోపి, ఖాజా, మల్లేష్ గౌడ్, వెంకటేష్ తిమ్మప్ప, కాసిం, వీరేష్, వివిధ గ్రామాల నాయకులు, మాజీ సర్పంచులు ఎంపీటీసీలు, మహిళా సంఘం అధ్యక్షురాలు,నాయకులు కార్యకర్తలు యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పథకాల అమలులో కలెక్టర్లే కీ లోకం



**జోగులాంబ గద్వాల ,జిల్లా 22 (స్కై న్యూస్):**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పలు అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో జిల్లా కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని, ఆయా సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు చేరే విధంగా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు శ్రీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీ పొన్నం ప్రభాకర్, శ్రీమతి కొండా సురేఖ, శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ రామకృష్ణారావు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూభారతి, వివిధ రెసిడెన్షియల్ స్కూళ్లలో భోజన, మౌలిక వసతుల ఏర్పాటు, వనమహోత్సవంలో మొక్కలు నాటడం తదితర అంశాలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ మాట్లాడుతూ, సాంఘిక, బిసి, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు పెంచిన డైట్ చార్జీలకు అనుగుణంగా నాణ్యమైన ఆహారాన్ని అందించడంతో పాటు హాస్టళ్ల నిర్వాహణపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. హాస్టళ్ల ప్రాంగణాల్లో పచ్చదనం పరిశుభ్రతల్లో భాగంగా పారిశుద్ధ్య పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ లక్ష్యాల మేరకు అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయదానికి అధికారులతో ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. ఇళ్ల నిర్మాణంలో ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇసుక రవాణాలో లబ్ధిదారుడినికి ఇబ్బంది కలగకుండా పూర్తి చర్యలు చేపడుతున్నామన్నారు.భూభారతిలో నమోదైన దరఖాస్తులను నిబంధనల మేరకు వెంటనే పరిష్కరించడం జరుగుతుందన్నారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో విరివిగా మొక్కలు నాటేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగిందని కలెక్టర్ తెలియజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ దీప్తి కలెక్టర్ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## దొంగతనం కేసును చేధించిన పోలీసులు..



**గద్వాల ,జూలై 22(స్కై న్యూస్):** జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో అయిజ మండల కేంద్రంలోని జయలక్ష్మి ఏజెన్సీ నందు ఈనెల 11 న 18 లక్షల విలువ గల సిగరెట్లు దొంగతనం అయ్యిందని అయిజ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా అట్టి కేసును పోలీసులు చేదించారు.కేసుకు సంబంధించి జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సిగరెట్ల దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి వారి నుండి 15 లక్షల విలువ గల సిగరెట్లను, రెండు మొబైల్ ఫోన్లను, ఒక మారుతి ఏకో వ్యానును స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.సిగరెట్ల దొంగతనం కేసులో ముగ్గురు దొంగతనానికి పాల్పడగా ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు, ఒకరు పరారిలో ఉన్నట్టు తెలిపారు.కేసును త్వరితగతిన చేధించిన పోలీసులను జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు అభినందించారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది

కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు

బ్యాంకు లింకేజ్ ద్వారా 157 స్వయం సహాయక సంఘాలకు 18 కోట్ల 27 లక్షలు

వడ్డీ లేని రుణాలు 2100 స్వయం సహాయ సంఘాలకు రెండు కోట్ల 36 లక్షలు.

లోన్ బీమా ఈ పథకం ద్వారా 7 కి 5,90, 448 రూపాయలు.

ప్రమాద భీమ పథకం క్రింద -01 కి 10,00,000 రూపాయలు







**కొత్తగూడెం జూలై 22 (స్కై న్యూస్ ):**మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం కొత్తగూడెం క్లబ్ నందు ఇందిరా మహిళా శక్తి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుకు మహిళలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్సును వారు తయారు చేసిన ఆహార పదార్థాలను ఆయన పరిశీలించి మహిళలను అభినందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన ముందుగా జ్యోతి ప్రజ్వలం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన కొత్తగూడెం నియోజకవర్గం పరిధిలోని మహిళా సంఘాల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, ప్రభుత్వం మహిళల అభివృద్ధికి అందిస్తున్న ప్రోత్సాహకాల గురించిన ప్రగతి నివేదికలను సభకు వివరించారు. అనంతరం కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. దీనిలో భాగంగా మహిళలకు వడ్డీ లేని రుణాలు, మహిళల సంఘాల ద్వారా ఆర్టీసీ బస్సుల నిర్వహణ, మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం వంటి పలు మహిళా అభ్యున్నతి కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. గత పది సంవత్సరాల్లో ఎన్నడూ లేని విధంగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కార్యక్రమం ప్రభుత్వం చేపట్టిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డులు పంపిణీ జరగలేదని, ప్రస్తుతం కొత్త రేషన్ కార్డులతో పాటు రేషన్ కార్డుల సవరణలు చేరికలు కూడా చేపట్టారన్నారు. ఈనెల 25 నుంచి 10 వ తారీకు వరకు ప్రతి మండల కేంద్రంలో రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తుగా నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను సద్వినియోగపరచుకోవాలని, తమ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవడంతో పాటు కుటుంబాలు అభివృద్ధి, సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. మహిళల శక్తిని గుర్తించి, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, మహిళల అభ్యున్నతికి ప్రభుత్వం ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేపట్టాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని చుంచుపల్లి, లక్ష్మీదేవి పల్లి, సుజాతనగర్ పాల్వంచ మండలాల్లో మొత్తం 2984 మహిళా సంఘాల లో 29,801 సంఘ సభ్యులు ఉండగా బ్యాంకు లింకేజ్ ద్వారా 157 స్వయం సహాయక సంఘాలకు 18 కోట్ల 27 లక్షలు.వడ్డీ లేని రుణాలు 2100 స్వయం సహాయ సంఘాలకు రెండు కోట్ల 36 లక్షలు.లోన్ బీమా ఈ పథకం ద్వారా 7 కి 5,90, 448 రూపాయలు.ప్రమాద భీమ పథకం క్రింద -01 కి 10,00,000 రూపాయలు.మహాలక్ష్మి పథకం ద్వారా పాల్వంచ మండలంలో ఒక బస్సుకు 69,468 రూపాయల చెక్కులను శాసనసభ్యుని చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్ డి ఓ మధు, డీఎస్ఓ రుక్మిణి, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, తాసిల్దార్ లు కొత్తగూడెం పాల్వంచ సుజాతనగర్ చుంచుపల్లి లక్ష్మీదేవిపల్లి, మహిళా సంఘాలు సభ్యులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ సంబంధాల వల్లే అధికంగా హత్యలు...

మిస్టరీని ఛేదించిన పోలీసులు.



**నాగర్ కర్నూల్ జులై 22( స్కై న్యూస్)** అక్రమ సంబంధాల వల్ల నేడు సమాజంలో 90 శాతం హత్యలు చోటు చేసుకుంటున్నారని ప్రతి ఒక్కరు కుటుంబ ప్రతిష్ట ను దృష్టిలో ఉంచుకొని అక్రమ సంబంధాలకు దూరంగా ఉండాలని డి.ఎస్.పి శ్రీనివాస్ కోరారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇటీవల జరిగిన హత్య కేసు హిస్టరీని ఛేదించిన వివరాలను వివరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్ గ్రామానికి చెందిన నిర్మల తన భర్త ఈనెల 11 నుండి కనిపించడం లేదని 13న పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగిందని వెంటనే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు కొనసాగించడం జరిగిందని తెలిపారు. అదే రోజు సాయంత్రం సింగోటం చెరువులో తన భర్త దామోదర్ గౌడ్ మృతదేహం ఉన్నట్లు బంధువుల ద్వారా తెలిసిందని వెంటనే కొల్లాపూర్ నియోజక పలువురు ఎస్సైలు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీసి పరిశీలించగా తలపై బలమైన గాయాలు ఉన్నట్లు గుర్తించడంతో పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించి దహన సంస్కారాలకు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడం జరిగిందని తెలిపారు. అనంతరం పోలీసుల విచారణలో భార్య నిర్మల అదే గ్రామానికి చెందిన వెంకటమ్మతో తన భర్తకు అక్రమ సంబంధం ఉన్నట్లు అనేక పర్యాయాలు గ్రామంలో వివాదాలు చోటుచేసుకున్నాయని వివరించడంతో విచారణ జరిపి నిందితులు మంగళవారం పెద్దకొత్తపల్లి లో వేసినట్లు తెలుసుకొని అదే గ్రామానికి చెందిన భూసి గారి బిచ్చయ్య అతని కుమారుడు కురుమయ్య భార్య వెంకటమ్మ మరో వ్యక్తి వెంకటస్వామి లను లను అదుపులోకి తీసుకొని విచారించగా దామోదర్ గౌడ్ ను చంపి సొంత ట్రాక్టర్ ద్వారా సింగోటం చెరువుకు తరలించి అక్కడ కాలువలో వేయడం జరిగిందని అంగీకరించడంతో వారిని అదుపులోకి తీసుకొని రిమాండ్కు తరలించడంతోపాటు ట్రాక్టర్ను సీజ్ చేయడం జరిగిందని వివరించారు.

# నారాయణపేట పీఏసీఎస్ గోదాంను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**నారాయణపేట జూలై 22 (స్కై న్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రంలోని పీఏసీఎస్ ( సింగిల్ విండో) గోదాం ను మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాం లో ఉన్న యూరియా బస్తాల నిల్వను పరిశీలించారు. ఇంతవరకు పీఏసీఎస్ ద్వారా ఎన్ని మెట్రిక్ టన్నుల యూరియా విక్రయించారని ఆమె ప్రశ్నించగా, 54 వేల మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు వారి వారి పాస్ బుక్, ఎకరాలను బట్టి ఆధార్ కార్డు ద్వారా ఈ పాస్ మిషన్ ఆన్ లైన్ పద్ధతి ప్రకారం విక్రయించినట్లు కార్యాలయ అధికారి పళ్ళ అశోక్ కలెక్టర్ కు తెలిపారు. జిల్లా కేంద్రంలో పీ ఏ సీ ఎస్ కేంద్రం తో పాటు రెండు ప్రైవేటు ఆగ్రో కేంద్రాల్లోనూ యూరియా విక్రయాలు జరుగుతున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ కలెక్టర్ కు తెలిపారు. మొత్తం జిల్లాలోని దామరగిద్ద, కోస్గి, మద్దూరు, గుండుమల్, ధన్వాడ, మరికల్, తీలేరు, నర్వ, ఉట్కూర్, మక్తల్, మాగనూర్, కృష్ణ మండలాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు యూరియా విక్రయ కేంద్రాల వివరాలను జాన్ సుధాకర్ వివరించారు. ఆయా కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 8 వేల మెట్రిక్ టన్నుల యూరియా ను రైతులకు విక్రయించినట్లు ఆయన వెల్లడించారు. అయితే మక్తల్ నియోజకవర్గంలోనే 2 వేల మెట్రిక్ టన్నుల యూరియా ను రైతులు కొనుగోలు చేశారని, అక్కడ వరి పంట సాగు ఎక్కువగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇంకా ఆయా కేంద్రాలలో యూరియా అందుబాటులో ఉందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... అవసరమైనంత యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందవద్దని ఆమె సూచించారు. అయితే ఇతర వ్యాపారాలకు యూరియా వినియోగిస్తున్నట్లు ఆరోపణలున్నాయని, యూరియా పక్క దారి పట్టకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని,అలాగే సరిహద్దు ప్రాంతాల్లో పోలీసుల సహకారంతో వ్యవసాయ అధికారులతో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని ఆమె జాన్ సుధాకర్ ను ఆదేశించారు.

# చదివిన బడి రుణం తీర్చుకుందాం రండి..!

పూర్వ విద్యార్థులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపు..

ఆరు నెలల్లో పాఠశాల రూపురేఖలు మారుస్తానని హామీ..

చరిత్ర కలిగిన పాఠశాలగా జానంపేట బడికి కితాబు..

పాఠశాలను పూర్తిగా పరిశీలించిన ఎమ్మెల్యే..

ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికిన పాఠశాల బృందం..

**షాద్నగర్ 22(స్కైన్యూస్):**ఈ పాఠశాలలో చదివి నాయకులుగా, ఇతర రంగాలలో ప్రముఖులుగా ఎదిగిన పూర్వ విద్యార్థులు శిథిలావస్థలో ఉన్న పాఠశాలకు సాయం చేయాలని.. చదివిన పాఠశాల రుణం తీర్చుకునేందుకు ముందుకు రావాలని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ కేంద్రంలోని ఫరూక్ నగర్ ప్రభుత్వ జెడ్ పి హెచ్ ఎస్ (ఫరూక్ నగర్ హైస్కూల్) పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎన్.సీ.సీ యూనిఫాంలో ఆయనకు ఘనస్వాగతం పలికారు. అదేవిధంగా ఎంఈఓ మనోహర్, ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు శాలువాలతో, బొకేలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం పనులను ప్రారంభించారు. అనంతరం శిథిలావస్థలో ఉన్న పాఠశాలను పూర్తిస్థాయిలో ఆయన పరిశీలించారు. ఒక ఎన్జీవో సంఘం సహకారంతో సుమారు 40 లక్షల రూపాయల దీంతో కొన్ని పనులు చేపట్టడానికి ముందుకు వచ్చారని ఇంకా పూర్వ విద్యార్థులు తలుచుకుంటే మనతో మేలు జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. పాఠశాలను ఆరు నెలల్లో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ఆయన హామీ ఇచ్చారు. విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలని ఉపాధ్యాయులను కోరారు. విద్యార్థులు చక్కగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**ఖద్దరు వేసుకునేది కలెక్షన్ల కోసం కాదు: ఎమ్మెల్యే**

రాజకీయాల్లో ఉన్న ప్రతి నాయకుడికి ఒక బాధ్యత ఉంటుంది. ఖద్దరు బట్టలు వేసుకునేది ఖరీదైన కార్లలో షికార్లు చేయడానికో, కలెక్షన్లు చేయడానికి కాదు.. ప్రజల మధ్యన ఉండాలి.. ప్రజా జీవితాన్ని అర్థం చేసుకొని వారి కోసం నిరంతరం పనిచేయాలి.. అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఉద్వేగ భరితంగా అన్నారు. పాఠశాలలో సమస్యలను చూసి చలించిన ఆయన ఎన్జీవోలు అందించిన సహకారం, తన సొంత నిధుల ద్వారా పాఠశాలకు సేవలు అందిస్తున్నానని, పూర్వ విద్యార్థులు ముందుకు వస్తే మరింత విస్తృతమైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. ఎవరు రాకపోయినా ఈ పాఠశాల అభివృద్ధి బాధ్యత తనదేనని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రామీణ పాఠశాలల్లో చదివి అంత ఎత్తుకు ఎదిగాడని, ప్రభుత్వ పాఠశాలల వల్ల నాణ్యమైన విద్య వస్తుందని అది సమాజానికి ఎంతో ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. ఒక వ్యక్తి చదువు తన కుటుంబానికి మాత్రమే కాదు.. దేశానికి కూడా ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. పాఠశాలలను పటిష్టంగా నిర్మించడం, అక్కడ మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయడం, మంచి ఉపాధ్యాయులను నియమించడం ప్రభుత్వాల బాధ్యత అని అన్నారు. గడిచిన పదేళ్లలో గత ప్రభుత్వం విద్యార్థుల కోసం ఏం చేసిందో ఒక్కసారి ప్రశ్నించుకోవాలని అన్నారు. ఫరూక్ నగర్ హైస్కూల్ లో అదనపు తరగతి గదులు నిర్మిస్తామని కూలగొట్టిన గత పాలకులు స్థానిక నాయకుడు ఒకరు మళ్లీ ఈ పాఠశాల బాగోగులు పట్టించుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ వచ్చాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధిక ప్రాధాన్యత విద్యగా ఇస్తున్నారన్నారు. ఫరూక్ నగర్ పాఠశాల ఎంతో చరిత్ర కలిగిన పాఠశాల అని, ఎంతోమంది మేధావులను ప్రపంచానికి అందించిందని అలాంటి పాఠశాల దుస్థితిలో ఉండటం బాధాకరమని అన్నారు. ఈ పాఠశాలను అన్ని విధాలుగా రూపురేఖలు మార్చి ఉపాధ్యాయులకు కానుకగా ఇస్తానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు..

# ఘనంగా దాశరథి జయంతి



**జడ్చర్ల, జూలై 22(స్కై న్యూస్)** తెలంగాణాను కోటి రతనాల వీణగా అభివర్ణించిన ప్రముఖ కవి దాశరథి కృష్ణమాచార్యుల జయంతిని ఘనంగా నిర్వహించారు. మంగళవారం నాడు దాశరథి జయంతి సందర్భంగా జడ్చర్లలో వుమెన్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మూడవ వార్డు కౌన్సిలర్ సతీష్ ముదిరాజ్ మాట్లాడుతూ ప్రజల్లో దాశరథి నింపిన విప్లవ స్ఫూర్తి తరతరాలుగా కవులను ముందుకు నడుపుతున్నదని అన్నారు. ఈ సందర్భంగా కవి,పండితుడు చక్రవర్తుల రమణాచార్యులు మాట్లాడుతూ దాశరథి కృష్ణమాచార్యుల రచనలను వివరించారు. అక్షరాలల్లో అగ్నిని కురిపించి, నియంత నిజాం గుండెల్లో నిదురించిన తెలంగాణ తేజం,తెలంగాణ నిగళాలను త్రెంచుటకు అక్షరాన్ని ఆయుధంగా మలుచుకున్న కవి దిగ్గజం,నిజామును తెలంగాణకు పట్టిన బూజుగా పేర్కొన్న ధిక్కారస్వరం,పిశాచిలా పట్టిపీడిస్తున్న నిజాము పీచమడచడానికి ఫిరంగిలా అక్షరాలను పేల్చిన కవి భాస్వరం,నా తెలంగాణ కోటి రతనాల వీణ అంటూ నినదించిన చైతన్య స్వరం దాశరథి కృష్ణమాచార్యులు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సతీష్ ముదిరాజ్, నర్సింగరావు, సురేందర్ గౌడ్, బాలమణి,నాగేశ్వరి, ఆనందీబాయి, హారిక, భారతమ్మ, అనిత తదితరులు పాల్గొన్నారు.

# కేరళ మాజీ ముఖ్యమంత్రి వియస్ అచ్యుతానందన్ ఆశయాలను కొనసాగిద్దాం

సంస్మరణ సభ లో సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి ఎన్. రాజు పిలుపు



**షాద్నగర్ 22(స్కైన్యూస్ )**కేరళ మాజీ ముఖ్యమంత్రి వి యస్ అచ్యుతానందన్ ఆశయాలను కొనసాగిద్దామని సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి %చీ%. రాజు పిలుపు నిచ్చారు. ఈరోజు సిపిఎం పార్టీ కార్యాలయంలో పార్టీ డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీను నాయక్ అధ్యక్షతన జరిగిన సంస్మరణ %చీ%. రాజు సభలో మాట్లాడుతూ అనారోగ్యంతో కామ్రేడ్ వి.ఎస్. అచ్యుతానందన్ నిన్న మరణించారు. కమ్యూనిస్ట్ ఉద్యమంలో అత్యుత్తమ నాయకుడు మరియు అనుభవజ్ఞుడైన వి.ఎస్. అచ్యుతానందన్ మరణం పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. వి.ఎస్. అచ్యుతానందన్ పొలిట్ బ్యూరో మాజీ సభ్యుడు. ఆయన వయస్సు 101 సంవత్సరాలు. అచ్యుతానందన్ కేరళలో వివిధ పోరాటాలకు నాయకత్వం వహించిన సమర్థుడైన నాయకుడు,1940లో, ఆయనకు కేవలం పదిహేడేళ్ల వయసులో, వి.ఎస్. కమ్యూనిస్ట్ పార్టీలో చేరారు. కుట్టనాడ్లో భూస్వాములచే దారుణమైన దోపిడీకి గురైన వ్యవసాయ కార్మికుల మధ్య పని చేయడానికి కృష్ణ పిళ్లై అతనికి అప్పగించారు. ట్రావెన్కోర్ దివాన్కు వ్యతిరేకంగా జరిగిన పున్నప్రా వాయలార్ తిరుగుబాటు సమయంలో, విఎస్ అజ్ఞాతంలోకి వెళ్లాల్సి వచ్చింది. అరెస్టు అయిన తర్వాత, అతను తీవ్రమైన కస్టోడియల్ హింసకు గురయ్యాడు.విఎస్ ఏడు పర్యాయాలు కేరళ అసెంబ్లీకి ఎన్నికయ్యారు, ఆయన రెండు పర్యాయాలు ప్రతిపక్ష నాయకుడిగా పనిచేశారు మరియు 2006 నుండి 2011 వరకు ముఖ్యమంత్రిగా ఉన్నారు. ముఖ్యమంత్రిగా ఆయన పదవీకాలంలో శ్రామిక ప్రజల సంక్షేమం కోసం అనేక శాసన మరియు పరిపాలనా చర్యలు తీసుకున్నారు. పార్టీతో తన ఎనిమిదిన్నర దశాబ్దాల అనుబంధంలో, కేరళలో కమ్యూనిస్ట్ ఉద్యమం స్థిరమైన వృద్ధిని సాధించింది. ప్రజా వక్తగా విఎస్ ప్రేక్షకులతో నేరుగా సంభాషించే కళలో ప్రావీణ్యం సంపాదించారు. కఠినమైన జీవనశైలి మరియు సామాజిక న్యాయం పట్ల అచంచలమైన నిబద్ధతకు పేరుగాంచిన వి.ఎస్. అచ్యుతానందన్ కేరళ రాజకీయాలపై చెరగని ముద్ర వేశారు. ఆయన భార్య, కుమారుడు మరియు కుమార్తెకు హృదయపూర్వక సంతాపాన్ని తెలియజేస్తోంది ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు శ్రీను నాయక్ బేరి శ్రీనివాస్ నాయకులు మహమ్మద్ బాబు. కావలి రాజు వడ్ల చంద్రమౌళి . వెంకటరమణ ఆంజనేయులు గౌడ్ బలరాం గౌడ్. నరసింహులు గౌడ్. శ్రీకాంత్. ఆది. శివ శంకర్.సుమేర్ . ఆరిఫ్.అయాన్.. మహేష్. తదితరులు పాల్గొన్నారు..

# నేటి విద్యాసంస్థల బందును విజయవంతం చేయాలి....



**నాగర్ కర్నూల్ జులై 22( స్కై న్యూస్)** రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు మరియు కళాశాలలో నెలకొని ఉన్న విద్యారంగా సమస్యలను బహిష్కరించాలని బుధవారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న విద్యారంగ సంస్థల బందును విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మధు గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు బందుకు సహకరించి విజయవంతం చేసేందుకు దోహదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు

# బి ఆర్ ఎస్ పార్టీకి గుడ్ బై, కాంగ్రెస్ ఎమ్మెల్యే జిఎంఆర్ సంపక్షంలో పార్టీలో చేరిక



**చిన్న చింతకుంట జులై 22 (స్కై న్యూస్):** చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీకి నాయకులు శ్రీనివాస్ రావు, సునీల్ శెట్టి, జెట్టెం నవీన్, అశోక్, సింగోటం, బాల కొండ మరియు 21 మంది బిఆర్ఎస్ యువ నాయకులు, కార్యకర్తలు, పలువురు బీజేపీ కార్యకర్తలు మంగళవారం ఎమ్మెల్యే జి, మధుసూదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి.అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే జిఎంఆర్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరామని పేర్కొన్నారు.

## వరంగల్ లో 24 ఫ్లోర్లతో

# మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి

**వరంగల్, జూలై 22:**వరంగల్‌లో సామాన్యులకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం 24 అంతస్తుల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తోంది. వరంగల్ సెంట్రల్ జైలు స్థలంలో రూ.1,150 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ఆస్పత్రి 2026 డిసెంబర్ నాటికి అందుబాటులోకి రానుంది. ఇందులో 2 వేల పడకలు ఉంటాయి. బోన్ మ్యారో నుంచి ప్లాస్టిక్ సర్జరీ వరకు అన్ని సేవలు ఉచితంగా లభించనున్నాయి. ఒకప్పుడు గవర్నమెంట్ హాస్పిటల్ అంటే.. నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు అన్నట్లుండేవి పరిస్థితులు. అయతే ప్రభుత్వాల చొరవ వల్ల ఈ పరిస్థితి మారుతోంది. నేడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయి. కొన్ని చోట్ల అధికారులు, వైద్యుల కృషి వల్ల ప్రైవేటు ఆస్పత్రిలో కన్నా మంచి సేవలు, సదుపాయాలు కలిగి ఉంటున్నాయి. ఈ క్రమంలో సామాన్యులకు మెరుగైన వైద్య సేవలు అందించడం కోసం ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సామాన్యుల కోసం ఏకంగా 24 అంతస్తుల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకురాబోతుంది. తెలంగాణ ప్రభుత్వం సామాన్యులకు మెరుగైన వైద్యం అందించడం కోసం.. 24 అంతస్తుల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తోన్న సంగతి తెలిసిందే. వరంగల్ సెంట్రల్ జైలు స్థలంలో నిర్మిస్తున్న ఈ మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిని వచ్చే సంవత్సరం అనగా 2026, డిసెంబర్ నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. వచ్చే డిసెంబరు నెలాఖరులోపు ఈ ఆస్పత్రిలో వైద్య సేవలు ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో కొన్ని రోజుల క్రితం వరంగల్ కలెక్టర్ ఎంజీఎం ఆసుపత్రిలోని వివిధ వైద్య విభాగాధిపతులతో సమావేశం నిర్వహించారు. అనేక అంశాలపై చర్చించారుకొత్తగా నిర్మిస్తున్న మల్టీస్పెషాలిటీ ఆస్పత్రిలోని 24 అంతస్తులను.. వైద్య విభాగాల వారీగా కేటాయించారు. వేర్వేరు అంతస్తుల్లో.. వేర్వేరు వైద్య విభాగాలకు అవసరమైన ఏర్పాట్లు చేయడానికి ఏమేం కావాలో నివేదిక తయారు చేసి.. జులై నెలాఖరులోగా అందించాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు.

**అంతస్తుల వారిగా కేటాయింపులు ఇలా..**

ముందుగా గ్రౌండ్ ఫ్లోర్ కింద బేస్‌మెంట్ ప్రాంతంలో మెడికల్ ఆంకాలజీ అనగా క్యాన్సర్ విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఆ తర్వాత గ్రౌండ్ ఫ్లోర్‌లో అత్యవసర విభాగం, వృద్ధుల ఓపీ సేవలు, ఐసీయూ, ఫార్మసీ, సీటీ స్కాన్, న్యూబర్న్, లేబర్, మెడికల్ ఐసీయూ, ఆర్ఐసీయూ, ట్రామా ఐసీయూ, ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్, మామోగ్రఫీ, జనరల్ సర్జరీ, కలర్ డాప్లార్,ఆర్థోపెడిక్ విభాగాలు రానున్నాయి. 1వ అంతస్తులో: ఈఎన్‌టీ, రుమటాలజీ, ఓపీ సేవలు, డెర్మటాలజీ, న్యూరోసర్జరీ, జనరల్ మెడిసిన్, ఎండోస్కోపి, జనరల్ సర్జరీ, ఎక్స్‌రే, డీఎస్ఏ, డెమో రూంలకు కేటాయించారు. 2వ అంతస్తులో: పిల్లల ఈఎస్ఆర్ అత్యవసర విభాగం, ఐసీయూ వార్డులు, నియోనాటల్ కేర్ యూనిట్‌కు కేటాయించారు. 3వ: ఐవీఎఫ్(సంతాన సాఫల్య కేంద్రం) వార్డు, ఆర్ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు (సుమారు 10 వరకు). 4వ: ఈఎన్‌టీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, ట్రాన్స్‌ప్లాంట్ ఐసీయూ, ఆపరేషన్ థియేటర్లు 5వ: డెంటల్ వార్డులు, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్(బీఎంటీ) యూనిట్, జనరల్ సర్జికల్ డెమో, జనరల్ మెడిసిన్‌కు కేటాయించారు. 6వ: ఆర్థోపెడిక్, ఎమర్జెన్సీ వార్డు 7వ: ఎలక్ట్రికల్, ప్లంబింగ్ సేవలు 8వ: ఒబెసిటీ, గైనాకలజీ, ఈఎన్‌టీ, పీడియాట్రిక్ వార్డు, 9వ: మెడికల్ ఆంకాలజీ, శ్వాసకోశ వ్యాధులు, సర్జికల్ వార్డు 10వ: ప్లాస్టిక్ సర్జరీ, డెర్మటాలజీ 11వ: ఎండోక్రైనాలజీ, వృద్ధులు, రోగనిరోధక వ్యవస్థను కోల్పోయిన వారికి, మానసిక, డ్రగ్స్ అలవాటు బారినపడిన వారి చికిత్స వార్డులు. 12వ: సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, మానసిక రోగులు, మెడికల్ వార్డు ఏర్పాటు చేయనున్నారు. 13, 14వ అంతస్తుల్లో: సెమీ, వీఐపీ ప్రైవేటు గదులు 15వ: బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేయనున్నారు. మిగిలిన 9 అంతస్తుల్లో ఆయా వైద్య విభాగాల ఫ్యాకల్టీకి కేటాయించేలా ప్రణాళిలకు రూపొందించారు. ఈ నెలాఖరు వరకు.. ఎంజీఎంలోని అన్ని వైద్య విభాగాల ప్రొఫెసర్లుఅందించే నివేదిక ఆధారంగా మార్పులుచేర్పులు చేయిస్తామని ఈ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నోడల్ అధికారి తెలిపారు. ఈ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే.. బోన్ మ్యారో నుంచి ప్లాస్టిక్ సర్జరీ వరకు అన్ని సేవలు ఒకే చోట.. అది కూడా ఉచితంగా ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. అంతా ఓకే, అడ్రస్సే తేడా కొట్టింది.. ప్రియుడితో కలిసి అడ్డంగా దొరికేసిన మహిళ..వరంగల్ సెంట్రల్ జైలు స్థలంలో రూ.1,150 కోట్ల వ్యయంతో నిర్మాణం మొదలుపెట్టిన ఈ ఆస్పత్రి నిర్మాణం దాదాపు పూర్తియింది. దీనిలో 2 వేల పడకలు అందుబాటులోకి రానున్నాయి. 2021 జూన్ 21న అప్పటి సీఎం కేసీఆర్ ఈ భవనానికి శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. వచ్చే ఏడాది డిసెంబర్ చివరి నాటికి ఇది ప్రజలకు వైద్య సేవలు అందించనుంది.

## మరిన్ని ప్రజాహిత కార్యక్రమాల ను చేపడతాం

**కమాన్ పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు సానా రామకృష్ణా రెడ్డి**



**కమాన్ పూర్:**సామాజిక సేవయే పరమావధిగా ఏర్పాటైనదే కమాన్ పూర్ లయన్స్ క్లబ్ అని ఆ.. ఆశయం.. ఆకాంక్షల సాధనలో ముందుకు సాగుతుందని లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్ పూర్ అధ్యక్షులు సానా రామకృష్ణా రెడ్డి అన్నారు. కమాన్ పూర్ మండలంలోని రొంపికుంట గ్రామ పంచాయతీకి 100, నాగారం గ్రామ పంచాయతీకి 50, సిద్దిపల్లె గ్రామ పంచాయతీకి 50 చొప్పున ఎల్. ఈ. డి వీధి లైట్లను ఈ వీధి దీపాలకు లయన్, కాంట్రాక్టర్ గుమ్మడి అంజయ్య ఆర్థిక సహకారంతో ఆయా గ్రామ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలోని కమాన్ పూర్, జూలపల్లి, గుండారం, పెంచికల్ పేట్ గ్రామాలకు ఇప్పటికే వీధి లైట్లు పంపిణి చేశామన్నారు. అలాగే ఈ రోజు మరో మూడు గ్రామ పంచాయతీలకు అందజేశామని, ఇక మిగిలిన మరో రెండు గ్రామ పంచాయతీలకు కూడా వీధి లైట్లను అందించడం జరుగుతుందన్నారు. తాము అందించిన వీధి లైట్లను ఆయా గ్రామాల్లో వీధి లైట్లు వెలగని చోట గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి సద్వినియోగం చేయాలని కోరారు. అలాగే ఆగస్టు 4 వ తేదిన రొంపికుంట గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ కమాన్ పూర్ ఆధ్వర్యంలో "ఉచిత కంటి వైద్య శిభిరం " ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ అవకాశన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు సానా రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శంకర్ సదాశయ పౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, లయన్స్ క్లబ్ లయన్స్ క్లబ్ సభ్యులు అనవేన లక్ష్మిరాజం, బండ సాయి శంకర్, మాటేటి కుమార్, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, కార్యదర్శులు తిరుపతి, రామ్మోహన్, అమల, కారోబార్లు రమేష్, అగ్గిమల్ల సతీష్లతో పాటు తదితరులు పాల్గొన్నారు

## మొక్కలు నాటుదాం...

# పర్యావరణ రక్షిద్దాం..


**ఎంఈఓ విజయ్ కుమార్**



**కమాన్ పూర్:**మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించామని కమాన్ పూర్ విద్యాధికారి ఇల్లందుల విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం కమాన్పూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో డెల్టా క్యూబ్స్ సి ఈ ఓ సంతోష్ గుప్తా ఆదేశాల మేరకు దీపం గ్లోబల్ ఫౌండర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో వివిధ రకాల మొక్కలను నాటారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ నేడు అడవులు అంతరించిపోతున్నాయని అలాగే గ్రామాల్లో చెట్లు లేక కాలుష్యం పెరిగిపోతుందని అన్నారు. అలాగే అడవుల్లో పండ్లు ఫలాలు లేక గ్రామాల్లోకి కోతుల బెడద తీవ్రమైందని అన్నారు. ప్రతి ఒక్కరు తమ వంతుగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గసిగంటి రమేష్, రాజేశ్వరరావు, రేణుక, రజిత కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# ఈ ఆగస్టు 5 ఏం చేస్తారో...

**న్యూఢిల్లీ, జూలై 21:**మోదీ 3.0 ప్రభుత్వం 2025 సంవత్సరానికి సంబంధించిన వర్షాకాల పార్లమెంటు సమావేశాలు జులై 21 నుంచి ఆగస్టు 21, 2025 వరకు జరగనున్నాయి. ఈ సమావేశాలు గతంలో ఎన్నడూ లేని విధంగా 21 రోజులపాటు కొనసాగనున్నాయి. ఈ సమావేశాలు రాజకీయ, భద్రతా, చట్టసభా దృష్ట్యా అత్యంత కీలకమైనవిగా పరిగణించబడుతున్నాయి. ఈ నేపథ్యంలో రెండు ప్రధాన పరిణామాలు దేశ రాజకీయ వాతావరణంలో ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి:.. ఒకటి ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఢిల్లీ సందర్శన, రెండోది ఆగస్టు 5న పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న కీలక బిల్లు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హఠాత్తుగా ఢిల్లీకి వచ్చి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షాలతో సుదీర్ఘ చర్చలు జరిపారు. ఈ సమావేశాలు, ముఖ్యంగా అమిత్ షాతో గంటసేపు, మోదీతో రెండుసార్లు జరిగిన చర్చలు, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ సందర్శన రాష్ట్రంలోని రాజకీయాల గురించా.. లేక భద్రతా అంశాలా.. లేక సమావేశాల్లో చర్చించబడే కీలక బిల్లులకు సంబంధించిన సన్నాహాలై ఉండవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్ వద్ద నిర్వహించిన మాక్ డ్రిల్, భద్రతా ఆందోళనలను మరింత తీవ్రతరం చేసింది. ఈ డ్రిల్ దాడులు లేదా ముట్టడి వంటి అత్యవసర పరిస్థితులను



ఎదుర్కొనేందుకు సన్నద్ధతను పరీక్షించే లక్ష్యంతో నిర్వహించబడింది. ఆగస్టు 5 ఎన్డీఏ ప్రభుత్వానికి చారిత్రక ప్రాముఖ్యత కలిగిన తేదీ. 2019లో ఆర్టికల్ 370 రద్దు, 2020లో రామమందిర భూమిపూజ వంటి కీలక సంఘటనలు ఈ రోజున జరిగాయి. ఈ సంవత్సరం ఆగస్టు 5న మరో కీలక బిల్లు ప్రవేశపెట్టే అవకాశం ఉందని ఊహాగానాలు సాగుతున్నాయి. 'ఒకే దేశం %-% ఒకే ఎన్నిక' లేదా ఇండియన్ సిటిజన్‌షిప్ యాక్ట్ వంటి బిల్లులు ప్రవేశపెట్టబడవచ్చని అంచనాలు ఉన్నాయి. మోదీ ప్రభుత్వం తన నిర్ణయాలను రహస్యంగా ఉంచి, ఊహించని విధంగా ప్రకటించడంలో పరిచయస్తుడు కావడం ఈ ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. ఇదిలా ఉంటే ప్రతిపక్షాలు సమావేశాలను స్తంభింపజేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రక్షాళన, ఆపరేషన్ సిందూర్‌లో యుద్ధ విమానాల నష్టం, ఆపరేషన్ ఆపివేత కారణాలు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యుద్ధ నిలిపివేత సూచనలపై స్పష్టత కోరుతూ ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ విషయాలపై వాడివేడి చర్చలు జరిగే అవకాశం ఉంది. ఇది సమావేశాల సాఫీగా సాగే అవకాశాలను సవాలు చేస్తుంది. ప్రభుత్వం ఈ సమావేశాల్లో 15 బిల్లులను ప్రవేశపెట్టనున్నట్లు తెలుస్తోంది. వీటిలో 8 కొత్త బిల్లులు, 7 పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఉన్నాయి. ఇన్‌కమ్ ట్యాక్స్%-%2025 బిల్లు వంటి కొన్ని బిల్లులపై ఇప్పటికే చర్చ జరుగుతోంది. అయితే, ఆగస్టు 5న ప్రవేశపెట్టబడే బిల్లు దేశ రాజకీయాలను మర్చేదిగా ఉంటుందన్న ఊహాగానాలు సాగుతున్నాయిఈ సమావేశాలు కేవలం చట్టసభా కార్యకలాపాలకు మాత్రమే పరిమితం కాకుండా, దేశ రాజకీయ, భద్రతా వాతావరణంపై గణనీయమైన ప్రభావం చూపనున్నాయి. యోగి ఆదిత్యనాథ్ ఢిల్లీ పర్యటన, పార్లమెంట్ వద్ద మాక్ డ్రిల్ వంటి సంఘటనలు భద్రతా ఆందోళనలను సూచిస్తున్నాయి. అదే సమయంలో, ప్రతిపక్షాల ఆందోళనలు, కేంద్రం యొక్క రహస్య నిర్ణయాలు ఈ సమావేశాలను ఉత్కంఠభరితంగా మార్చాయి.

## ప్రైవేట్ కు దీటుగా

# పెద్దపల్లి ప్రభుత్వ దవాఖాన




**పెద్దపల్లి:**మన ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, వీటిని అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే చింత కుంట విజయరామణారావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి శస్త్ర చికిత్స చేయించుకున్న వారికి మొదటిసారిగా ప్రభుత్వం తరుపున ఉచితంగా కళ్ళద్దాలను ఆసుపత్రి సూపరిండెంట్ శ్రీధర్ సిబ్బందితో కలిసి శాసనసభ్యులుచింతకుంట విజయరమణ రావు పంపిణీ చేశారు. అనంతరం ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందిస్తునందుకు సూపరిండెంట్ శ్రీధర్ తోపాటు వైద్యులను ఎమ్మెల్యే విజయరమణ రావు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రైవేటు ఆసుపత్రులకు ధీటుగా పనిచేస్తుందని అన్నారు. మన పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అధునాతనమైన వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు అందిస్తూ పేద కుటుంబాలకు సహాయసహకారాలు అందిస్తున్నామని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రులకు తగ్గకుండా ప్రభుత్వ ఆసుపత్రి అన్ని విధాలుగా సేవలను అందిస్తూ పేదవారికి వైద్య ఖర్చులు లేకుండా చేస్తున్నామని గుర్తుచేశారు. మన ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్ సర్కార్ అధికారంలోకి వచ్చాక పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో గణనీయమైన మార్పులు చేశామని అన్నారు. పెద్దపల్లి జిల్లా ప్రజలు, నియోజవర్గ ప్రజలందరూ ప్రభుత్వ వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి శస్త్ర చికిత్స, డయాలసిస్, చర్మ వైద్యం, ముక్కు నోరు, గొంతు, చిన్న పిల్లల వైద్యం అలాగే నవజాతి శిశువుల కోసం మెరుగైన వైద్య సేవలు, మాత శిశు ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలకు మెరుగైన వైద్యం, గర్భిణీ స్త్రీలకు అధిక ఖర్చుతో కూడిన టిఫ్ఫా స్కానింగ్ ను సైతం ఉచితంగా చేయడం లాంటి మరెన్నో వైద్య సేవలు ప్రభుత్వం తరుపున ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ శ్రీధర్, ఆర్.ఏం.ఓ, ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, మాజీ కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు పై

# మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపాటు

**హైదరాబాద్:**మంత్రి పొన్నం ప్రభాకర్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావుపై మండిపడ్డారు. తెలంగాణ బిజెపి అధ్యక్షుడు మరోసారి తన అసలు నిజ స్వరూపాన్ని బయటపెట్టాడు . బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ 9 వ షెడ్యూల్ లో చేర్చడం అసాధ్యం అంటున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధ్యమే. గతంలో పక్క రాష్ట్రం తమిళనాడు లో జరిగింది. తెలంగాణ నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న బిజెపి ఎంపీలు రాజీనామా చేయాలి ..ఎందుకు రిజర్వేషన్లు అమలు కావో చూస్తాం..లేదా దీనిని సాధించిపెట్టింది. సుప్రీంకోర్టు లో ఇందిరా సహనీ కేసులో స్పష్టంగా చెప్పారని అన్నారు.రాష్ట్రాల దగ్గర ప్రామాణికమైన సమాచారం ఉంటే ఎంపెరికల్ డేటా ఉంటే ఆ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవచ్చని చెప్పారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం సర్వే చేసి కేబినెట్ ఆమోదం శాసన సభ ఆమోదం , గవర్నర్ ఆమోదంతో ఢిల్లీలో ఉంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సిన అంశం. తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లకు కట్టుబడి ఉంది బరబర్ రిజర్వేషన్లు అధికారికంగా అమలు చేస్తాం. అనాడు మండల్ కమిషన్ తీసుకొస్తే కమండల్ అన్నది మీరే. మళ్ళీ మీ యొక్క వక్ర బుద్ధిని బీసీ ల పట్ల కుట్రను బయటపెట్టారు. తెలంగాణ లోని అన్ని బీసీ వర్గాలు, కుల సంఘాలు బీజేపీ నిజస్వరూపాన్ని గమనించి రినర్వేషన్లు ప్రక్రియను కాపాడుకునే దానిలో ముందుండాలని కోరుతున్న. బీజేపీ కేంద్ర ప్రభుత్వం బీసీ లకు 42 శాతం రిజర్వేషన్లు తప్పకుండా 9 వ షెడ్యూల్ లో చేర్చాల్సిందే . గతంలో జనహిత అభియాన్ కేసులో ఈడబ్ల్యుఎస్ సందర్భంగా స్పష్టంగా చెప్పింది. ప్రామాణిక నివేదిక ప్రకారం సమాచారం సుప్రీంకోర్టు లో ఉంది. మభ్యపెడుతుంది మీరు.. ముఖ్యమంత్రి బీసీ అన్నది మీరు సిఎల్పీ నాయకుడు బీసీ ఇవ్వంది మీరు పార్టీ అధ్యక్షు పదవి కూడా బీసీ లకు ఇవ్వని మీరు.. మండల వ్యతిరేకించిన మీరు బీసీ లకు వ్యతిరేకంగా ఫ్యూడల్ పార్టీ లో ఉన్నారని అన్నారు.సామాజిక న్యాయంతో కాంగ్రెస్ తోనే



సాధ్యం..సామాజిక న్యాయానికి ఛాంపియన్ కాంగ్రెస్ పార్టీ. మా ముఖ్యమంత్రి రెడ్డి అయితే ఎస్సీ ఉప ముఖ్యమంత్రి మా పీసీసీ అధ్యక్షుడు బీసీ ఉన్నారు. మా వర్గాలకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోం అని హెచ్చరిస్తున్నానని అన్నారు.

## వాహనాలకు

# నిప్పంటించిన తాగుబోతు

**కుత్బుల్లాపూర్:**జీడిమెట్ల పియస్ పరిధిలోని మార్కండేయ నగర్ లో ఓ తాగుబోతు వీరంగం సృష్టించారు. మద్యం మత్తులో అంజన్ గౌడ్(42) అర్ధరాత్రి పార్క్ చేసిన వాహనాలపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. రెండు కార్లు, ఓ ఆటో, మూడు బైక్ లు దగ్ధం అయ్యాయి. బాధితుల పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## కాంగ్రెస్ ప్రజాపాలనలో

# జోడేడ్ల లా పరుగులు పెడుతున్న అభి వృద్ధి, సంక్షేమం

**పిసిసి అధికార ప్రతి నిధి పల్లె రాంచందర్ గౌడ్**

**హైదరాబాద్ జూలై 22:**బీసీఎం రేవంత్ రెడ్డీ నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన అంది స్తుందని టిపిసిసి అధికార ప్రతి నిధి పల్లె రాంచందర్ గౌడ్ తెలిపారు మంగళవారం గాంధీ భవన్ లో మీడియాతో మాట్లాడుతూ సన్న బియ్యం తో దేశంలోనే రికార్డ్ సాధించా మని ఆయన పేర్కొన్నారు,రేషన్ కార్డు ల ద్వారా రాష్ట్రం లోని 93లక్షల కుటుంబాలకు సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు. పేదలు, ఆర్తి కంగా వెనుక బడిన మధ్య తరగతి వర్గాల అభి వృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు పల్లె వివరించారు. 18నెలల ప్రభుత్వ కాలంలో ఓ వైపు అభి వృద్ధి, మరో వైపు సంక్షేమం జోడేడ్ల లా పరుగులు పెడుతుందని అన్నారు. రైతులు పేదల, కంటే తమకు ఏది ముఖ్యం కాదని చెప్పారు.రైతు బందు పతకం ద్వారా పెట్టుబడి సాయం కింద కేవలం 9రోజుల్లో 9వేల కోట్లు రైతుల ఖాతాలో జమచేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు రాష్ట్రంలో రహదారుల అభి వృద్ధికి విద్యా వైద్యం కోసం పాటు పడుతున్నామని రాంచందర్ గౌడ్ వివరించారు. బీసీ రిజర్వేషన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం కుల గణ న నిర్వహించి న విషయాలు అనేకం ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందుతున్నాయని చెప్పారు త్వరలో జరిగే స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ దే విజయమనే దీమాను పల్లె రాంచందర్ గౌడ్ వ్యక్తం చేశారు.

వార్తాతరంగాలు
బుధవారం 23 జులై 2025

# పెండింగ్ ఫీజురీయంబర్స్ మెంట్స్, స్కాలర్ షిప్స్ విడుదల చేయాలి

**రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో విద్యార్థులతో భారీ ర్యాలీ**

**ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన..**

**షాద్నగర్ 22(స్కైన్యూస్):** భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ డివిజన్ కమిటి ఆధ్వర్యంలో పెండింగ్లో ఉన్న 8158 కోట్లు స్కాలర్ షిప్స్ ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదల చేయాలని షాద్ నగర్ ముఖ్య కడలిలో ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేయటం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ ఎఫ్ ఐ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు వడ్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో గత ఆరేళ్ల నుండి పెండింగ్ లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్స్,స్కాలర్ షిప్స్ విడుదల చేయకుండా కాలయాపన చేస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి ప్రభుత్వాలు అన్నారు. విద్యార్థులకు బకాయిలు విడుదల చేయకపోవడంతో తమ పై చదువుల కోసం సర్టిఫికేట్స్ కోసం కళాశాల యాజమాన్యాల దగ్గరికి వెళితే ఫీజులు కడితే తప్ప సర్టిఫికెట్స్ ఇవ్వలేము అంటున్న పరిస్థితి ఉన్నది. ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచిన విద్యార్థులకు ఇవ్వాల్సిన 8158 కోట్ల రూపాయల స్కాలర్ షిప్స్ ఫీజు రీయింబర్స్ మెంట్ ఇప్పటికీ ఎలాంటి ప్రకటన చేయకపోవడం సిగ్గుచెట్టు అన్నారు. ఒక పక్క కళాశాల యాజమాన్యాలు ప్రభుత్వం విడుదల చేయకపోతే క్లాసులు నడపాకుండా తరగతుల బహిష్కరిస్తున్న దుస్థితి నెలకొన్నది. దీని ద్వారా విద్యార్థులు తమ క్లాసులు నష్టపోతున్నారు. ఇంత జరుగుతున్న విద్యా వ్యవస్థ పట్ల రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకుండా పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు అన్నారు. ఒక పక్క తల్లి దండ్రులు ఫీజులు కట్టలేక ప్రభుత్వం స్కాలర్ షిప్స్ విడుదల చేయక విద్యార్థులు తమ చదువులను మధ్యలోనే ఆపివేస్తు పార్ట్ టైమ్ జాబులు చేసుకుంటున్నారు అని తెలిపారు. జిల్లాలో విద్యార్థులకు దాదాపు 750 కోట్ల రూపాయలు పెండింగ్ ఉన్నాయి. రేవంత్ రెడ్డి గారు విద్యా రంగానికి పెద్ద పీట వేస్తా అన్నారు కానీ ఆచరణలో మాత్రం శూన్యం అన్నారు.నేటికి విద్యా రంగానికి విద్యాశాఖ మంత్రి లేకుండా ప్రభుత్వాన్ని నడుపుతున్న తీరు చూస్తే విద్యా వ్యవస్య పట్ల తమ చిత్త శుద్ధి ఉన్నదో అర్థం అవుతుంది అన్నారు. మాటలే తప్ప చేతల్లో చేసిందేమీ లేదన్నారు. ప్రభుత్వ ఎప్పటికైనా స్పందించి వెంటనే విడుదల చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున జిల్లా వ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పోరాటాలకు పూనుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ షాద్ నగర్ టౌన్ అధ్యక్షాకార్యదర్శులు సుమయిర్, శివ శంకర్ టౌన్ ఉపాధ్యక్షులు అదిల్ మరియు ఎస్ఎఫ్ఐ నాయకులు యూసుఫ్, మజర్, ఆరీఫ్, హర్ష, రెహమాన్, అబ్బు, సుభాన్, ఆరీఫ్, అయాన్, మహేష్, శమి, ఫాయ్యూమ్, వందల మంది విద్యార్థులు పాల్గొన్నారు..

# సోదరుడి చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలి



**నాగర్ కర్నూల్ జులై 22( స్కై న్యూస్)** తన సోదరుడు కుర్మయ్య మృతికి కారణమైన భర్త నాగమ్మ వారి బంధువులు నాగరాజు కృష్ణమ్మ వేణమ్మ లపై చర్యలు తీసుకోవాలని మృతుడి సోదరీమణులు జ్యోతి సైదమ్మ శాంతమ్మలు పోలీసులకు అందించిన వినతి పత్రంలో కోరారు. నాగమ్మ అక్రమ సంబంధం కలిగి ఉండటం వల్లే భర్తను చంపడం జరిగిందని మద్యం తాపించిన తర్వాత స్పృహ కోల్పోయాక హత్య చేసి మృతి చెందినట్లు మంగళవారం ఆస్పత్రికి తరలించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిసింది

# ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**వివేక్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వాహకులు సందడి రవీందర్ రెడ్డి.**




**నాగర్ కర్నూల్:** జిల్లా కేంద్రంలోని స0త బజారు లో గల వివేక్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో ఆస్పత్రిలో బుధవారం ప్రఖ్యాత కిడ్నీ మరియు మూత్రపిండాల వైద్యులు డాక్టర్ ఎం అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు దానిని సద్వినియోగం చేసుకోవాలని ఆసుపత్రి నిర్వహకులు సందడి రవీందర్ రెడ్డి కోరారు. ప్రముఖ వైద్యులు ఆసుపత్రిలో ప్రతినెల 2 మరియు 4వ బుధవారం రోజు అందుబాటులో ఉంటారని నేడు ఉదయం 11 గంటల నుండి రెండు గంటల వరకు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని మెరుగైన ఆరోగ్యాన్ని పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఆస్పత్రిలో కిడ్నీ మూత్రపిండాలలో రాళ్లు మూత్రంలో మంట ఇన్ఫెక్షన్లు కిడ్నీ వాపు గ్యాస్ ట్రబుల్ సమస్యలు ఎండోస్కోపింగ్స్ స్టోన్ సర్జరీ తో పాటు ప్రోస్టేట్ సమస్యలు పురుషుల లైంగిక సమస్యలకు మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు సద్వినియోగం చేసుకోనే రోగులు కింది నెంబర్ లను సంప్రదించాలని చేయాలని ఆయన కోరారు 8019412660 మరియు 9059310903 కోరారు

# ఐటిఐ 4 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం 40 వేలు ఇస్తానని బి.ఆర్.ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి హామీ



చిన్నచింతకుంట మండల కేంద్రానికి చెందిన ఎం ఆర్ రామరాజు కుమారుడు ఎం ఆర్ రామకృష్ణ ఐ ఐ టి చదువుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందిగా ఉంది అని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి గారిని అడిగిన వెంటనే 4 సంవత్సరాలుగా ప్రతి సంవత్సరం 40,000 రూపాయలు చొప్పున ఇస్తున్నారు.ఈ అబ్బాయికి ఈ చివరి 4 వ సంవత్సరం దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి విద్యార్థికి అందజేసే 40000/- చెక్కు ను చిన్నచింతకుంట బిఆర్ఎస్ మండల నాయకులు,గ్రామ నాయకులు విద్యార్థికి అందజేశారు.

# బిజెపి కార్యశాల...

**జోగులాంబ గద్వాల, జులై 22 (స్కై న్యూస్):** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని డికె. బంగ్లా లో గద్వాల మండల అధ్యక్షుడు టి. శ్రీనివాసులు ఆధ్వర్యంలో గద్వాల మండల కార్యశాల ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గద్వాల పోటీ చేసిన అభ్యర్థి బలిగేర శివారెడ్డి గారు హాజరయ్యారు..

**ఈ సందర్భంగా బలిజర శివారెడ్డి మాట్లాడుతూ**

ఈరోజు గ్రామాలలో ప్రతి బడ్జెట్ నేరుగా గ్రామపంచాయతీలకు కేంద్ర ప్రభుత్వ నిధులే అందులో భాగంగా కరోనా నుంచి ఉచిత బియ్యం నిరంతరంగా పంపిణీ చేస్తున్నది , రైతు వేదికలు ,పల్లె ప్రకృతివనం,వైకుంఠదామలు, టాయిలెట్స్, ఎరువుసబ్సిడీ, విశ్వకర్మ,ముద్రలోన్స్, సిసి రోడ్లు వీధి బలుపులు అంగన్వాడీ సెంటర్లలో చిన్నారులకు గర్భిణీలకు పౌష్టికాహారం కేంద్ర ప్రభుత్వమే అదేవిధంగా ఈరోజు దేశ రక్షణలో కూడా మన దేశం చాలా సురక్షితంగా ఉన్నది మొన్న జరిగిన పహల్గాం దాడిలో కూడా చర్యకు ప్రతి చర్య పాకిస్తాన్లో వారి ప్రాంతాలలో నడిబొడ్డున బాంబులు పేల్చి వాళ్ళ స్థావరాలను మట్టి పెట్టిన ఘనత మన ప్రియతమ నేత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జీ కి దక్కుతుందని తెలిపారు... అదే విధంగా



ఆర్థికంగా దినదినాభివృద్ధి జరుగుతూ అభివృద్ధి చెందిన దేశాలకు దీటుగా 4 వ స్థానం నుండి ఈరోజు నాలుగోస్థానానికి ఆర్థికంగా చాలా స్ట్రాంగ్ గా రోజు రోజుకి అభివృద్ధి చెందుతున్నది మన భారతదేశం అది కేవలం ఈరోజు దేశాన్ని పాలిస్తున్న భారతీయ జనతా పార్టీకే ఈ అవకాశం దక్కుతున్నది .తెలంగాణ రాష్ట్రంలో గత ప్రభుత్వం పదేళ్లు పాలించి అదిగో ఇదిగో అని ఏదో మాయ మాటలు చెప్పి తన పది సంవత్సరాల కాలాన్ని పూర్తి చేసుకున్నది తప్ప రాష్ట్ర ప్రజలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందించలేదు ఈరోజు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీలు 160 అబద్ధాలు చెప్పి గద్దెనెక్కిన ప్రభుత్వం ఏ ఒక్కటి కూడా ప్రజలకు నెరవేర్చలేదు అదేవిదంగా బిఆరెస్ పార్టీ ముఖ్యనాయకులు లిక్కర్, కాళేశ్వరం, తేలిపోన్ ట్యాంపరింగ్, మరియు చాలా కుంభం కోణాలు, కుటుంబ గొడవలు తోరాష్టాన్ని నాశనం చేశారు కాబట్టి ఇప్పుడు కేవలం బీజేపీ పార్టీ మాత్రమే దేశం, రాష్ట్ర మరియు స్థానిక గ్రామాలలో ప్రతి ఆర్థిక సంక్షేమ పథకం కేంద్రప్రభుత్వానిదే కాబట్టి రాష్ట్ర ప్రజలందరూ కూడా రేపు రాబోయే స్థానిక ఎంపిటిసి జడ్పిటిసి సర్పంచు వార్డ్ మెంబర్లను మీరు మన భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను గెలిపించి మన గ్రామాలను చాలా సుభిక్షంగా దినదినాభివృద్ధి పరంగా మన గ్రామాలను అభివృద్ధి వైపు నడిపించుకుందామని సమావేశం సందర్భంగా ప్రజలకు తెలియజెయడం జరిగినది..ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు రాష్ట్ర కౌన్సిల్ మెంబెర్ అక్కల రమ దేవి , ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దాస్ నరేష్ గౌడ్ అశోక్ రెడ్డి వెంకటమ్మ పర్వతం రెడ్డి సీనయ్య మధుసూదన్ రెడ్డి బాబు కే శీను మహేష్ రాజు రామకృష్ణ మల్లికార్జున బద్రి రఘు నాగరాజు భాస్కర్ రెడ్డి ఓంకార్ గోవర్ధన్ నర్సింలు రాము శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు..

# రైతులను ఇబ్బందిపెడితే కఠిన చర్యలు తప్పవు

**దరఖాస్తుల తిరస్కారానికి సరైన కారణాలు చూపాలి**

**ఆగస్టు 15 నాటికి వీలైనన్ని భూ సమస్యలు పరిష్కరించాలి**

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పేదవాడికి ఏసమస్యా రాకూడదు**

**లబ్ధిదారులకు దగ్గరలోని ఉచిత ఇసుక ఇవ్వాలి**

**జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**కొత్తగూడెం జూలై 22 (స్కై న్యూస్ ):**తెలంగాణ ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రూపుదిద్దుకున్న భూభారతి చట్టం, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పకడ్బందీగా అమలు చేయాల్సిన బాద్యత జిల్లా కలెక్టర్లదేనని రాష్ట్ర రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం నాడు డాక్టర్ బి. ఆర్. అంబేద్కర్ సచివాలయంలో చీఫ్ సెక్రటరీ కార్యాలయం నుంచి మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చీఫ్ సెక్రటరీ కె. రామకృష్ణారావుతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన అద్భుతమైన భూ భారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసినప్పుడే దాని ఫలితాలు సామాన్యులకు అందుతాయని అన్నారు. మూడు దఫాలుగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడానికి సామాన్యులను ముఖ్యంగా రైతులను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవని సస్పెండ్ చేయడానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు.క్షేత్రస్థాయిలో కొంతమంది అధికారులు రైతులను ఇబ్బంది పెడుతున్నారనే సమాచారం ఉందని ఇది పునరావృతం కాకుండా చూడాలని కలెక్టర్లకు సూచించారు.రెవెన్యూ సదస్సుల్లో 8.65లక్షల దరఖాస్తులు వచ్చాయని ఇందులో ప్రధానంగా సాదాబైనామా,సర్వేనెంబర్ మిస్సింగ్, అసైన్డ్ ల్యాండ్ , అసైన్డ్ ల్యాండ్ రెగ్యులరైజేషన్, సక్సెషన్ కు సంబంధించి సుమారు 6 లక్షల దరఖాస్తులు వచ్చాయని వీటిని ఐదు విభాగాలుగా విభజించి ప్రతి దరఖాస్తును సమగ్రంగా పరిశీలన జరిపి ఆగస్టు 15వ తేదీలోగా వీలైనన్ని సమస్యలను పరిష్కరించాలన్నారు. సాదాబైనామాల అంశం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని కోర్టు తీర్పుకోసం వేచిచూడకుండా దరఖాస్తులను పరిశీలించి పరిష్కారం కోసం సిద్ధం చేసుకోవాలన్నారు. జిల్లాల్లోని అసైన్డ్‌ల్యాండ్, లబ్దిదారుల వివరాలను ఈ నెల 30వ తేదీ లోగా ప్రభుత్వానికి పంపించాలని కలెక్టర్లకు సూచించారు.దరఖాస్తుల సంఖ్యను తగ్గించుకోవడానికి ఇష్టం వచ్చిన రీతిలో తిరస్కరించకూడదని, తిరస్కారానికి గల కారణాలను లిఖిత పూర్వకంగా దరఖాస్తుదారునికి తెలియజేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర స్దాయిలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.ఈనెల 27వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జిపీవోలకు జె ఎన్ టి యు ఆధ్వర్యంలో లైసెన్స్ డ్ సర్వేయర్లకు పరీక్ష నిర్వహిస్తున్నామని ఇందుకు అవసరమైన





ఏర్పాట్లను చేసుకొని పకడ్బందీగాపరీక్ష నిర్వహించాలన్నారు. ఇంటి నిర్మాణంలో పేదవాడికి ఏ సమస్య రాకూడదు పేదవాడి సొంతింటి కల ఇందిరమ్మ ఇండ్ల నిర్మణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ధరలు, చెల్లింపులు, ఇసుక, సిమ్మెంట్, స్టీల్ విషయంలో ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏ సమస్య రాకుండా చూడాలని అలాగే ధరల నియంత్రణ కమిటీ చురుగ్గా పనిచేసేలా కలెక్టర్లు నిత్యం పర్యవేక్షించాలన్నారు.ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం అవసరమైన ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని , ఇది సరైన విధంగా లబ్దిదారులకు అందేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. లబ్దిదారులపై రవాణా భారం అధికంగా పడకుండా వీలైనంత దగ్గరలో ఇసుక అందేవిధంగా చూడాలన్నారు. బేస్‌మెంట్ నిర్మాణం కోసం అక్కడక్కడ అందుబాటులో ఉన్న మట్టిని తీసుకెళ్తున్న లబ్దిదారులపై పోలీసులు కేసులు నమోదుచేయడం సరైన చర్య కాదని ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా కలెక్టర్లు, ఎస్పీలు చర్యలు తీసుకోవాలన్నారు.ఎల్-1, ఎల్-2, ఎల్-3 జాబితాలతో సంబంధం లేకుండా నిరుపేదలైతే ఇల్లు కేటాయించాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులున్నాకూడా ప్రతి సోమవారం చెల్లింపులు జరుపుతున్నామని అయితే సాంకేతిక సమస్యలతో కొంతమంది లబ్దిదారుల ఖాతాలో డబ్బులు జమ కావడం లేదని ఇటువంటి సమస్యలను ముందుగానే గుర్తించి లబ్దిదారునికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. 2 బిహెచ్‌కే ఇండ్లకు సంబంధించి స్పెషల్ డ్రైవ్ నిర్వహించి అర్హులైన లబ్దిదారులకు కేటాయించాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఐడిఓసి కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భూభారతి చట్టం 2025 అమలులో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు ఒకవేళ తిరస్కరణకు గురైతే దానికి గల కారణాలను పొందుపరచాలని అధికారులను ఆదేశించారు. ఐదు రోజుల్లో రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన దరఖాస్తుల పూర్తి వివరాలు నివేదికలు అందజేయాలన్నారు. ఆగస్టు 15 నాటికి జిల్లా వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రక్రియ వేగవంతం అయ్యేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరై నిర్మాణం మొదలు పెట్టని వారిని గుర్తించి త్వరితగతిన నిర్మాణాలు పూర్తి అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సిమెంటు, స్టీలు ధరలు నియంత్రించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ దసలవారీగా డబ్బులు జమ అయ్యే విధంగా అన్ని ఏర్పాట్లు చేయాలని అలసత్వం ప్రదర్శించరాదని అధికారులను హెచ్చరించారు. వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా వనమహోత్సవ లక్ష్యాలను త్వరితగతిని పూర్తి చేయాలని అటవీ శాఖ అధికారులు సహకారంతో విస్తృతంగా తాటి చెట్లు నాటే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డిడి ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, పిడి హౌసింగ్ రవీంద్రనాథ్, షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ అధికారి అనసూయ, బీసీ సంక్షేమ అధికారి ఇందిరా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి, పౌరసరఫరాల శాఖ మేనేజర్ త్రినాథ్ బాబు, ఎక్సైజ్ సూపరింటెంట్ జానయ్య, జిల్లా వైద్యశాఖ అధికారి జయలక్ష్మి సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ సి డబ్ల్యూ ఏ ఉద్యోగులకు క్వార్టర్స్ కౌన్సిలింగ్

**నిర్వహించిన కొత్తగూడెం ఏరియా సింగరేణి యాజమాన్యం.**

**సింగరేణి జూలై 22 (స్కై న్యూస్ ):** కొత్తగూడెం ఏరియాలోని ఎన్ సి డబ్ల్యూ ఏ ఉద్యోగులకు క్వార్టర్స్ కౌన్సిలింగ్ ను నిర్వహించడం జరిగింది. క్వార్టర్స్ కౌన్సిలింగ్ కు 76 మంది ఉద్యోగులు దరఖాస్తులు చేసుకొగా వారి యొక్క అర్హత, కేటగిరి, పదవిని బట్టి పూర్తి పారదర్శకతతో వారికి క్వార్టర్స్ కౌన్సిలింగ్ ను నిర్వహించి వారికి క్వార్టర్స్ ను కేటాయించటం జరిగింది.76 దరఖాస్తులకు గాను 29 మంది వారి అర్హతకు తగిన క్వార్టర్స్ ను తీసుకోగా, 03 మంది



కౌన్సిలింగ్ కి హాజరై క్వార్టర్స్ తీసుకోలేదు 44 మంది కౌన్సిలింగ్ కు హాజరు కాలేదు.ఈ కార్యక్రమంలో డిజిఎం పర్సనల్ జి.వి. మోహన్ రావు, తో పాటు కొత్తగూడెం ఏరియా ఏ.ఐ.టి.యు.సి అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జె. గట్టయ్య, ఐ.ఎన్.టి.యు.సి వైస్ ప్రెసిడెంట్ ఎండి రజాక్ డివైపిఎం జి. హరీష్ ఆఫీస్ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది క్వార్టర్స్ కౌన్సిలింగ్ కు హాజరైన ఉద్యోగులు పాల్గొనడం జరిగింది.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137